RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

**రిపోర్టర్లు కావలెను...**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వుదయం తెలుగు దిన పత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవజ్ఞులైన అభ్యర్థులు కావలెను.

\- సిరికొండ అగస్టిన్
BA.L.L.B., M.C.J.
వుదయం ఎడిటర్

సెల్: 9247698676

సంపుటి : 13 | సంచిక : 192 | ఆదిలాబాద్ | గురువారం, నవంబర్ 20 , 2025 | VOODAYAM Telugu Daily | వెల : రూ. 3.00 | పేజీలు : 12

# ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభించిన సీఎం రేవంత్



హైదరాబాద్ , : ఇందిరమ్మ చీరల పంపిణీని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. పలువురు మహిళలకు చీరలను ఆయన పంపిణీ చేశారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా అంతకుముందు నెక్లెస్ రోడ్‌లో ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు.

రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు. నేటి నుంచి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం (డిసెంబరు 9) నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రెండో దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) వరకు పట్టణ ప్రాంతాల్లో అందజేయనున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని చెప్పారు. ఇందుకు నియోజకవర్గానికో ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి.. వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా భవిష్యత్తులో సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది మహిళలకు, మున్సిపాలిటీల్లో 35 లక్షల మంది మహిళలకు చీరల పంపిణీ చేస్తామని వివరించారు. "ఇందిరమ్మ స్ఫూర్తితో మా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మహిళలు పెట్రోల్ బంకులు నిర్వహించుకునేలా ప్రోత్సహించాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశాం. మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపట్టాం. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం. రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తోంది. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరఫున సారె పెట్టి గౌరవించాలని భావించాం. అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు ఇందిరమ్మ చీర కట్టుకోవాలి. మీరే బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటాలి" అని సీఎం అన్నారు.



## రైతులకు శుభవార్త..
### పీఎం కిసాన్ నిధులు విడుదల

దిల్లీ: రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం- కిసాన్ని ధులు విడుదలయ్యాయి. ఈ పథకం కింద 21వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. దేశవ్యాప్తంగా తొమ్మిది కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లకు పైగా నిధులు జమకానున్నాయి.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైంది. పీఎం కిసాన్ పథకం కింద దేశవ్యాప్తంగా కోట్లాది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. ఇప్పటి వరకు 20 విడతల్లో రూ.3.70 లక్షల కోట్లకు పైగా నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. భూమి వివరాలు పోర్టల్‌లో నమోదై ఉండి, బ్యాంకు ఖాతా ఆధార్‌తో లింక్ అయి ఉన్న రైతులకు పథకం ప్రయోజనాలు అందుతున్నాయి.

## కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒక్కొక్కరిగా గులాబీ తీర్థం



కొండాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒక్కొక్కరిగా గులాబీ తీర్థం పుచ్చుకుంటున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటరీ మందగడ్డ విమల్‌కుమార్, ఇతర కాంగ్రెస్ నాయకులు పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇచ్చిన హామీలపై ప్రజలు అడిగే ప్రశ్నలకు సాధనలు చెప్పలేకపోతున్నట్లు నాయకులు వాపోతున్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గ్రేటర్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నవతా రెడ్డి తెలిపారు. ప్రతి కార్యకర్తను కలుపుకుని ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాలా హరీశ్, మల్లారెడ్డి, శ్రీకాంత్, సంగారెడ్డి, మల్లేశ్, రవీందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులు లొంగిపోవాలి

**.. మావోయిస్టు దళ మాజీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్**



హైదరాబాద్ : మావోయిస్టులు లొంగిపోవాలని కోరుతున్నట్లు మావోయిస్టు దళ మాజీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మల్లోజుల వీడియో సందేశం పంపారు.నిన్నటి ఎన్‌కౌంటర్‌లో హిడ్మా సహా ఆరుగురు చనిపోవడం బాధాకరం అని మల్లోజుల పేర్కొన్నారు. మావోయిస్టులు లొంగిపోవాలని కోరుతున్నాను అని చెప్పారు. మారిన పరిస్థితుల దృష్ట్యా సాయుధ పోరాటం కొనసాగించలేం. ప్రజల్లో చేరి పోరాటం చేయాలని కోరుతున్నా. ప్రజల్లో ఉండి రాజ్యాంగబద్ధంగా పోరాటం సాగించాలి. పరిస్థితులు మారుతున్నాయి.. దేశం కూడా మారుతోంది. ఎన్‌కౌంటర్లలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతో పాటు పలువురి ప్రాణాలు పోయాయి. మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడం బాధ కలిగించింది అని మల్లోజుల పేర్కొన్నారు. లొంగిపోవాలనుకునే మావోయిస్టులు నన్ను సంప్రదించొచ్చు. నా ఫోన్ నంబర్ 8856038533 కు సంప్రదించవచ్చు అని మల్లోజుల సూచించారు.

## ఇంటర్‌పోల్ సాయం కోరేందుకు సిద్ధమైన బంగ్లాదేశ్



న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కు స్థానిక 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణ శిక్ష విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె భారత్‌లో రహస్య ప్రదేశంలో ఆశ్రయం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఐసీటీ తీర్పు నేపథ్యంలో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం ఆమెను భారత్ నుంచి స్వదేశానికి రప్పించేందుకు చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే ఇంటర్‌పోల్ సాయం కోరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మానవత్వానికి వ్యతిరేకంగా క్రూర నేరాలకు పాల్పడ్డారనే కారణంతో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్ష విధిస్తున్నట్లు ఆ దేశ ప్రత్యేక ట్రిబ్యునల్ సోమవారం తీర్పు ప్రకటించింది. షేక్ హసీనా పరోక్షంలో విచారణ జరిపిన ట్రిబ్యునల్ హసీనా ప్రభుత్వంలో హోం మంత్రిగా పనిచేసిన సదుజ్జమాన్ ఖాన్ కమల్‌కు కూడా ఉరిశిక్ష విధించింది. ప్రస్తుతం వారు భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వారి అప్పగింతపై యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఇంటర్‌పోల్ సాయం కోరేందుకు సిద్ధమైనట్లు బంగ్లా మీడియా నివేదించింది.

## నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

నిజామాబాద్ , : నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేపట్టింది. టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఏసీబీ అధికారులు దృష్టిపెట్టారు. ఫైళ్లు, రికార్డులు, డిజిటల్ డేటాను పరిశీలించారు. నిబంధలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారని,

భవన నిర్మాణాల కోసం భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ ఈ సోదాలు చేపట్టినట్లు సమాచారం.

## శాసనసభాపక్ష నేతగా నితీశ్.. ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధం



పాట్నా : బిహార్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరేందుకు రంగం సిద్ధమైంది. మరోసారి బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ఖరారయ్యారు. ఈ మేరకు ఎన్డిఎ శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు.. తమ కూటమి నేతగా నితీశ్‌ను ఎన్నుకున్నారు. మరికొద్ది సేపట్లో గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని లేఖ అందించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు గురువారం పదోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నితీశ్ ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది.

## క్యూఆర్ కోడ్‌లతోనే ఆధార్ కార్డు!

దిల్లీ: సమాచార భద్రత కోసం ఎటువంటి వివరాల్లేకుండా కేవలం ఫొటో, క్యూఆర్ కోడ్‌తోనే కొత్త ఆధార్ కార్డును ప్రవేశపెట్టాలని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) యోచిస్తోంది. తద్వారా పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగపరిచే అవకాశాన్ని నివారించడంతోపాటు ఆఫ్‌లైన్ పద్ధతిలో ఆధార్ కార్డును పరిశీలించే పద్ధతికి స్వస్తి పలకవచ్చని సంస్థ భావిస్తోంది. ఆధార్ కొత్త యాప్‌పై జరిగిన బహిరంగ ఆన్‌లైన్ సమావేశంలో యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ ఈ విషయం వెల్లడించారు. హోటళ్లు, ఈవెంట్లు తదితరచోట్ల ఆధార్ కాపీని తీసుకునే విధానాన్ని నివారించేందుకు ఈ కొత్త నియమాన్ని వచ్చే నెల నుంచి అమలులోకి తేవాలని యోచిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేవలం వయసును మాత్రమే తెలియజేసి ఇతర ప్రైవేటు సమాచారాన్ని దాచేలా ఈ నిబంధనను రూపొందించబోతున్నారు. 'కార్డుపై పౌరుడి పూర్తి వివరాలు ఇవ్వాల్సిన అవసరం ఏముందని యోచిస్తున్నాం. ఫొటో, క్యూఆర్ కోడ్ ఉంటే చాలు' అని ఆయన పేర్కొన్నారు. 'ఆధార్ నంబరును సేకరించడం, కాపీలను నిల్వ ఉంచుకోవడం నిషిద్ధమని ఆధార్ చట్టం చెబుతోంది. అయినప్పటికీ అనేక సంస్థలు ఆధార్ కార్డు కాపీలు తీసుకోవడంతోపాటు వాటిని తమవద్ద ఉంచుకుంటున్నాయి' అని భువనేశ్ కుమార్ తెలిపారు.

## ఐ-బొమ్మ కేసు.. ఇమంది రవి కస్టడికి నాంపల్లి కోర్టు అనుమతి

హైదరాబాద్: ఐ-బొమ్మ కేసులో అరెస్ట్ అయిన ఇమంది రవిని కస్టడీకి అనుమతిస్తూ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ మూవీ రాకెట్ ఐ-బొమ్మ కీలక సూత్రధారిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రవిని ఏడు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు.. ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కస్టడీ విచారణలో మరికొన్ని కీలక అంశాలు వెలుగు చూసే అవకాశముంది. ఇప్పటికే ఇమంది రవి కేసుపై ఈడీ దృష్టి సారించింది.

# ఆన్‌లైన్‌లో విరాళాల సేకరణ

## భారత్‌లో ఫిదాయిన్ దాడులకు జైషే ప్లాన్..



దిల్లీ : దేశ రాజధాని దిల్లీలోని చారిత్రక ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై దర్యాప్తు చేస్తుండగా సంచలన విషయాలు బయటికొస్తున్నాయి. భారత్ వ్యాప్తంగా భీకర దాడులకు పాల్పడేందుకు పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠా భారీఎత్తున ప్రణాళికలు చేస్తున్నట్లు నిఘా వర్గాలు పసిగట్టాయి. ఇందుకోసం ఫిదాయిన్ ఆర్మీని సిద్ధం చేసేందుకు డిజిటల్ ఛానళ్ల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.ముజాహిదీన్‌ల కోసం వింటర్ కిట్‌లను స్పాన్సర్ చేయాలంటూ జైషే నిధులు సేకరిస్తోందని, ఇందుకు తగిన సాక్ష్యాలను గుర్తించినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఒక్కొక్కరి నుంచి 20వేల పాకిస్థాన్ రూపాయల (భారత కరెన్సీలో దాదాపు రూ.6,300) చొప్పున ఈ డొనేషన్లను సేకరిస్తున్నట్లు పేర్కొన్నాయి. వీటిని పాకిస్థాన్ ఈ-వాలెట్ ప్లాట్‌ఫామ్‌లు, సదాపే వంటి డిజిటల్ పేమెంట్ యాప్‌ల నుంచి స్వీకరిస్తున్నట్లు సమాచారం. ఉగ్ర విభాగాలకు వీలైనంత త్వరగా నిధులు చేరేలా ఆన్‌లైన్‌లో వీటిని సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ డిజిటల్ నెట్‌వర్క్‌పై భారత దర్యాప్తు బృందాలు ప్రత్యేక దృష్టి సారించినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి.ఎర్రకోట వద్ద బాంబు పేలుడుతో మారణహోమం సృష్టించిన డాక్టర్ ఉమర్ నబీకి సంబంధించిన వీడియో నిన్న బయటకు వచ్చింది.

అందులో ఫిదాయిన్ తరహా దాడుల గురించి అతడు ప్రస్తావించడం గమనార్హం. ఆత్మాహుతికి పాల్పడటాన్ని బలిదానంగా పేర్కొన్నట్లు అందులో ఉంది. ఇప్పటికే జైషే ప్రత్యేక మహిళా విభాగాన్ని కూడా ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఈ ముఠా అధినేత మసూద్ అజార్ సోదరి సాదియా నేతృత్వం వహిస్తోన్న మహిళా విభాగానికి జమాత్ ఉల్ ముమినత్ అని పేరు పెట్టారు. ఈ విభాగం ఆన్‌లైన్‌లో రిక్రూట్‌మెంట్ చేపడుతోందని, భారత్‌లోని మహిళలను ఆకర్షించేందుకు కుట్రలు పన్నుతోందని నిఘా వర్గాలు గుర్తించాయి. ఎర్రకోట పేలుడు ఘటనలో కీలక నిందితురాలైన డా.షాహినా సయీద్ కూడా ఈ మహిళా విభాగంలో సీనియర్ సభ్యురాలని దర్యాప్తు వర్గాలు తెలిపాయి. 'మేడమ్ సర్జన్' అనే కోడ్ నేమ్‌తో ఈమె ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్నట్లు పేర్కొన్నాయి.

# సిద్దిపేట సహాయ కార్మిక లేబర్ అధికారి పై తక్షణ చర్యలు తీసుకోండి బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు




సిద్దిపేట, నవంబర్ 19(వుదయం ప్రతినిధి)సిద్దిపేట పట్టణ కేంద్రంలో బుధవారం సహాయ కార్మిక లేబర్ అధికారి కార్యాలయంలో ప్రజా సమస్యలను విన్నవించడానికి బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు వెళ్లగా, అక్కడ అధికారులు అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగించింది. జిల్లా అధికారికి ఫోన్ చేసినప్పటికీ, స్పందన లేకుండా ఉండటం ప్రజా సమస్యల పట్ల నిర్వాహక వ్యవస్థ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోందని బీఎస్పీ నాయకులు ఎద్దేవా చేశారు. గత 15 రోజులుగా సంబంధిత అధికారిని సంప్రదించడానికి ఎన్నోసార్లు ప్రయత్నించినప్పటికీ, ఫోన్ రెస్పాన్స్ లేకపోవడం, కార్యాలయానికి వచ్చినా అక్కడ అధికారి అందుబాటులో లేకపోవడం అత్యంత దుర దృష్టకరమని తెలిపారు. ఈ నిర్లక్ష్యంతో రోజూ కార్యాలయానికి వచ్చే కార్మికులు, కూలీలు మరియు సాధారణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిర్యాదు చేయడానికి కూడా అధికారులు లేకపోవడం పరిపాలన వైఫల్యమని బీఎస్పీ తీవ్రంగా పేర్కొంది. బహుజన్ సమాజ్ పార్టీ తరపున జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాల్సిన అధికారి, ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నాడు. తక్షణమే సంబంధిత సహాయ కార్మిక లేబర్ అధికారిపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో బహుజన్ సమాజ్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుంది" అని హెచ్చరించారు.కార్మికుల సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, ప్రమాద బీమా, ఓవర్‌టైమ్, వేతన వివాదాలు నెలల తరబడి పెండింగ్ లో ఉన్నాయని అధికారి నిర్లక్ష్యంతో జిల్లా కార్మిక శ్రామికులకు న్యాయం అందడం లో ఆటంకం కలుగుతోందని ప్రభుత్వ పాలసీల అమలు కూడా సక్రమంగా జరగడం లేదని బాధ్యతా రాహిత్యాన్ని కొనసాగిస్తే జిల్లా ప్రజాభ్యున్నతి దెబ్బతింటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండనోళ్ల నరేష్, నాయకులు కనక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బండి నరేష్ నియామకం



గజ్వేల్, నవంబర్ 19 (వుదయం ప్రతినిధి) దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సిద్దిపేట జిల్లా ఆర్గనైజషన్ సెక్రటరీగా జగదేవపూర్ మండలంలో తిగుల్ గ్రామానికి చెందిన బండి నరేష్ ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల చెంద్రం, యువజన విద్యార్థి విభాగం ఐకాస రాష్ట్ర ఇంచార్జ్ వనం రమేష్, రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరిలు తెలిపారు. బుధవారం సిద్దిపేట లో బండి నరేష్ కు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం మాట్లాడుతూ సంఘం కార్యక్రమాలను అనుసరించి గ్రామాల్లో మండలాల్లో కమిటీలు వేస్తూ సంఘంను ముందుకు తీసుకుపోవాలని సూచించారు. దళితుల అభివృద్ధికి కృషి చేయాలని, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవచూపాలని సూచించారు.దళిత హక్కుల సాధనతో ముందుకుపోతామని తెలిపారు.

# మండల ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక







ధర్మపురి నవంబర్ 19(వుదయం విలేకరి): పట్టణంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ధర్మపురి మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.మండల శాఖ ఉపాధ్యాయ ఫెడరేషన్ ఎన్నికలు నిర్వహించారు.అధ్యక్షులుగా బండారి సతీష్, ప్రధాన కార్యదర్శి గా మెరుగు రమేష్, అసోసియేట్ అధ్యక్షుడు గా దేవకీ వెంకట రమణ, అదనపు ప్రధాన కార్యదర్శిగా బెజ్జంకి నితిన్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, ఓజ్జల మహేష్, దాసరి రాజన్న, సంద వెంకటేష్ కార్యదర్శులుగా పురం శెట్టి సత్యనారాయణ, ఈశ్వరుడు, సందారి కారి.రాజేష్,ఎస్ కనక య్య,ఎస్ మధు మహిళా కార్యవర్గ సభ్యులుగా చుంచుకాల సింధుజ, కోయల్ కార్ శిరీష,సునీత,మమత, జిల్లా కౌన్సిలర్లుగా గజ బీం కర్ గోవర్ధన్,నాయిని విజయానం దరావు,దాసరి భీమయ్య,కాసర్ల వెంకటరమణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ తన పై నమ్మకంతో గురుతర బాధ్యతలు అప్పగించి నందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ ఫెడరేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు అందు బాటులో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 19(వుదయం జిల్లా ప్రతినిధి):అధికారం ఉన్నప్పుడు ఒకలా అధికారం కోల్పోయాక మరోలా ఉండే నైజం కాదు ఆయనది అధికారంలో ఉన్నా లేకున్నా పేదవాడికి సాయం చేయాలన్న మంచి మనస్సున్న నాయకుడే మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సాధారణంగా ఓ రాజకీయ నాయకుడు తమ కార్యకర్త, నాయకుడి ఇంట్లో జరిగే శుభ కార్యమో లేక అశుభ కార్యం ఉంటే వెళ్లడం సహజం కానీ ఇక్కడ మాత్రం అందుకు బిన్నంగా ఓ సాధారణ వ్యక్తి చనిపోతే ఆ వ్యక్తి దశదిన కర్మకు వందల కిలోమీటర్లు వెళ్లి ఆ కుటుంబాన్నిపరామర్శించారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్ర సరిహద్దుల్లోని పలిమెల మండలం బూర్గుగూడెంకు చెందిన మట్టి శ్రావణ్ అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఆయన దశదిన కర్మ బుధవారం నిర్వహించగా విషయం తెలుసుకున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మట్టి శ్రావణ్ ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ముందుగా మృతుడు శ్రావణ్ చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించారు. ఇలా రాష్ట్ర సరిహద్దులో పర్యటించి మృతుడి కుటుంబాన్ని పరామర్శించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శ్రీపతి బాబు, నాయకులు, పెండ్యాల మనోహర్, ఆన్కారి ప్రకాష్, తిరుపతి,ముత్తయ్య మహిళా నాయకురాలు కేదారి గీత భాయ్, తోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన అంగన్వాడి భవనం నిర్మించాలి.. జి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర..



వెంకటాపురం నవంబర్ 19 (వుదయం ప్రతినిది) వెంక టాపుర ం మండలం కమ్మరిగూడెం గ్రామంలో నూతన అంగన్వాడి భవనంనిర్మించలనిజి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర అ న్నారు. బుధ వార ం మండల కేంద్రంలోని కమ్మరిగూడెం గ్రామంలో జి.ఎస్.పి ముఖ్య కార్యకర్తల సమావేశం నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ బెస్త గూడెం గ్రామపంచాయతీ కమ్మరిగూడెం గ్రామంలో అంగనవాడి నూతన భవనం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. చిన్న పిల్లలకు అంగనవాడి భవనం లేక చిన్నారులు చాలా ఇబ్బంది పడుతున్నారని అద్దె రూములో చిన్న పిల్లలకు బాలింతలకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ వెంటనే స్పందించి నూతన అంగన్వాడి కేంద్రాన్ని నిర్మించాలని ములుగు జిల్లా జిల్లా కలెక్టర్ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను.ఈ సందర్భంగా కోరారు.అలాగే బెస్త గూడెం అంగన్వాడి కేంద్రాన్ని మరమ్మతులు చేయాలని ఆయన కోరారు. బెస్త గూడెం అంగనవాడి భవనం అంతా భవనాని మరమ్మతులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మండల కేంద్రంలో అంగనవాడి కేంద్రాలు లేక అనేక రకములుగా చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాగరాజు అనీల్ వంశి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన పంట సత్వరమే కొనుగోలు చేయాలి..మంత్రి తుమ్మల




ఖమ్మం వుదయం ప్రతినిధి నవంబర్ –19 నాణ్యమైన పంట సత్వరమే కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు బుధవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి ధాన్యం, పత్తి పంటల కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో నాణ్యత పరిశీలించి కొనుగోలు చేసిన తర్వాత రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవాలని, ధాన్యం తేమ శాతం రాగానే వెంటనే కొనుగోలు పూర్తి చేసి రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. కౌలు రైతు వద్ద నుంచి కూడా పత్తి పంట మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు అనుసరిస్తున్న విధానాన్ని పత్తి పంట కొనుగోలుకు పాటించాలని అన్నారు. తేమ శాతం గ్రామాలలోనే చెక్ చేసుకునేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డిఎస్ఓ చందన్ కుమార్, డిసిఓ గంగాధర్, సివిల్ సప్లైస్ డి ఎం శ్రీలత, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు.

## డబ్ల్యు.జె.ఐ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సీనియర్ జర్నలిస్టు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి



కరీంనగర్, నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంఘమైన వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖ కార్యవర్గ సభ్యుడిగా సీనియర్ జర్నలిస్టు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి ఎంపిక య్యారు. వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖ వార్షిక సమావేశంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా కరీంనగర్ జిల్లా శాఖ తొలి కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తొలి కార్యవర్గంలో కార్యవర్గ సభ్యుడిగా తనకు అవకాశం ఇచ్చిన వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రావికంటి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యకులు తాడురి కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి ప్రమోద్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.సత్యనారాయణ లకు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## న్యూ శాయంపేటని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం



హనుమకొండ, నవంబర్ 19 (వుదయం జిల్లా ప్రతినిధి) : గడిచిన రెండేళ్లలో అత్యధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నాంగత పాలకుల పాలనలో అభివృద్ధికి నోచికోని 31 డివిజన్ శాయంపేటను గడిచిన రెండేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం రోజున నగర మేయర్ గుండు సుధారాణి గారితో కలిసి న్యూ శాయంపేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ.60 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణనికి భూమి పూజా చేశారు.పూర్తి గ్రామీణ వాతావరణంలో ఉన్న డివిజన్ ని గతంలో ఎవరు పట్టించుకోలేదని గడిచిన రెండేళ్లలో అత్యధికంగా నిధులు కేటాయించామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ లు మోహన్ రావు,శివ శంకర్,డివిజన్ అధ్యక్షులు సురేందర్,సీనియర్ నాయకులు, కార్యకర్తులు, అధికారులి పాల్గొన్నారు.

## మృతదేహంపై పూలమాల వేసిన మాజీ ఎంపీపీ

ఖానాపురం, నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): మండలంలోని మంగళవారిపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు మూడు వీరన్న తండ్రి మూడు బాలునాయక్ (75) అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహాన్ని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు సందర్శించి మృతదేహంపై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించిరు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనరసయ్య, మాజీ సర్పంచ్ లావుడియా రమేష్, సొసైటీ మాజీ డైరెక్టర్ భూషబోయిన రాజుయాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పైండ్ల యాదగిరి, గ్రామ పార్టీ యూత్ అధ్యక్షుడు బొల్లు మురళి యాదవ్, నాయకులు జలగం బాబు, మక్కా పెద్ద వెంకన్న, పీరునాకి రామ్మూర్తి, మేకల శ్రీనివాస్, గొంది నరసయ్య, గోలి స్వామి, మేకల కేశవులు, లాకావత్ రవి తదితరులు.

# సాంప్రదాయాలు విలువలను కాపాడి నప్పుడే కుటుంబాలు బాగుంటాయి





జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 19(వుదయం జిల్లా ప్రతినిధి)కుటుంబ పెద్దలు ఎలా తీర్చిదిద్దితే ఆయా కుటుంబాల్లోని మనుషులు అలా తయారవుతారని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ అన్నారు.జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సబ్ కోర్టు ప్రాంగణంలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం, వారి సంక్షేమం అనే అంశం మీద జరిగిన ఈ కార్యక్రమంలో జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లిదండ్రులను వేధించేవారికి ఆస్తులపై హక్కు ఉండదని జడ్జి పేర్కొన్నారు. సంప్రదాయ బద్ధంగా, విలువలతో జీవించి ముందు తరాలవారికి నేర్పించి నప్పుడే కుటుంబాలు బాగుంటాయని అన్నారు. పెద్దలను గౌరవించే సంస్కృతి పెరుగుతుందని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన పథకాలు వారికి చెందేవిధంగా కృషి చేయాలనీ జిల్లా సంక్షేమ అధికారికి, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ అధికారికి సూచనలు చేసారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుప్పాల శ్రీనివాస్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.అక్షయ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, వయోవృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వుదయం జిల్లా ప్రతినిధిని సన్మానించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): వుదయం కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గంగం రాజును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సన్మానించారు.భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంఘమైన వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖ కార్యవర్గ సభ్యుడిగా గంగం రాజు ఎంపికైన సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖకు ఎంపికైన కార్యవర్గ సభ్యులను సన్మానించారు.ఈ సందర్భంగా తొలి కార్యవర్గంలో కార్యవర్గ సభ్యుడిగా తనకు అవకాశం ఇచ్చిన వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యకులు తాడురి కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి ప్రమోద్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.సత్యనారాయణలకు గంగం రాజు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయులు సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలి



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 19(వుదయం జిల్లా ప్రతినిధి):ఉపాధ్యాయులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ పింగిళి విజయపాల్ రెడ్డి అన్నారు.విద్యార్థులకు సాంకేతిక రంగంలో విద్యాపరంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో బుధవారం ఎ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్" అనే పాఠ్యాంశంపై జిల్లాలోని 12 మండలంలోని ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న 250 మంది గణితం మరియు భౌతిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్లకు మూడు రోజులపాటు జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ భూపాలపల్లి పాఠశాలలో భౌతిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్ కు మరియు గణపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ గణపురం పాఠశాలలో గణిత శాస్త్ర స్కూల్ అసిస్టెంట్లకు సాంకేతిక విద్య పై శిక్షణ కార్యక్రమం మొదలైనది. విద్యాపరంగా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా బోధన వ్యూహాలు ఉండాలని సమర్థవంతమైన బోధనను తరగతిలో కొనసాగించడానికి ఏ విధమైన సాంకేతికతను వినియోగించాలో ఉపాధ్యాయులకు శిక్షణ ద్వారా తెలియజేశారు దానిని తరగతి గదిలో ఎలా అమలు చేయాలో తెలుసుకోవడానికి ఈ శిక్షణ కార్యక్రమం తోడ్పడుతుందని అలాగే ఆరు నుండి తొమ్మిదవ తరగతి వరకు సాంకేతిక విద్యకు సంబంధించిన పాఠ్యప్రణాళికను తరగతి గదిలో అమలుపరచుటకు ఉపాధ్యాయులను సన్నద్ధులను చేయడానికి ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం తోడ్పడుతుందని దీనితోపాటు క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు తమ బోధన వ్యూహాలను మార్చుకొని సులభతరంగా సమర్థవంతమైన బోధనను కొనసాగించి విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను రాబట్టడానికి ఈ శిక్షణ కార్యక్రమం తోడ్పడుతుందని వారు తెలిపారు. కృత్రిమ మహేష్ కు నైపుణ్యాలకు పెరుగుతున్న డిమాండ్ కు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి కేంద్రం ప్రయత్నం చేస్తున్నదని ఉపాధ్యాయులు డిజిటల్ విద్యాబోధన కూడా సమర్థవంతంగా పాఠశాలలో వినియోగించడానికి ఈ శిక్షణ ఎంతగానో తోడ్పడుతుందని వారు తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, సతీష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతి

మధిర, నవంబర్19(వుదయం ప్రతినిధి) మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరా గాంధీ భారత రాజకీయాలలో అపూర్వమైన నాయకత్వం కనబరిచారు. దేశ అభివృద్ధి, జాతీయ ఏకత కోసం ఆమె చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆమె చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం,అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతుంది. గ్రామీణ ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయం అని పేర్కొన్నారు.

# కోటి మంది మహిళలకు రెండు దఫాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ

ఖమ్మం, వుదయం ప్రతినిధి నవంబర్–19 కోటి మంది మహిళలకు రెండు దఫాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి , కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు లతో కలిసి వీడియో సమావేశం నిర్వహించగా, ఈ వీసీలో మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ భారతరత్న దేశ మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ 108వ జయంతి సందర్భంగా కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. మహిళలకు సోదరుడిగా పుట్టింటి నుంచి సారె అందిస్తున్నట్లు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, మండల కేంద్రాలలో స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి చీరల పంపిణీ చేయాలని అన్నారు. మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరుతో ఈ కార్యక్రమం అమలు చేయాలని అన్నారు. మహిళా సంఘాలకు 27 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందించిందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు బస్సులకు యజమానులుగా చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యత కూడా మహిళా సంఘాలకు అప్పగించామని అన్నారు.554 కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మహిళా సంఘాలతో చేపట్టామని అన్నారు. పెట్రోల్ బంక్, సోలార్ పవర్ ప్లాంటశిల్పారామం దగ్గర



మహిళా సంఘాల ఉత్పత్తులను విక్రయించేందుకు 150 షాపులను ఇందిరా మహిళా శక్తి బజారు పేరిట ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులను ఆన్ లైన్ ద్వారా విక్రయించేందుకు అమెజాన్ సంస్థతో చర్చలు జరుపుతున్నామని, అంతర్జాతీయ స్థాయిలో మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు గుర్తింపు తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. చీరల పంపిణీ సమయంలో ఎఫ్.ఆర్.ఎస్. ద్వారా ప్రతి మహిళ ఫోటో, ఆధార్ కార్డు వివరాలు సేకరించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో 18 సంవత్సరాలు వయస్సు నిండిన 65 లక్షల మంది మహిళలకు మొదటి విడతగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని, వచ్చే సంవత్సరం మార్చి 1 నుంచి మార్చి 8 వరకు పట్టణ ప్రాంతాలలో 35 లక్షల చీరల పంపిణీ జరుగుతుందని అన్నారు.

# సిడ్నీలో విషాదం.. భారత్‌కు చెందిన గర్భిణి మృతి

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు దాటుతుండగా అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో భారత్‌కు చెందిన ఓ మహిళ మృతి చెందారు. మృతురాలు 8 నెలల గర్భిణి కావడం మరింత విషాదకరం. గత వారాంతంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..భారత్‌కు చెందిన 33 ఏళ్ల సమన్విత ధారేశ్వర్ కుటుంబం హార్న్‌స్‌బై ప్రాంతంలో నివాసముంటోంది. 8 నెలల గర్భిణి అయిన సమన్విత తన భర్త, మూడేళ్ల కుమారుడితో కలిసి సమీపంలోని పార్క్ వద్దకు వాకింగ్‌కు వెళ్లారు. ఈ క్రమంలోనే ఫుట్‌క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన బీఎండబ్ల్యూ కారు ఆమెను బలంగా ఢీకొట్టింది.ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన సమన్వితను హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గర్భస్థ శిశువు ప్రాణాలు కూడా దక్కలేదని తెలిపారు. మరికొన్ని వారాల్లో డెలివరీ కావాల్సిఉండగా.. ఈ లోగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సమన్విత భర్త కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదానికి కారణమైన బీఎండబ్ల్యూ కారును నడిపింది 19 ఏళ్ల ఆరోన్ పపాజోగ్లుగా గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. మృతురాలు సమన్విత స్థానికంగా ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో టెస్ట్ అనలిస్ట్‌గా పనిచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# న్యాయం జరిగే దిశగా కీలకమైన అడుగే.. కానీ!

పదవీచ్యుతురాలైన బంగ్లా ప్రధాని హసీనాపై బంగ్లాదేశ్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు బాధితులకు న్యాయం అందించే దిశగా కీలకమైన అడుగు అని ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యానించింది. అయితే ఆమెకు మరణశిక్ష విధించడంపై విచారం వ్యక్తం చేసింది. పరిస్థితులేవైనా మరణశిక్ష విధించడాన్ని వ్యతిరేకించాలన్న వైఖరికి కట్టుబడి వుండాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషనర్ వోల్కర్ టర్క్ అభిప్రాయపడ్డారు. ఆ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ చెప్పారు. జవాబుదారీతనమనేది చాలా కీలకమని యుఎన్ చీఫ్ ముఖ్య ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ వ్యాఖ్యానించారు. అయితే అదే సమయంలో ఈ తీర్పు వెలువడిన తర్వాత ప్రజలు శాంతి, సంయమనం పాటించడం కూడా అంతే కీలకమని అన్నారు. ఏదిఏమైనా అన్ని పరిస్థితుల్లోనూ మరణశిక్ష విధింపును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రతినిధి రవీనా షామ్‌దాసాని స్పష్టం చేశారు. అల్లర్లకు కారకులెవరో నిర్ధారించడం చాలా ముఖ్యమైన అంశమని, అది కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి పరోక్షంలో విచారణ సాగుతున్నపుడు మరింత ప్రాధాన్యత సంతరించుకుంటుందని అన్నారు. అయితే గతంలో జరిగిన ఉల్లంఘనలు వంటివి పునరావృతం కాకూడదంటే సెక్యూరిటీ రంగంలో కూడా సంస్కరణలు అవసరమని షామ్‌దాసాని పేర్కొన్నారు.

# 100 రఫేల్ జెట్ల కొనుగోలుకు ఒప్పందం
## రష్యాతో యుద్ధం వేళ ఉక్రెయిన్ భారీ డీల్



రష్యా, ఉక్రెయిన్ ఇరు దేశాల మధ్య పరిస్థితులు ఇంకా చక్కబడలేదు. ఈ క్రమంలో రష్యాతో యుద్ధంలో పైచేయి సాధించేందుకుగాను ఉక్రెయిన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ యుద్ధంలో విజయం కోసం ఇప్పటికే విదేశాల నుంచి అత్యాధునిక ఆయుధాలు కొనుగోలు చేస్తోన్న ఉక్రెయిన్ తాజాగా ఫ్రాన్స్‌తో భారీ డీల్ కుదుర్చుకుంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 100 రఫేల్ ఫైటర్ జెట్లు కొనుగోలు చేయబోతుంది. ఈమేరకు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. దీనికి సంబంధించి ఫ్రాన్స్ లో రెండు దేశాల మధ్య కీలక పత్రం మీద ఇరు దేశాధానేతలు సంతకం చేసినట్లు పారిస్‌లో ఉన్న ఉక్రెయిన్ దౌత్య కార్యాలయం ప్రకటించింది. అలానే ఇదే విషయాన్ని ఫ్రాన్స్ అధ్యక్ష కార్యాలయం కూడా నిర్ధారిస్తూ ప్రకటన చేశాయి. 100 రఫేల్ జెట్ల కొనుగోలు అగ్రిమెంట్? మీద ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఉక్రెయిన్ ప్రెసిడెంట్ వొలోదిమిర్ జెలెన్‌స్కీ సంతకాలు చేశారు. తాజాగా జెలెన్ స్కీ ఫ్రాన్స్‌లో పర్యటించారు. ఈక్రమంలో రెండు దేశాల మధ్య ఈ భారీ ఒప్పందం కుదిరింది. రష్యా దాడుల కొనసాగుతున్న వేళ తమ వైమానిక రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఉక్రెయిన్ ఈ భారీ ఒప్పందం కుదుర్చుకుంది. రష్యాతో యుద్ధం మైదలైన తర్వాత జెలన్ స్కీ ఫ్రాన్స్‌లో పర్యటించడం ఇది 9వ సారి. ఫ్రాన్స్ నుంచి ఉక్రెయిన్ అత్యాధునిక ఆయుధాలు కొనుగోలు చేయాలని భావిస్తోందని.. దానిలో భాగంగానే రఫేల్ జెట్ల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుందని ఫ్రాన్స్ కార్యాలయం ప్రకటించింది. అయితే.. ఈ ఒప్పంద విలువ, విమానాల డెలివరీ డేట్? వంటి ఇతర వివరాల గురించి రెండు దేశాలు ఎలాంటి సమాచారం వెల్లడించలేదు. ఫ్రాన్స్?కు చెందిన డసాల్ట్ ఏవియేషన్ తయారు చేస్తోన్న రఫేల్ ఫైటర్ జెట్స్‌కు ప్రపంచ దేశాల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. వీటి శక్తి సమార్థ్యాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. రఫేల్ రంగంలోకి దిగిందంటే.. ప్రత్యర్థులు పరార్ కావాల్సిందే. పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా.. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో రఫేల్ యుద్ధ విమానాలే కీలకంగా వ్యవహరించాయి.

# హైదరాబాద్ ఉగ్రవాదిపై సబర్మతి జైలులో దాడి



గాంధీనగర్: సబర్మతి సెంట్రల్ జైలులో ఉన్నఉగ్రవాద నిందితుడు సయ్యద్ అహ్మద్ మెహియుద్దీన్ అబ్దుల్ ఖాదర్ జిలానీపై ముగ్గురు ఖైదీలు దాడి చేశారు.జైలులో ఖైదీలు దాడి చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దొంగతనం కేసులో శిక్ష అనుభవిస్తున్న నీలేష్ శర్మ మరో ఇద్దరు నిందితులు కలిసి జిలానీపై దాడి చేయడంతో ముక్కు, కళ్లు ప్రాంతంలో గాయాలయ్యాయి. దేశభక్తిని చాటుకునేందుకే నిందితులు ఉగ్రవాది జిలానీపై దాడి చేశారని జైలు అధికారి వెల్లడించారు. దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు వెంటనే అప్రమత్తమై ఇరువురిని అదుపు చేశారు. ఈ క్రమంలో జైలులో టెన్షన్ వాతావరణం నెలకొంది. ప్రస్తుతం జిలానీకి జైలులోనే మెడికల్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉంటే హైదరాబాద్ కు చెందిన జిలానీ చైనాలో ఎంబీబీఎస్ చదువుకున్నాడు. తరవాత దుబాయ్ లో ప్రాక్టీస్ చేశాడు. కానీ వైద్యం పై దృష్టి పెట్టకుండా ఉగ్రవాదంవైపు ఆకర్షితుడు అయ్యాడు. రెసిన్ అనే రసాయనం తయారు చేసి భారీ ఉగ్రకుట్రకు ప్లాన్ చేశాడు. కానీ ఇంటిలిజెన్స్ అప్రమత్తం అవ్వడంతో కటకటాల పాలయ్యాడు.

# విద్యార్థులు, కార్మికులపై వేధింపులు వద్దు



శ్రీనగర్: దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, కార్మికులు ఎదుర్కొంటున్న వేధింపులపై సీపీఐ(ఎం) నేత ఎం.వై.తరిగామి తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ వేధింపులు ఆగాలని డిమాండ్ చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో చదువుకుంటున్న యువతరంలో ఈ వేధింపుల పరిస్థితులు తీవ్రమైన భయాందోళనలను సృష్టించాయని అన్నారు. విద్యార్థులను ఈ వాతావరణంలోకి లాగవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. వారిని బెదిరింపులు లేదా అనుమానాలకు గురి చేయడానికి బదులుగా వారిలో ఒక రకమైన భద్రతా భావాన్ని కలిగించేలా ఈ దేశం హామీ కల్పించాలని కోరారు. విద్యార్థులు తమ చదువును, పనిని కొనసాగించడానికి భరోసా, సుస్థిరత, విశ్వాసం వంటివి అవసరమైన పరిస్థితుల్లో ప్రస్తుతమున్న ఇటువంటి వేధింపుల వాతావరణం వారికి అనువైన, సక్రమమైన వాతావరణాన్ని కల్పించలేదని తరిగామి పేర్కొన్నారు. ఇటువంటి హేయమైన ఉగ్రవాద కార్యకలాపాలకు బాధ్యులైన వారికి ఇక్కడ స్థానం లేకుండా చేస్తూనే మరోపక్క అమాయకులైన పౌరులు ఆందోళన చెందకుండా, అవమానాలకు గురి కాకుండా చూసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి వుందని ఆయన స్పష్టం చేశారు.ప్రజల ముఖ్యంగా యువత హృదయాలను, మనస్సులను గెలుచుకునే ప్రయత్నాలు చాలా కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. అలా కాకుండా అమాయకులను వెనక్కి నెట్టివేయడం వల్ల అర్ధవంతమైనదేమీ సాధించడానికి దోహదపడదని అన్నారు. నిరాశా నిస్పృహల వల్ల ఎప్పుడూ ప్రతికూల ఫలితాలే వస్తాయన్నారు. వివక్షపూరితమైన చర్యల వల్ల ఎప్పుడూ ఒంటరి, వేరు అనే భావన మరింత పెరుగుతుందని అన్నారు. ఘర్షణల సమయంలో గత అనుభవాలను పరిశీలిస్తే ఈ విషయం బోధపడుతుందన్నారు.ఢిల్లీలో తీవ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో ఎలాంటి విచక్షణారహిత అరెస్టులు జరగకుండా చూడాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. విద్యార్థులు, కార్మికులు, లేదా సాధారణ పౌరులు ఎవరైనా సరే అమాయకులు భయానికి లేదా అనుమానాలకు బాధితులుగా మారకుండా చూడాల్సిన బాధ్యత లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలదేనని తరిగామి పేర్కొన్నారు.

## చిలీ అధ్యక్ష ఎన్నికల్లో లెఫ్ట్ అభ్యర్థి ముందంజ



చిలీ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థి ముందంజలో ఉన్నారు. మొదటి విడత జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ తరుపున పోటి చేసిన జెన్నెట్ జారా 26.85% ఓట్లు సాధించారు. మితవాద పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ నుండి పోటీ చేసిన జోస్ ఆంటోనియోకి దాదాపు 23.92% ఓట్లు వచ్చాయి. ఫ్రాంకో పారిసి (పార్టీ ఆఫ్ పీపుల్) 19.71% ఓట్లతో మూడవ స్థానాన్ని పరిమితమయ్యారు. మరో అభ్యర్థి జోహన్నెస్ కైసర్ ఓటమిని అంగీకరించారు. ఏ అభ్యర్థికీ 50% ఓట్లు రాకపోవడంతో రెండో విడత ఎన్నిక అనివార్య మయింది. ఈ ఎన్నికలు డిసెంబర్ 14న జరగనున్నాయి. దీనిలో జారా, జోస్ ఇద్దరు అభ్యర్థులు మాత్రమే పోటీపడనున్నారు.. మిగతా అభ్యర్థులకంటే అధిక ఓట్లు సాధించిన లెఫ్ట్ నాయకురాలు జెన్నెట్ జారా దేశంలో వ్యవస్థీకృత నేరాలను అరికడతానని, బ్యాంక్‌ల పనితీరును మెరుగుపరుస్తానని, జీవన ప్రమాణాలు పెంచుతానని ప్రచారం చేశారు. మరోవైపు మితవాద పార్టీ అభ్యర్థి జోస్ ఆంటోనియో అమెరికాతో చేతులు కలిపి ట్రంప్ విధానాలను ప్రచారం చేశారు. వలసదారులను తరిమేస్తానని, బొలివియా సరిహద్దులో గోడలు, కంచెలు, కందకాలు నిర్మిస్తానని ప్రచారం చేశారు. దీంతో వామపక్షం వర్సెస్ ఫాసిజంగా ఎన్నికలు మారిపోయాయి.

## చర్చలకు ట్రంప్, మదురో సంసిద్ధత

ద్వైపాక్షిక చర్చలకు సిద్ధమేనని అమెరికా, వెనిజులా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్, నికొలస్ మదురో ప్రకటించారు. మదురోతో సమావేశమయ్యేందుకుసుముఖంగానే ఉన్నానని ట్రంప్ సోమవారం తెలిపారు. అయితే వెనిజులాపై సైనిక చర్య జరిపే అవకాశాలను ఆయన తోసిపుచ్చలేదు. 'నేను దానిని కాదనలేను. నేను దేనినీ తోసిపుచ్చను' అని ఆయన చెప్పారు. వెనిజులా నుంచి అమెరికాకు రవాణా అవుతున్న మాదక ద్రవ్యాలు, వలసదారుల వెనుక మదురో ఉన్నారంటూ పాత పాట ఎత్తుకున్నారు. అమెరికాకు మదురో అపార నష్టం కలిగించారని ఆరోపించారు. 'ఏం జరుగుతుందో చూద్దాం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. చర్చలకు ట్రంప్ సంసిద్ధత వ్యక్తం చేసిన కొద్దిగంటల వ్యవధిలోనే మదురో సానుకూలంగా స్పందించారు. తానూ చర్చలకు సంసిద్ధమేనని చెప్పారు. వెనిజులాతో చర్చించాలనిభావించే ఎవరైనా ముఖాముఖి మాట్లాడవచ్చునని, ఎలాంటి సమస్య ఉండదన్నారు. చర్చలు, శాంతి తనకు సమ్మతమేనని, యుద్ధానికి వ్యతిరేకినని తెలిపారు.

## నూతన దంపతులకు ఓచర్లు!

కొత్తగా గృహస్థాశ్రమంలోకి అడుగుపెట్టిన నూతన దంపతులకు వివాహ వినియోగ ఓచర్లను అందజేయడం ఇప్పుడు చైనాలో నయా ట్రెండ్‌గా మారింది. తూర్పు చైనాలోని జెజియాంగ్ రాష్ట్రంలో ఉన్న నింగ్బో నగరంలో పౌర వ్యవహారాల విభాగం వారు కొత్తగా వివాహం చేసుకున్న దంపతులకు వెయ్యి యువాన్ల (140 డాలర్లు)విలువ కలిగిన వినియోగ ఓచర్లను అందజేస్తున్నారు. నగరంలో ఇటీవల వివాహాలను రిజిస్ట్రర్ చేసుకున్న వారికి ఈ ఓచర్‌ను ఇస్తున్నారు. వివాహ వినియోగ ఓచర్ల జారీపై గత నెల 28వ తేదీతో మొదలైన ప్రచారం డిసెంబర్ 31వ తేదీ వరకూకొనసాగుతుంది. దీనికింద ప్రతి జంట ఎనిమిది ఓచర్లు పొందవచ్చు. ప్రతి ఐదు వందల యువాన్ల ఖర్చు పైన 125 యువాన్ల రాయితీ లభిస్తుంది. అయితే జారీ చేసే ఓచర్ల సంఖ్య తక్కువగా ఉంటుంది. 'ముందుగా వచ్చిన వారికి ముందుగా' అనే ప్రాతిపదికన వీటిని ఇస్తారు. వివాహానికి సంబంధించి పెట్టే ఏ ఖర్చు కైనా ఈ ఓచర్‌ను ఉపయోగించుకొని రాయి తీ పొందవచ్చు. జెజియాంగ్ రాష్ట్రంలోని మరికొన్ని నగరాలలో కూడా ఈ ఓచర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. తగిన వయసులో వివాహం చేసుకోవాలని, సంతానాన్ని కనాలని చైనా ఇటీవలి కాలంలో తీవ్రంగా ప్రచారం చేస్తోంది. గతంలో షాంక్సీ రాష్ట్రం లోని లులియాంగ్ నగరంలో కూడా వివా హాన్ని రిజిస్టర్ చేయించుకున్న దంపతులకు 1,500 యువాన్ల విలువ కలిగిన ఓచర్ ఇచ్చారు. వధువు వయసు 35 సంవత్సరాలు, అంతకంటే తక్కువ ఉండాలి. వివాహానికి అయ్యే ఖర్చుతో పోలిస్తే దంపతులకు అందజేసే ఓచర్ విలువ తక్కువే అయినప్పటికీ వివాహాలనుప్రోత్సహించడానికి అధికారులు ఈవిధానాన్ని అమలు చేస్తున్నారు.

# గాజాలో ఇక అంతర్జాతీయ బలగాలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికను సమర్ధిస్తూ, గాజాలో అంతర్జాతీయ స్థిరీకరణ బలగాల ఏర్పాటుకు అధికారమిస్తూ ఒక ముసాయిదా తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆమోదించింది. దీన్ని 'నిజమైన చారిత్రక క్షణం' గా ట్రంప్ వ్యాఖ్యానించారు.సోమవారం సాయంత్రం జరిగిన ఓటింగ్‌లో భద్రతా మండలి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. 15 మంది సభ్యులు గల మండలిలో 13 ఓట్లు అనుకూలంగా రాగా, చైనా, రష్యాలు గైర్హాజరయ్యాయి. గాజాలో శాంతి స్థాపనకు ఒక యంత్రాంగం 'బోర్డ్ ఆఫ్ పీస్ (బీఓపీ)' ఏర్పాటును కూడా ఈ తీర్మానం స్వాగతించింది. అంతర్జాతీయ చట్టబద్ధతతో కూడిన ఈ పరివర్తనా పాలనా యంత్రాంగం ప్రస్తుతశాంతిప్రణాళిక కింద గాజా పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను సమన్వయం చేసుకోవడానికి ఒక ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తుంది. దీనిపై ట్రంప్ సోషల్ మీడి యాలో ఒక పోస్టు పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపనకు ఇది దారితీస్తుందని వ్యాఖ్యానించారు. ఈ శాంతి బోర్డుకు ట్రంప్ నేతృత్వం వహిస్తారు. పలువురు ప్రపంచ నేతలు సభ్యు లుగా వుంటారు. ఈ తీర్మానానికి అన్ని పక్షాలు కట్టుబడి వుండాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ పేర్కొన్నారు. దౌత్యపరంగా సాగిన వ్యవహారమంతా క్షేత్రస్థాయిలో కార్యాచరణగా మారాలని, అందుకు అత్యవసరంగా కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం కూడా వుందని పేర్కొన్నారు.

# ఆఫ్రికాలో విమాన ప్రమాదం, రన్‌వేపై జారీ మంటలు చెలరేగిన వైనం

ఆఫ్రికా దేశం కాంగో (డీఆర్‌సీ)లో ఒక మంత్రి త్రుటిలో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై నుంచి జారిపోయి మంటల్లో చిక్కుకుంది. అయితే, మంత్రి సహా ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక దుర్ఘటనను పరిశీలించడానికి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం గమనార్హం.వివరాల్లోకి వెళ్తే.. లువాలాబా ప్రావిన్స్‌లోని కలాండో రాగి గనిలో శనివారం వంతెన కూలిన ఘటనలో 32 మంది మరణించారు. ఈ ప్రమాద స్థలాన్ని పరిశీలించేందుకు గనుల శాఖ మంత్రి లూయి వాటమ్ కబాంబ, తన బృందంతో కలిసి రాజధాని కిన్షాసా నుంచి బయల్దేరారు.మంత్రి, ఇతర అధికారులతో కలిపి మొత్తం 20 మంది ప్రయాణిస్తున్న విమానం కోల్వేజీ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా అదుపుతప్పి రన్‌వే నుంచి పక్కకు జారిపోయింది. వెంటనే ప్రయాణికులందరూ కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కొద్దిసేపటికే విమానానికి మంటలు అంటుకున్నాయి.కాగా, కాంగోలో లక్షలాది మందికి ఈ రాగి గనులే జీవనాధారం. అయితే, కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతూ వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

# ఇకపై వీసా ఫ్రీ ఎంట్రీ రద్దు
## భారతీయులకు గట్టి షాక్ ఇచ్చిన ఇరాన్

భారతీయులకు వీసా లేకుండా తమ దేశంలోకి ప్రవేశించేందుకు కల్పించిన సదుపాయాన్ని ఇరాన్ ప్రభుత్వం నిలిపివేసింది. ఈ వీసా-ఫ్రీ ఎంట్రీని నవంబర్ 22 నుంచి రద్దు చేస్తున్నట్లు ఇరాన్ ప్రభుత్వం సోమవారం రోజు ప్రకటించింది. సాధారణ పాస్‌పోర్టులు కలిగిన భారతీయులు అందరూ ఇకపై ఇరాన్‌లోకి ప్రవేశించాలన్నా, ప్రయాణించాలన్నా తప్పనిసరిగా వీసా తీసుకోవాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో భారతీయ పౌరులు ఎక్కవగా మోసపోతున్నారని, ముఖ్యంగా ఈ వీసా రద్దు సదుపాయాన్ని దుర్వినియోగం చేస్తూ పలువురు వీరిని నేరపూరిత కార్యకలాపాల కోసం వాడుకుంటున్నట్లు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఇరాన్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ విషయంపై స్పందిస్తూ.. కొందరు ఏజెంట్లు ఉద్యోగాల పేరుతో పలువురు భారతీయ పౌరులను ఇతర దేశాలకు పంపిస్తానని హామీలిస్తూ ఇరాన్ పంపించినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. వీసా ఫ్రీ సదుపాయాన్ని అడ్డం పెట్టుకుని ఇరాన్‌కు చేరుకున్న అనేక మంది భారతీయులు అక్కడ కిడ్నాప్‌లకు గురై, పెద్ద ఎత్తున డబ్బుల కోసం డిమాండ్లు ఎదుర్కొన్నట్లు ఎంఈఏ వెల్లడించింది. ఈ మానవ అక్రమ రవాణా బాధితులుగా మారుతున్న భారతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని.. ఈ సదుపాయం దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఇరాన్ సర్కారు ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఇరాన్ నిర్ణయం నేపథ్యంలో.. విదేశాంగ మంత్రిత్వ శాఖ భారతీయులందరికీ ప్రయాణ సలహా జారీ చేసింది.

ఇరాన్‌కు వెళ్లాలని భావించే భారతీయ పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వీసా-రహిత ప్రయాణాన్ని ఆఫర్ చేసే లేదా ఇరాన్ మీదుగా మూడవ దేశాలకు పంపుతామని హామీ ఇచ్చే ఏజెంట్లను నమ్మవద్దని తెలిపింది. వారి నుంచి గట్టిగా తప్పించుకోవాలని ఎంఈఏ గట్టిగా సూచించింది. నవంబర్ 22 తేదీ నుంచి సాధారణ పాస్‌పోర్టులు కలిగిన వారంతా తప్పనిసరిగా దౌత్య కార్యాలయాల ద్వారా వీసా పొందిన తర్వాతే ఇరాన్‌కు వెళ్లాలని స్పష్టం చేసింది.

# షేక్ హసీనా మరణశిక్షపై స్పందించిన తస్లీమా నస్రీన్



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్ష విధించడంప్రఖ్యాత రచయిత్రి తస్లీమా నస్రీన్ తీవ్రంగా స్పందించారు. హసీనాను నేరస్థురాలిగా పరిగణిస్తున్నప్పుడు, ప్రస్తుత ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనుస్, ఆయన 'జిహాదీ శక్తులను' ఎందుకు వదిలేశారని ఆమె సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఆమె 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు.గతేడాది జరిగిన విద్యార్థి ఉద్యమంలో హింసను ప్రేరేపించడం, నిరసనకారులను చంపాలని ఆదేశించడం వంటి మానవతా వ్యతిరేక నేరాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసీటీ) సోమవారం షేక్ హసీనాకు మరణశిక్షను విధించింది. ఇదే కేసులో మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కు కూడా మరణశిక్ష పడగా, అప్రూవర్‌గా మారిన మాజీ ఐజీపీకి ఐదేళ్ల జైలుశిక్ష విధించారు.ఈ తీర్పుపై స్పందిస్తూ తస్లీమా "విధ్వంసానికి పాల్పడిన వారిపై కాల్పులు జరపమని గత జులైలో ఆదేశించినందుకు హసీనాను నేరస్థురాలిగా చూస్తే, ఇప్పుడు అదే పని చేస్తున్న యూనుస్ ప్రభుత్వం తనను తాను ఎందుకు నేరస్థులుగా పిలుచుకోవడం లేదు? బంగ్లాదేశ్‌లో న్యాయం పేరుతో ఈ ప్రహసనం ఎప్పుడు ముగుస్తుంది?" అని విమర్శించారు.

## భారత్‌కు గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్..



న్యూఢిల్లీ:అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు, పలు సంచలన కేసుల్లో నిందితుడిగా ఉన్న అన్మోల్ బిష్ణోయ్‌ను అమెరికా ప్రభుత్వం భారత్‌కు అప్పగిస్తోంది. అన్మోల్‌తో పాటు పంజాబ్‌కు చెందిన పరారీలో ఉన్న ఇద్దరు నేరస్థులు, మరో 197 మంది అక్రమ వలసదారులతో కూడిన ప్రత్యేక విమానం అమెరికా నుంచి బయల్దేరింది. ఈ విమానం బుధవారం ఉదయం 10 గంటలకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ కానుందని అధికారులు ధ్రువీకరించారు. సంచలనం సృష్టించిన మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్య, బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటిపై కాల్పుల ఘటనల్లో అన్మోల్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. 2022 ఏప్రిల్‌లో నకిలీ పాస్‌పోర్ట్‌తో భారత్ నుంచి అన్మోల్ పరారైనట్లు నిఘా వర్గాలు తెలిపాయి. విదేశాల్లో ఉంటూనే ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా తన నేర సామ్రాజ్యాన్ని నడిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది కాలిఫోర్నియాలో పట్టుబడిన అన్మోల్‌ను అక్కడి పోలీసులు కస్టడీలో ఉంచి, అతడి కదలికలను గుర్తించేందుకు కాలికి ఎలక్ట్రానిక్ మానిటర్ (యాంకిల్ మానిటర్) అమర్చారు. లూసియానా నుంచి అతడిని భారత్‌కు పంపుతున్నారు. అన్మోల్‌ను అమెరికా భూభాగం నుంచి పంపించివేసినట్లు తమకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందిందని బాబా సిద్దిఖీ కుమారుడు, ఎన్సీపీ నేత జీషన్ సిద్దిఖీ ధ్రువీకరించారు. నిందితుడిని పట్టుకోవాలని తాము అమెరికా అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. బుధవారం ఉదయం ఢిల్లీలో విమానం దిగిన తర్వాత అన్మోల్‌ను ఏ దర్యాప్తు సంస్థ అదుపులోకి తీసుకుంటుందనే దానిపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్‌లపై దర్యాప్తు చేస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

## కస్టోడియన్ భూసమస్యపై రాజస్తాన్‌లో భారీ ర్యాలీ

జైపూర్ : కస్టోడియన్ భూముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజస్తాన్‌లో రైతులు కదం తొక్కారు. రాష్ట్రంలోని దిద్వానాలో రైతులు మంగళవారం రెహ్మాన్ గేట్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర మహా పాదయాత్ర నిర్వహించారు. కస్టోడియన్ భూములను స్వాధీనం చేసుకోవాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వివిధ గ్రామాల రైతులు నిరసనలో భాగమయ్యారు. అధికారుల తీరును నిరసిస్తూ జిల్లా కలెక్టర్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం తమ పూర్వీకుల భూములను లాక్కుంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే చేతన్ దూడి, రైతు నాయకుడు భగీరథ్ యాదవ్, సీపీఐ(ఎం), అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్)కార్యకర్తలతోపాటు కాంగ్రెస్, ఆర్ఎల్‌పి నుంచి కూడా వందలాది మంది ఈపాదయాత్రలో పాల్గొన్నారు. అనేక మంది రైతులు ట్రాక్టర్లతో ర్యాలీలో పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బీహార్ ప్రజల తీర్పులో దాగిన రాజకీయ సందేశం

..బిహార్ ప్రజల నుండి ఏ తీర్పు రావాలని ఆయా రాజకీయ పార్టీలు శక్తులు స్వీయాత్మకంగా ఆకాంక్షించాయో అలాంటి తీర్పు రాలేదు. దీంతో ప్రగతిశీల, లౌకిక, ప్రజాస్వామిక శక్తుల, వ్యక్తుల మానసిక స్థితి తీవ్ర నిరాశలో కూరుకుపోయినట్లు కనిపిస్తోంది. 'ఇక ఫాసిస్టులను ఓడించడం చాలా కష్టం' అనే నిట్టూర్పులు, 'ఈ ప్రజల మీద నమ్మకం పెట్టుకొని ఫాసిజం మీద విజయం సాధించలేం' అనేంతవరకు నిరాశ వెళ్తోంది. ఇది చీకట్లో వెలుగును, చెడులో మంచిని, కష్టంలో సుఖాన్ని, ప్రతికూల అంశంలో సానుకూల అంశాన్ని చూడలేని స్థితికి అద్దం పడుతుంది. మరో భిన్న దృష్టితో పరిశీలిస్తే బిహార్ ఎన్నికల్లో ఆ రాష్ట్ర ప్రజలు పోషించిన పాత్రకి గల ప్రాధాన్యత చాలా స్పష్టంగా అర్థమౌతుంది. అయితే ప్రగతిశీల, ప్రజాతంత్ర, వామపక్ష, లౌకిక శక్తులు భావించి నమ్ముతున్న వివిధ ఫాసిస్టు కుట్రలు, కుయుక్తులు, కుతంత్రాలు బిహార్ రాష్ట్ర ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశాయనడంలో నేనేమీ విభేదించడం లేదు. కానీ ఆర్ఎస్ఎస్, బీజేపీల ప్రభుత్వ ఫాసిస్టు పాలనా విధానానికి బిహార్ రాష్ట్ర ప్రజలు ఆమోద ముద్ర వేశారని భావిస్తే పరమ అబద్ధం అవుతుంది. బిహార్ ఎన్నికల ఫలితాలను లోతుగా పరిశీలిస్తే బిహార్ రాష్ట్ర ప్రజలు ఫాసిస్టు పాలకులకు, వారు చేపట్టే విధానాలకు చాలా గట్టి రాజకీయ గుణపాఠం చెప్పడంతో పాటు తీవ్ర హెచ్చరిక చేశారని కూడా స్పష్టం అవుతుంది. విద్వేషపూరిత రాజకీయ, సాంస్కృతిక, సాంఘిక, ఆధ్యాత్మిక, నైతిక, ధార్మిక అస్త్రశస్త్రాలు అన్నింటిని వెలికితీసి పదునుపెట్టి బిహార్ రాష్ట్ర ప్రజలపై ఫాసిస్టు పాలక వర్గాలు ప్రయోగించడం జరిగింది. ఐనా ప్రజలు ఇవ్వనున్న తీర్పు పట్ల ఫాసిస్టు పాలక శక్తులకు నమ్మకం ఏర్పడటం లేదు. చివరికి ఆర్థిక అస్త్రాలే వారికి దిక్కుగా మారాయి. వారికి గాడ్ ఫాదర్లు ఐన కార్పొరేట్ వర్గ ప్రయోజనాలకు వ్యతిరేక ఎజెండా మీద ఆధారపడే అవసరం ఏర్పడింది. నగదు బదిలీ పథకంతో సహా రకరకాల సంక్షేమ హామీల్ని ఇబ్బడిముబ్బడిగానే ఆ రాష్ట్ర ప్రజలకు ఇవ్వాల్సిన దిక్కుమాలిన దీన స్థితి ఆర్ఎస్ఎస్, బీజేపీలకు ఏర్పడింది. ఆర్ఎస్ఎస్ రాజకీయ అంతరాత్మ భంగపడింది. ఇలా బిహార్ ప్రజలు వారికి చెమట పట్టించారు. వలస కార్మికులను సాపేక్షికంగా అభివృద్ధి చెందిన కొన్ని రాష్ట్రాలకు ఎగుమతి చేసే ఓ ప్రధాన రాష్ట్రంగా బిహార్ పేరొందింది. ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు గానీ, మహారాష్ట్ర, గుజరాత్ వంటి పడమర రాష్ట్రాల్లో గానీ నగదు బదిలీ వంటి సంక్షేమ పథకాలు చాలా బలంగా అమలు జరిగే స్థితి ఉంది. కానీ, సంక్షేమ వ్యవస్థ మీద ఫాసిస్టులు దాడికి దిగే పరిస్థితి ఏర్పడింది. ఆ సంక్షేమ సంస్కృతి ఒక బలమైన సాంప్రదాయ శక్తిగా మారిన చోట్ల దాని నియంత్రణ కోసం నేడు ఫాసిస్టు రాజకీయ శక్తులు ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నియంత్రణ నిజానికి మొదటి దశలో చేపట్టేది మాత్రమే. అంతిమంగా వాటిని నిర్మూలన చేసే దారిలో ఆర్ఎస్ఎస్ నడుస్తోంది. ఆ ఫాసిస్టు మార్గంలో అదో మజిలీ మాత్రమే. సంక్షేమ సంస్కృతి నేడు బలహీనంగా గల బిహార్ రాష్ట్రంలో ఫాసిస్టు పాలకులు స్వయంగా తమ చేతులతో సంక్షేమ పథకాల్ని బలోపేతం చేసి తీరాల్సిన తీవ్ర చర్యల్ని చేపట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇది ఎవరికి విజయం? ఎవరికి అపజయం? సంక్షేమ పథకాలలో పోస్ట్ పెయిడ్ స్కీమ్స్ కంటే ప్రీపెయిడ్ స్కీమ్స్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. గతంలో ఇచ్చిన పోస్ట్ పెయిడ్ హామీలు అమలు జరగని చేదు అనుభవాలు వారికి ఎదురయ్యాయి. ఆ చేదు అనుభవాల వెలుగులో బిహార్ ప్రజలు ఫాసిస్టుల ఎరలకు చాలా దూరంగా ఉన్నారు. అది పసిగట్టిన ఫాసిస్టు పాలకులు చివరికి ప్రీపెయిడ్ స్కీమ్స్ అమలుకి దిగారు. గతం వలే హామీలిచ్చి ఓట్లు పొందలేని దుస్థితి వల్ల నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాల్సిన దుస్థితికి గురయ్యారు. ఒక నగదు బదిలీ స్కీం చూపించి మిగిలిన అన్ని సంక్షేమ హామీల పట్ల ప్రజల్లో ఆశ కలిగించే ప్రయత్నం చేశారు. ఒక ప్రీపెయిడ్ స్కీం అమలుని చూపించి అనేక పోస్ట్ పెయిడ్ స్కీమ్స్‌పై ఆశ పెట్టారు. ఈ ఎన్నికల్లో అనేక సంక్షేమ హామీల్ని ఇచ్చిన పాలకులు రేపు ఐదేండ్లు ముళ్లబాటలో నడవాల్సిందే. వాటిని అలా నడిపించే విలక్షణ తీర్పు ఇచ్చిన ప్రజలుగా చూడాలి. పైగా ఇప్పటికే సంక్షేమ సంస్కృతి చాలా బలంగా వున్న ఏపీ వంటి రాష్ట్రాల ప్రజల చేతికి పదునైన ఆయుధాన్ని అందించే సాధనంగా దీన్ని చూడాలి. బిహార్ రాష్ట్ర ప్రజల తీర్పు అక్కడి ప్రజలు జీవించే భౌతిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. బిహార్ ప్రజలు జీవిస్తున్న స్థల, కాలాదులపై ఆధారపడి ఆ రాష్ట్ర ప్రజలిచ్చే తీర్పు ఉంటుందని భావించి దాని గూర్చి విశ్లేషణ చేయడం సరైన పద్ధతి. తమ తమ మనస్సుల్లో కోరుకున్న ఆకాంక్షల్ని ప్రామాణికం లేదా ప్రాతిపదిక చేసుకొని ఆయా రాజకీయ పార్టీలు బిహార్ ప్రజల తీర్పును విశ్లేషించడం అశాస్త్రీయం అవుతుంది. ఔను, కాళ్ల సైజును బట్టి చెప్పులు నరుక్కొనే పాదచారులకు నడక ఎట్టి అసౌకర్యం కలిగించబోదు. కానీ చెప్పుల సైజులను బట్టి తమ కాళ్లు నరుక్కునే వారికి నడక నిజంగానే ఇబ్బందిగా ఉంటుంది. వర్తమాన బిహార్ రాష్ట్ర భౌతిక స్థితిగతులపై ఆధారపడి, ఆ పరిస్థితుల్లో జీవిస్తున్న ప్రజలలో మానసిక, రాజకీయ చలనాలపై ఆధారపడి తీర్పును సమీక్ష చేద్దాం. ప్రజలే చరిత్ర నిర్మాతలనే సూత్రం ఆధారంగా ప్రజలపై నమ్మకాన్ని ప్రదర్శిద్దాం.

# బాలలచే వెట్టిచాకిరీ దారుణం

ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబరు 20న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన కలిగించి, పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ దినోత్సవం నిర్వహించబడుతున్నది. 1954, డిసెంబరు 14న ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1956 నుంచి ప్రపంచ బాలల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం వేడుకగా నిర్వహించాలని అన్ని దేశాలకు సూచించింది. 1959, నవంబరు 20న ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది.. 1989, నవంబరు 20న బాలల హక్కులపై సంప్రదాయ ఆచరణను ఆమోదించింది. చాలా దేశాలు ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ సూచించిన నవంబరు 20న ప్రపంచ బాలల దినోత్సవంగా పాటిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరి కొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందేచట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ



మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ – ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమిత మవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరిపోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగ జేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించా లని రాజ్యాంగం ఆదేశించింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలా మంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మికుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠ శాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొం దించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథ మిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.



రామ కిష్టయ్య సంగన భట్ల...

## రేపటి దిశానిర్దేశకులు బాలలే



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

నేటి బాలలే రేపటి భావి ప్రపంచ పౌరులు. బాల్యం ఆనందాలకు చిరునామా. బాల్యం సున్నితం, బహు సుందరం. బాల్యం అద్వితీయ అనుభవాల నెలవు. అందరం బాల్యదశ నుండి ఎదిగిన వారమే. కుటుంబ సంతోషాలకు ప్రేరణ చిరునవ్వుల చిన్నారులు. పిల్లలకు ప్రశ్నించడం, తెలుసు కోవాలనే తపన ఉండడం గమనిస్తుంటాం. సమాజంలో ఒక ప్రధాన భాగమైన బాలల భవితను సన్మార్గంలో నిర్మించాల్సిన కనీస బాధ్యత నేటి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, పౌర సమాజంపై ఉన్నది. నేటి చిన్నారులకు కూడా మనతో సమానంగా మానవ హక్కులు ఉంటాయని గమనించాలి. నేడు బాల్యం ఛిద్రం అయితే రేపటి తరం నిర్వీర్యం అవుతుంది. నేటి బాలల అభ్యున్నతికి తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగితేనే బంగారు భవిష్యత్తు ఆవిష్కృతం అవుతుంది. 2వ ప్రపంచ యుద్ధం తర్వాత విశ్వ బాలల దీన పరిస్థితులను, ముఖ్యంగా యూరోప్ ప్రాంత చిన్నారుల మానవ హక్కుల ఉల్లంఘనలను అరికట్టడానికి ఐరాస అంగమైన యూనిసెఫ్ దిద్దుబాటు చర్యలకు పూనుకోవడం జరిగింది. నాడు బాలల హక్కుల పరిరక్షణ సదస్సులో తీసుకున్న తీర్మానం మేరకు పిల్లలకు మానవ హక్కులు ఉంటాయని, వాటిని అమలు చేయాలని, అవగాహన కల్పించాలని, చర్చించి తగు సమాధానాలు వెతకాలని, బంగారు బాటలు వేయాలనే పలు సదుద్దేశాలతో ప్రతి ఏట యూనిసెఫ్ నాయకత్వంలో 20 నవంబర్ రోజున ఐరాస సభ్య దేశాలు "ప్రపంచ బాలల దినోత్సం(వరల్డ్ చిల్డ్రన్స్ డే)" ఘనంగా నిర్వహించడం 1990 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ బాలల దినోత్సవం –2025 ఇతివృత్తంగా "నేటి పిల్లలపై పెట్టుబడి రేపటి ఉజ్వల భవిష్యత్తుకు పెట్టుబడి" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. భారత్‌లో ప్రతి నవంబర్ 14న "జాతీయ బాలల దినాన్ని", 01 జూన్‌న "అంతర్జాతీయ బాలల దినం" కూడా పాటిస్తున్నామని మనందరికీ తెలుసు. పిల్లలకు చదువులతో పాటు ఆటపాటలు, లలిత కళల పట్ల ఆసక్తిని గమనించి శిక్షణను ఇవ్వడానికి పెద్దలు చొరవ చూపాలి. ప్రపంచ బాలల హక్కులను నిర్లక్ష్యం చేయడం, అపార్థం చేసుకోవడం, కాలరాయడం నిత్యం జరుగుతూనే ఉన్నాయి. నేటి బాలల సంక్షేమ చర్యలే రేపటి ప్రపంచ ఉజ్వల భవితకు రాచబాటలు మరిచిపోతున్నాం. ఆధునిక ప్రపంచ బాలలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో పేదరికం, ఆకలి కేకలు, పోషకాహారలోపాలు, అవిద్య, సామాజిక మాధ్యమాల దురలవాటు, సహచరుల ఒత్తిడి, స్క్రీన్ టైమ్ అవలక్షణాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, చదువుల ఒత్తిడి, స్థూలకాయం, శారీరక ఎదుగుదల లోపించడం, అనవసర ఆందోళనలు, భావోద్వేగ సవాళ్లు, లైంగిక వేధింపులు, సురక్షిత నీటి కొరత, బాల కార్మిక అవస్థలు, లింగ–ఆధార హింస, యుద్ధ దేశాల్లో దుష్ప్రభావాలు, వలసల దుఃఖాలు, గృహ వసతులు, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, వాతావరణ మార్పులతో అనారోగ్యాలు, కాలుష్య ప్రతికూలతలు, కుటుంబ సమస్యలు, అక్రమ రవాణాలు, జాతి వివక్షలు, మానసిక సమస్యలు లాంటివి గుర్తించబడినవి. విశ్వ బాలల హక్కులు ఎలాంటి చర్చలను తావులేనివి. బాలల హక్కులను కావరాయడం అంటే రేపటి వారి ఉజ్వల భవిష్యత్తును పాతరేయడమే. నేడు, రేపు, భవిష్యత్తులో సదా ప్రపంచ మానవాళి సంతోషంగా ఉండాలంటే బాలల పెంపకంలో అతి శ్రద్ధ అనివార్యం. పిల్లల ఆలోచనలు విందాం. వారిలో దాగిన సృజనను ప్రోత్సహిద్దాం. వారి అనుమానాలను ఓపికగా నివృత్తి చేద్దాం. వారి సున్నిత మనసులను ఆప్యాయంగా ఆదరిద్దాం. తల్లితండ్రుల జీవన సాఫల్యత వారి పిల్లల ఎదుగుదల ప్రమాణాలపై మాత్రమే ఆధారపడి ఉంటుందని తెలుసుకుందాం. నేటి ప్రపంచ బాలల దినోత్సవం–2024 థీమ్ "ప్రతి పిల్లాడికి మౌలిక హక్కులు ఉన్నాయి(ఫర్ ఎవ్రీ చైల్డ్, ఎవ్రీ రైట్)" ఆధారంగా సకల సౌకర్యాలను కల్పిస్తూ చిరు మొక్క వలె పంచుదాం, మహా వృక్షంగా ఎదిగి మరి కొందరికి నీడనిచ్చే స్థాయికి చేర్చుదాం. చిచ్చర పిడుగుల్లో ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసాలను పెంచుదాం. సృజనకు పట్టం కడదాం. కలలను సాకారం చేసుకునే విధంగా సౌకర్యాలను కల్పించాలి. పసి పిల్లలు తోటలో మొగ్గల్లాంటి వారని, వారి భవిష్యత్తుకు పునాదులు వేస్తే పరిమళ సుగంధ పుష్పాలుగా వికసిస్తారని గుర్తుంచుకుందాం. బాల్యాన్ని చిదిమేయడం అంటే రేపటి కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడమే. కుటుంబం విచ్ఛిన్నమైతే విశ్వం వల్లకాడు అవుతుంది. మన బాలల్ని మనసారా ప్రేమించడం అంటే వారి పెంపకంలో అత్యంత శ్రద్ధ వహించడమే. నేటి ప్రపంచ బాలల్ని రేపటి విశ్వ నాయకుల స్థాయికి చేర్చడానికి మనందరం నిచ్చెనగా నిలబడదాం, తడబడినపుడు ఊతకర్రగా నిలుద్దాం.

# దాన ధర్మాలకు ఉద్దిష్టమైనది కార్తీక అమావాస్య



ఐకార్తీక మాసం అమావాస్యను అఘన అమావాస్య, భౌమవతి అమావాస్య అంటారు. హిందూ పంచాంగం ప్రకారం కార్తీక బహుళ అమావాస్యతో కార్తీక మాసం పూర్తవుతుంది. హిందూ సంప్రదాయంలో ఇది అత్యంత పవిత్రమైనదిగా భావించ బడుతుంది. ఈ రోజు పూర్వీకులను స్మరించు కోవడం, దేవతలకు పూజలు చేయడం ముఖ్యమైన ఆచారం. కార్తీక అమావాస్య విశ్వాసాల ప్రకారం, ఈ రోజు నిర్వహించే పూజలు, దానధర్మాలు భక్తులకు ఆధ్యాత్మిక శ్రేయస్సును అందిస్తాయి.

ఈ రోజున పితృదేవతలకు తర్పణం చేయడం అత్యంత ముఖ్యమైన పూజగా భావిస్తారు. పూర్వీకులకు తర్పణం అందించడం ద్వారా వారి ఆశీర్వాదం లభిస్తుందని నమ్మకం. ఈ పూజ ద్వారా పితృ ఋణం నుంచి విముక్తి పొందవచ్చని శాస్త్రాలు పేర్కొంటాయి. కార్తీక అమావాస్య రోజున శివుడు, విష్ణువు, లక్ష్మీదేవి వంటి దేవతలను పూజించడం ప్రత్యేకమైనదిగా భావిస్తారు. శివలింగానికి కార్తీక దీపం వెలిగించడం, విష్ణుమూర్తిని పూజించడం ద్వారా ఆధ్యాత్మిక క్షేమం లభిస్తుందని విశ్వాసం.

ఈ రోజున పేదలకు ఆహారం, బట్టలు, ఇతర వస్తువులు దానం చేయడం పుణ్య కార్యంగా భావించ బడుతుంది. దానం వల్ల కర్మ ఫలితాలు మంచిగా ఉంటాయని హిందూ ధర్మంలో పేర్కొన్నారు. కొంతమంది భక్తులు ఉపవాసం ఉండి, ఆధ్యాత్మిక శ్రద్ధతో పూజలు నిర్వహిస్తారు. ఉపవాసం ద్వారా శరీర శుద్ధి, మనస్సు ప్రశాంతత లభిస్తాయని విశ్వాసం. భక్తులు కార్తీక అమావాస్య ఉదయం లేవగానే గంగ, గోదావరి, కృష్ణ వంటి పవిత్ర నదుల్లో స్నానం చేయడం మంచి ఫలితాలను అందిస్తుందని నమ్ముతారు. పవిత్ర స్నానం వల్ల శారీరక, ఆధ్యాత్మిక శుద్ధి కలుగుతుందని విశ్వాసం.

భక్తులు ఇంట్లోనే లేదా దేవాలయాలకు వెళ్లి శివుడు, విష్ణువు, లక్ష్మీదేవి వంటి దేవతలను పూజిస్తారు. పూజలో దీపారాధన, నైవేద్యం సమర్పించడం విశేష ఫలితాలను అందిస్తుందని నమ్మకం. పితృదేవతలకు తర్పణం చేయడం ద్వారా వారి ఆశీర్వాదం పొందవచ్చని భావించబడుతుంది. ఈ తర్పణం నదీ తీరాల వద్ద లేదా ఇంట్లోనే చేయవచ్చు.క్తులు పేదలకు అన్నదానం, వస్త్రదానం చేయడం ద్వారా పుణ్యం సంపాదిస్తారు. దీనివల్ల కర్మఫలాలు శ్రేయస్సు కదిలిస్తాయని నమ్మకం.

సాయంత్రం సమయంలో ఇంటి వద్ద లేదా దేవాలయాలలో దీపాలు వెలిగించడం ఎంతో విశేషం. దీపాలు వెలిగించడం ద్వారా చీకటి తొలగిపోవడం, ఆధ్యాత్మిక జ్ఞానం ప్రసాదించడం అనగా భావిస్తారు. కార్తీక అమావాస్య రోజున భక్తులు ఉపవాసం ఉంటారు. ఉపవాసంతో పాటు సాంప్రదాయ పూజలు చేస్తారు. శివుని పూజలో బిల్వ దళాలు సమర్పించడం, దీపం వెలిగించడం ముఖ్యమైన ఆచారం. ఉపవాసం శారీరక ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా, మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని నమ్మకం. పురాణాల ప్రకారం, కార్తీక మాసం శివుడికి అత్యంత ప్రీతికరమైనది. కార్తీక అమావాస్య రోజున శివుడు భక్తులకు అనుగ్రహం చేస్తాడని విశ్వాసం. అంతేగాక, కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం వల్ల బ్రహ్మాండ శక్తుల అనుగ్రహం లభిస్తుందని చెబుతారు. కార్తీక అమావాస్య రోజున పూజలు, తర్పణం, దానాలు చేయడం వల్ల పాప విముక్తి లభిస్తుందని, పితృదేవతల కృపతో కుటుంబానికి శ్రేయస్సు కలుగుతుందని నమ్మకం. దీపారాధన ద్వారా ఆధ్యాత్మిక శక్తి పెరిగి, జ్ఞానం వెలుగుతుంది. ఆధ్యాత్మికమైన దీపారాధన, పితృ తర్పణం ద్వారా జీవితంలో సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం.

# స్వాతంత్ర్య యోధులకు స్ఫూర్తి టిప్పు సుల్తాన్

టిప్పు సుల్తాన్ (1751 –1799) భారతదేశ చరిత్రలో దేశభక్తుడు, శక్తివంతమైన పాలకుడు, మైసూర్ సామ్రాజ్యానికి పునాది పటిష్ఠం చేసిన మహానాయకుడిగా నిలిచారు. "మైసూర్ పులి" అని ప్రఖ్యాతి గాంచిన ఆయన, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కబంధ హస్తాల్లో భారత స్వతంత్రాన్ని కాపాడేందుకు చేసిన పోరాటానికి చిహ్నంగా నిలిచారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మొదటి పోరాట యోధుడిగా భావించబడే టిప్పు సుల్తాన్, తన పాలనలో సైనిక, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో విశేషమైన ప్రగతిని సాధించారు. టిప్పు సుల్తాన్ 1751 నవంబర్ 20న దేవనహల్లి (నేటి కర్ణాటకలోని బెంగళూరుకు సమీపం)లో జన్మించారు. ఆయన తండ్రి హైదరాలి, తల్లి ఫాతిమా ఫకరున్నిస్సా. హైదరాలి మైసూర్ సామ్రాజ్యానికి సైన్యాధికారి నుంచి సామ్రాజ్య స్థాపకుడిగా ఎదిగారు. తన తండ్రి నుండి టిప్పు సుల్తాన్ మంచి సైనిక వ్యూహాలు, పరిపాలన నైపుణ్యాలు, మరియు ధైర్య సాహసాలను నేర్చుకున్నారు. యువస్థాయి లోనే టిప్పు సైనిక చాతుర్యంతో ప్రసిద్ధి చెందారు. 15 ఏళ్ల వయసులోనే ఆయన తన తండ్రితో కలిసి ఆంగ్లేయుల మీద యుద్ధాల్లో పాల్గొన్నారు. వారి కుటుంబం మైసూరును స్వతంత్రమైన, బలమైన సామ్రాజ్యంగా తీర్చిదిద్దేందుకు తన శక్తి అంతా ఉపయోగించింది. టిప్పు సుల్తాన్ 1782లో తన తండ్రి మరణం తరువాత మైసూరు సామ్రాజ్యానికి పాలకుడిగా నియమితుడయ్యారు. ఆయన పాలనను చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిపింది. టిప్పు సుల్తాన్ తన పాలనలో ఆర్థిక ప్రగతికి పెద్దపీట వేశారు. వ్యవసాయానికి సంబంధించి భూమి పన్ను వ్యవస్థను పునర్నిర్మించి రైతుల సంక్షేమాన్ని మెరుగు పరిచారు. వాణిజ్యానికి పునాది వేసి, విదేశీ దేశాలతో వాణిజ్య సంబంధాలను బలపరిచారు. టిప్పు సుల్తాన్ రాకెట్ టెక్నాలజీ అభివృద్ధికి కీలకమైన నాయకుడిగా నిలిచారు. "మైసూర్ రాకెట్లు" అనేవి ప్రపంచం లోనే మొదటి క్షిపణి మార్గదర్శకంగా గుర్తించ బడుతున్నాయి. ఈ రాకెట్లు బ్రిటిష్ దళాల మీద ప్రభావవంతంగా ఉపయోగించ బడ్డాయి. సైన్యాన్ని ఆధునీకరించి, ఆయుధ తయారీ కేంద్రాలను నిర్మించారు. ఫ్రెంచ్ సైన్యంతో కుదుర్చుకున్న స్నేహ సంబంధాలు ఆయన సైనిక శక్తిని మరింత బలపరిచాయి. టిప్పు సుల్తాన్ పాలనా కాలం ప్రధానంగా బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీతో జరిగిన యుద్ధాల చరిత్రగా గుర్తించబడింది. మైసూరు యుద్ధాలు నాలుగు ప్రధాన దశల్లో సాగాయి. మొదటి మైసూరు యుద్ధం (1767–1769): హైదరాలి నాయకత్వంలో ప్రారంభమైంది. రెండవ మైసూరు యుద్ధం (1780–1784): టిప్పు, తన తండ్రితో కలిసి బ్రిటిష్ బలగాలను ఎదుర్కొన్నారు. మూడవ మైసూరు యుద్ధం (1790–1792): ఈ యుద్ధంలో టిప్పు పరాజయం చెందారు, అయినప్పటికీ ఆయన ధైర్యం ప్రపంచం మొత్తానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచింది. నాలుగవ మైసూరు యుద్ధం (1799): చివరి యుద్ధం, మైసూరుకు తీవ్ర ప్రమాదం తెచ్చింది. సీరంగపట్నం నగరంలో టిప్పు తన జీవితాన్ని త్యాగం చేయడం దేశభక్తి చిహ్నంగా నిలిచింది. శ్రీ రంగపట్నం యుద్ధం 1799లో శ్రీరంగపట్నంలో జరిగిన యుద్ధం టిప్పు సుల్తాన్ జీవితానికి ముగింపు చిహ్నమైంది. బ్రిటిష్, నిజాం, మరాఠా సంయుక్త బలగాలకు వ్యతిరేకంగా చివరి వరకు పోరాడి, దేశానికి త్యాగం చేశారు. ఆయన మృతితో మైసూరు స్వాతంత్ర్య పోరాటం ముగిసింది. టిప్పు సుల్తాన్ భారతదేశ చరిత్రలో అన్ని మతాలను సమానంగా గౌరవించిన పాలకుడు. మైసూరును ఒక ఆధునిక సాంకేతిక కేంద్రంగా అభివృద్ధి చేశారు. వాణిజ్యానికి ప్రాధాన్యత ఇచ్చి, సామ్రాజ్య ఆర్థిక స్థిరత్వానికి పునాదులు వేశారు. టిప్పు సుల్తాన్ ధైర్యం, దేశభక్తి, ప్రజాసేవ భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో నిలకడైన స్థానాన్ని సంపాదించాయి. ఆయన తన జీవితాన్ని త్యాగం చేసి స్వాతంత్ర్య స్ఫూర్తికి చిరస్మరణీయంగా నిలిచారు. భారతదేశ చరిత్రలో ఒక శాశ్వత స్ఫూర్తిగా టిప్పు సుల్తాన్ పేరు సుస్థిరంగా ఉంటుంది.

# కోదాడలో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి



కోదాడ ,నవంబర్ 19(వుదయం) : కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్‌లో బుధవారం ప్రముఖ నేతలు భాగస్వామ్యంతో ఇందిరా గాంధీ జయంతినిఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు వంగవీటి రామారావు, టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో ఇందిరా గాంధీ చేసిన కృషిని స్మరించుకున్నారు. సామాజిక న్యాయం, దేశ రక్షణ, పేదల సంక్షేమం కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు ఈరోజు కూడా మార్గదర్శకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పారా సీతయ్య పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడవెల్లి బాల్రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు లిక్కి మోహన్ రావు యాదవ్, కొండల్ రెడ్డి, పాలూరి సత్యనారాయణ, గంధం యాదగిరి, షేక్ ఫయాజుద్దీన్, కె లక్ష్మీనారాయణ,ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుడుముల రాంబాబు, చింతలపాటి శ్రీనివాసరావు, ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ నజీర్, బాగ్దాద్, వెంకటేశ్వర్ రెడ్డి, కామల్ల ప్రవీణ్, కంపాటి పుల్లయ్య, షేక్ జహీర్, పవన్, దావల్, శోభన్ స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.

# గ్రామీణ ఉపాధి చట్టానికి మోడీ సర్కార్ ఉరివేస్తోంది

## సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే పుల్లయ్య



దమ్మపేట నవంబర్ 19 (వుదయం ప్రతినిధి):కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు కార్మిక వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన దేశవ్యాప్త పిలుపులో భాగంగా మండల కేంద్రంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు కే, పుల్లయ్య అన్నారు. సిపిఎం మండల కమిటీ మందలపల్లి సుందరయ్య భవన్లో పిల్లి నాయుడు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుడు తో ఆదేశ పత్తిని దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకొని ఇక్కడ రైతులను మోసం చేస్తున్నారని ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీ,సీ, ఐ, ద్వారా కొత్త నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని దిగుమతి సుంకాలు ఎత్తివేస్తే ప్రభావం ఎలా ఉంటదో పత్తి ద్వారా అర్థమవుతుంటే మరోపక్క అమెరికా మిగిలిన ఉత్పత్తులు అయినా మొక్కజొన్న పాల ఉత్పత్తులు సోయాబీన్ లాంటి వి ఇండియాలో అమ్ముకునేందుకు తలుపులు తెరుస్తున్నారని అన్నారు. వ్యవసాయ కూలీలకు పనిలేని రోజుల్లో అంతోఇంత పని కల్పించే గ్రామీణ ఉపాధి చట్టానికి మోడీ సర్కార్ ఉరి వేస్తున్నది అని కేవైసీ డిజిటల్లైజేషన్ పేరుతో దేశంలో లక్షల మంది కూలీలను తొలగించి వారి పొట్ట కొట్టిందని ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తున్నదని ఆ చట్టాన్ని కాపాడుకోవడానికి గ్రామ స్థాయిలో వ్యవసాయ కూలీలను ఐక్యం చేయాలని అన్నారు. కార్మికులు పోరాట సాధించుకున్న కార్మిక చట్టాలను తొలగించి పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా లేబర్ కోడ్లు తీసుకువచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కు తీసుకు నే వరకు ప్రజల సమీకరించి ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్, మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డ లక్ష్మీనారాయణ,కేశవరావు, కేశవులు, శేషుబాబు, పాషా, కొప్పుల శ్రీను, మురహరి రఘు, బ్రహ్మయ్య,తదితరులు పాల్గొన్నారు.



# సమాజాన్ని అభిమానించే జాతిగా కమ్మ వారు వుండాలి.

## జాతి చరిత్రకు కళంకం తీసుకు రావద్దు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మధిర,నవంబర్ 19 (వుదయం ప్రతినిధి) సమాజం అభిమానించే జాతిగా కమ్మ సామాజిక వర్గం పేరు ప్రతిష్టలు పొందాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మధిర మండలం ఆత్కూరు రామకృష్ణ మాడుతట్లో ఆత్కూరు అబ్బూరి రామకృష్ణ మామిడి తోటలో మధిర కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ కమ్మ సామాజిక వర్గాల నేతలు జాతి చరిత్రకు కలంకం తీసుకురావద్దని ఆయన సూచించారు. ఇతర కులాల వారు సైతం కమ్మ సామాజిక వర్గాన్ని ఆదర్శంగా తీసుకునే విధంగా కమ్మ సామాజిక వర్గం సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కమ్మ సామాజిక వర్గానికి ఎంతో చరిత్ర ఉన్నదని, పూర్వికులు కమ్మ సామాజిక వర్గానికి ఎంతో ఘనకీర్తిని ఇచ్చారని, దానిని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత నాటి తరం పై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్సీ తాతా మధు మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరావు మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరావు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గాప్రసాద్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు,టిడిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం జిల్లా కమ్మ సంఘం నేతలు రత్నాకర్, చావా రామకృష్ణ,మధిర కమ్మ సంఘం నేతలు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, కరివేద వెంకటేశ్వరావు, గడ్డం రమేష్, రావూరి శ్రీనివాసరావు,కరివేద సుధాకర్, బి.వి.ఆర్,తన్నీరు రామకృష్ణ, కొంగర మురళి,మువ్వా రామకృష్ణ,చెరుకూరి నాగార్జున,పారుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రాయింగ్ కాంపిటేషన్లో మెడల్స్ సాధించిన పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ కాపుగల్లు విద్యార్థులు




కోదాడ నవంబర్ 19(వుదయం) :కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామ పీఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ఇటీవల మాస్టర్ ఆర్ట్స్ కాంపిటీషన్ ముంబై వారు నిర్వహించిన నేషనల్ డ్రాయింగ్ కాంపిటీషన్లో మూడు గోల్డ్ మెడల్స్ రెండు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుకుల రామారావు తెలిపారు. ఎరగాని అస్మిత, పెద్ది లాస్య, మాలోతు మానస గోల్డ్ మెడల్ సాధించగా బాడిష అంజలి, అక్షిత లు సిల్వర్ మెడల్ సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి ఎన్నో మెడల్స్ గెలుచుకోవాలని వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ తమలపాకుల సైదులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మికంగా తనిఖీ చేసిన డిప్యూటీ సీఈఓ గీత



ఆందోల్ నవంబర్ 19 (వుదయం ప్రతినిధి) మెదక్ జిల్లా అల్లాదుర్గం లో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ను బుధవారం ఆకస్మికంగా జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ గీత మరియు వారి బృందం తో కలిసి కార్యాలయమునకు సందర్శించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక తనిఖీ లో భాగంగా క్యాష్ బుక్స్,రికార్డులను ఆఫీస్ రిజిస్టర్స్ తనిఖీ నిర్వహించడం జరిగింది. తనిఖీ లో భాగంగా ఎలాంటి తప్పిదం లేదని చెప్పడం జరిగింది. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో మరియు ఎన్ఆర్ఈజీఎస్ టి ఏ టీ లతో రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డి , సూపరిండెంట్ చంద్రశేఖర్ , ఎంపీ ఓ లింగప్ప , ఏపీవో సుధాకర్ , కార్యాలయ జూనియర్ సహాయకులు సజ్జాద్ అలీ , వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మరియు కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు

# నో పార్కింగ్ ప్లేస్ లో వాహనాలు నిలిపితే జరిమానా.



మధిర,నవంబర్19(వుదయం ప్రతినిధి) : మధిర మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపితే జరిమానా తప్పదని మధిర టౌన్ పోలీసులు హెచ్చరిక జారీ చేస్తున్నారు.రిలయన్స్ స్మార్ట్ బజార్ (రంగాస్ మాల్) ఎదురుగా గల అండర్ పాస్ లో వాహనాలు నిల్పటంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పాలవుతున్న సందర్భంలో మధిర టౌన్ పోలీస్ వారు వాహనదారులకు జరిమానా విధించడం జరిగింది.ఇలా పార్క్ చేసిన వాహనాలకు జరిమానా విధించడం జరుగుతుందని మధిర టౌన్ పోలీస్ వారు తెలియజేస్తున్నారు.

# అపరి శుభ్రతకు నిలయాలుగా అంగన్ వాడీ కేంద్రం పల్లె దవాఖానలు





గద్వాల నవంబర్ 19 (వుదయం ప్రతినిధి) : గద్వాల నియోజకవర్గంలోని కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో ఉన్న అంగన్ వాడీ కేంద్రం, పల్లె దవాఖానల పెరిగిన గడ్డిని పిచ్చిమొక్కలను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గత వర్షాకాలంలో కురిసిన వర్షాలకు భవనం చుట్టూ గడ్డి, పిచ్చి చెట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో అక్కడ పాములు తదితర విషపురుగులు ఎక్కువగా సంచరిస్తున్నాయని పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతు న్నారు. పల్లె దవాఖాణ చుట్టు అలుముకున్న పిచ్చిమొక్కలతో దవాఖాణ వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. ఇలా గ్రామంలో అనేక చోట్ల అపరిశుభ్రత నెలకొన్న పంచాయతీ కార్యదర్శి ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు చొరవచూపి వెంటనే అంగనవాడీ, పల్లెదవాఖాణాల చుట్టూ గడ్డి, కంప చెట్లు తొలగించాలని వారు కోరుతున్నారు.




# విద్యార్థులు దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలి

## ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేత

గద్వాల ,నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): విద్యార్థులు దేశభక్తి భావాలను పెంపొందించుకుని, ఉన్నతమైన లక్ష్యాల వైపు అడుగులు వేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్ కన్వీనర్ ఠాగూర్ రితి సింగ్ కోరారు. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఏబీవీపీ గద్వాల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపన్యాస, వ్యాస రచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్ కన్వీనర్ ఠాగూర్ రితి సింగ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కరుణాకర్, గద్వాల్ జిల్లా ప్రముఖ్ ఆంజనేయులు, గద్వాల్ నగర కార్యదర్శి నరేష్ పటేల్, ఎస్ఎఫ్ డీ జిల్లా కన్వీనర్ ఎం.నరేష్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గుండిమి రఘువంశీ, నగర ఉపాధ్యక్షులు పద్మశ్రీ, సోషల్ మీడియా ఇంచార్జ్ సురేష్ నితిన్, సూర్య తేజ, నరేంద్ర,తేజ,మంజునాథ్, ఉదయ్, నితిన్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ ని కలిసిన బాసు హనుమంతు నాయుడు



గద్వాల నవంబర్ 19 (వుదయం ప్రతినిధి) :బుధవారం రోజు హైదరాబాద్ లోని నందినగర్ నివాసం నందు మాజీ మంత్రివర్యులు,బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హను మంతు నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించి, బి ఆర్ ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు

# ట్రాక్టర్,ఆటో ఢీ - ఒకరు మృతి, పలువురికి గాయాలు





పాపన్నపేట, ,నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): ట్రాక్టర్ మరియు ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధి నాగ్సాన్ పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు... పొడ్చన్ పల్లి గ్రామానికి చెందిన పచ్చ దేవరాజ్(17) వృత్తి రీత్యా విద్యార్థి..ఇతను గ్రామానికి చెందిన మరికొందరితో కలిసి అపుడపుడు క్యాటరింగ్ కు వెళ్తున్నాడు. యధావిధిగా మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కొందరితో కలిసి ఆటోలో ఏడుపాయలకు వెళ్లాడు.అక్కడ క్యాటరింగ్ ముగించుకొని తిరిగి ఇంటికి ఆటోలో వస్తుండగా నాగ్సాన్ పల్లి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఢీ కొట్టింది.దీంతో ఆటో బోల్తా పడగా ఆటోలో ఉన్న దేవరాజ్ తో పాటు ఆటోలో ఉన్న మరికొందరికి గాయాలయ్యాయి.స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వారిని అంబులెన్సులో మెదక్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.దేవరాజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యలో మృతి చెందాడు.మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# చరిత్ర పుటల్లో నిలిచిన వీరవనిత ఇందిరాగాంధీ

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



వెల్దండ నవంబర్ 19 (వు దయం ప్రతినిధి) చిత్రపుటల్లో నిలిచిన ధీర వనిత ఇందిరా గాంధీ అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు భారతదేశ మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద జయంతిని ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం ఉక్కు మహిళ ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు అనంతరం పండ్ల పంపిణీ చేశారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, మార్కెట్ చైర్మన్ సంజీవ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, పర్వత్ రెడ్డి, అంజన్ రెడ్డి సింగిల్ విండో డైరెక్టర్ వెంకయ్య గౌడ్, పుల్లయ్య, నారాయణ, నాగేష్ గౌడ్, అలీ సాబ్, తోపాటు తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు

# భూమిని కాపాడండి అంటూ అంగట్లో అవగాహన





పాపన్నపేట, ,నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): యూత్ అండ్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన పాపన్నపేట లో ఉన్నత పాఠశాల విద్యార్థులు భూమిని కాపాడండి అంటూ పాపన్నపేట అంగట్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగడికి చుట్టుపక్కల మండలాల నుండి సుమారు 30 గ్రామాల ప్రజలు వస్తుంటారు, వీరికి విద్యార్థులు అంగట్లో తిరుగుతూ అవగాహన కల్పించారు ఇందులో భాగంగా మొక్కలు నాటండి ప్రకృతిని కాపాడండి జంతువులను సంరక్షించండి, విద్యుత్ ఆదా చేయండి, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించండి, నీటిని సంరక్షించండి, కాలుష్యాన్ని నివారించండి చెత్త కోసం బుట్టలను వాడండి అంటూ అంగట్లో తిరుగుతూ పాంప్లెట్లు పంచుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మహేశ్వర్ , ఉపాధ్యాయులు వెంకటేశం, అంజా గౌడ్ ,ప్రవీణ్,భట్టు నాగరాజు, యాదయ్య, నింగప్ప, మోహన్రావు, వేణుగోపాల్ రెడ్డి, శ్రవణ్, రవికాంత్, కృష్ణ కాంత్, రియాజ్, శ్రీహరి, విశ్వనాథ్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు..

# గణపతి రైతు పొదుపు సంఘం కొనుగోలు కేంద్రం ప్రారంభం

## -వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు



ఖానాపురం, నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): మండలంలోని ధర్మరావుపేట గ్రామంలోని గణపతి రైతు పొదుపు పరపతి మార్కెటింగ్ పరస్పర సహాయక సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో మంజూరైన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి,గణపతి రైతు పొదుపు పరపతి మార్కెటింగ్ పరస్పర సహాయక సంఘం లిమిటెడ్ అధ్యక్షుడు బలుగూరి విజాకర్ రావులు కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వల్లే శ్రీనివాస్, వీరమనేని సాగర్ రావు, పరపతి సంఘం కార్యదర్శి గాలి దేవేందర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొనుకటి రాజు, ప్రధాన కార్యదర్శి లెంకలపల్లి రవి, నాయకులు గోనే రవీందర్, కొనుకటి సుధన్, లింగాల మల్లికార్జున్, కొనుకటి రామ్ రెడ్డి, తక్కలపల్లి వెంకటేశ్వర్ రావు, వల్లే ఎంకన్న, ఎర్రబెల్లి శీను, కొనుకటి మోహన్, వల్లే వీరన్న, అనుముల వెంకట్ రెడ్డి, మామిళ్ల సాయిలు రైతులు హమాలీలు కూలీలు తదితరు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

## -గోపాల్ రెడ్డి షేర్ సేవా సంస్థ డైరెక్టర్




మధిర,నవంబర్19(వుదయం ప్రతినిధి): షేర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,దెందుకూరు నందు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగిన సుస్థిర అభివృద్ధి కొరకు మొక్కల పెంపకం కార్యక్రమంలో మాట్లాడుతూ పర్యావరణమును రక్షించండి భవిష్యత్ కు పునాది వేయండి అనే నినాదం తో మొక్కలు నాటలని కోరారు. హెల్త్ సూపర్వైజర్ లంక కొండయ్య మాట్లాడుతూ వాతావరణ మార్పు ప్రజల జీవితాలను మరియు ఆరోగ్యాన్నివివిధ మార్గాలలో ప్రభావితం చేస్తుంది అని అందుకే ప్రతి ఒక్కరు మొక్కలు నాటలని చెపుతూ పాటల రూపంలో పాడారు. షేర్ సంస్థ డైరెక్టర్ గోపాలరెడ్డి మాట్లాడుతూ గ్రీన్ మధిరను చేయుటకు నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంటర్నెట్ ఎక్స్చేంజి, న్యూఢిల్లీ వారి సౌజన్యంతో మొక్కలు నాటడం వాటిని సంరక్షణ మరియు అవగాహనా, హైస్కూల్ స్థాయిలో వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతి ప్రదానం చేయటం జరుగుతుందని ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి అన్నారు. ఈ కార్యక్రమంలో విజయరాజ్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు షేర్ సిబ్బంది హనుమంతరావు, రామిరెడ్డి, శ్రీకాంత్ పాల్గొని మొక్కలు నాటారు.

# మహబూబ్ నగర్ జాతీయ స్థాయి పోటీలలో విజేతలుగా నిలవాలి

## -మూధ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్



మహబూబ్ నగర్ నవంబర్19 (వుదయం ప్రతినిధి): జాతీయస్థాయి గో గేమ్ జూనియర్ సబ్ జూనియర్ పోటీలలో క్రీడాకారులు విజేతలుగా నిలవాలని మూధ చైర్మన్ కె లక్ష్మణ్ యాదవ్ అన్నారు. ఈనెల 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు ఒడిస్సా రాష్ట్రంలో జరిగే సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ గో గేమ్ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే తెలంగాణ జట్టు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో క్రీడాకారులు తనలో ఉన్న క్రీడలు అయిపోయినాయాలను కనబరిచి జాతీయ స్థాయి పోటీలలో విజేతలు నిలవాలని ఆకాంక్షించారు.కాగా రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు సబ్-జూనియర్ విభాగంలో మేహమ్మద్ సోఖాన్ గుర్దన్,సి.టి. లలితేష్,జూనియర్ విభాగంలో పి. రాహుల్,ఛేతన్ చంద్ర సీనియర్ విభాగంలో పి. రాజేష్,సబావత్ వర్షిత్ లు ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గో గెమ్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ షకీల్ అహ్మద్, మహబూబ్ నగర్ జిల్లా గో గేమ్ కార్యదర్శి అఫ్రోజ్ లు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జన్మదిన వేడుకలు



ఇందిరా గాంధీ విగ్రహానికి ఉపయోగిస్తున్న కాంగ్రెస్ నేతలు అయుబ్, జన్ను ప్రమీల

వరంగల్, నవంబర్ 19 (వుదయం జిల్లా ప్రతినిధి) : మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ గారి 108 జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని దేశాయిపేట గ్రామంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగినది జన్మదిన సందర్భంగా పూలమాలలు వేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోవడం జరిగినది ఏదైతే భారతదేశం లో అనగారిన వర్గాలకు అండగా నిలిచిన మహనీయురాలు భారతదేశంను అన్ని దేశాలలో ముందు అగ్ర భాగనా నిలిపిన రాజకీయ దక్షితురాలు ఇందిరాగాంధీ అని కార్యక్రమ ముఖ్యఅతిథిగా విచ్చేసిన అయూబ్ కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఇందిరా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణలోని ఆడపడుచులందరికీ కోటి చీరలు పంచాలని చెప్పి నిర్ణయించుకోవడం శుభపరిణామము మొదటి విడుదల పల్లె ప్రాంతంలోని మహిళా సోదరీమణులకు. మలివిడతగా పట్టణ ప్రాంత మహిళా సోదరీమణులకు కోటి చీరలు పంచాలి అని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న ధర్మీల రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారికి ఉత్తంకుమార్ రెడ్డి కి రాష్ట్ర మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలపడం జరుగుతుంది . కాంగ్రెస్ పార్టీ ఆనాడు స్వర్గీయ ఇందిరాగాంధీ మనవడు రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై అహర్నిశలు కృషి చేయడం బలహీన వర్గాల ఇండ్లలో వెలుగు కాంతిరేఖలను నింపడం కాంగ్రెస్ పార్టీ యొక్క ముఖ్య ఉద్దేశం రానున్న రోజుల్లో బడుగు బలహీన వర్గాల కోసం బృహత్తరమైన కార్యక్రమాలు ఎన్నో తీసుకొని ప్రజల కోసం మమేకమై ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేస్తారని చెప్పి ఆశిస్తూ ఇందిరాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త అనుసరించాల్సిన అవసరం ఉందని చెప్పరు మొహమ్మద్ అయూబ్ పిలుపునియ్యడం జరిగినది . ఈ కార్యక్రమాన్ని డివిజన్ అధ్యక్షులు బొట్ల ప్రసాద్ ఆధ్వర్యంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జన్ను ప్రసన్న గిన్నారం రాజు , చెన్ను ఆదామ్ సుధాకర్, జన్ను ప్రమీల, శ్రీనివాస్, రాజశేఖర్, నూతన్ బాబు, బొట్ల నితిన్ తదితరులు పాల్గొన్నారు

# వినాయక నగర్ నుండి రామాలయం వరకు రోడ్డు వేయాలి



జన్నారం, నవంబర్ 19(వుదయం విలేకరి) వినాయక్ నగర్ నుండి రామాలయం వరకు రోడ్డు వేయాలని కోరుతూ ఆ కాలనీ వాసులు తహసిల్దార్ రాజ మనోహర్ రెడ్డికి బుధవారం రోజున వినతిపత్రం అందజేశారు.రామాలయం నుండి వినాయక నగర్ కు వెళ్లే మార్గంలో అయ్యప్ప, సాయిబాబా మందిరాల తో పాటు స్థానిక తహసిల్దార్ కార్యాలయం కూడా కలదని వాటికి వెళ్ళేందుకు దారి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే సర్వే చేసి రోడ్డు మార్గం వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోనకల్, జన్నారం, వినాయక నగర్ ల గ్రామస్తులు ఉన్నారు.

# పోగొట్టుకున్న మొబైల్స్ ను తిరిగి అప్పగింత



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 19(వుదయం జిల్లా ప్రతినిధి): పోగొట్టుకున్న మొబైల్స్ ను తిరిగి బాధితులకు అప్పగించినట్లు మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మహదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన మామిడాల పోచాలు తన రెడీమి కంపెనీ మొబైల్ ఫోన్ ను మరియు పెద్దంపేట గ్రామానికి చెందిన బిసుల శ్రీనివాస్ తన ఒప్పో మొబైల్ ను పోగొట్టుకొని మహదేవపూర్ పోలీస్ స్టేషన్ లో వారు దరఖాస్తు చెయ్యగా పోలీస్ శాఖ,సీఈఐఆర్, పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ లను గుర్తించి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు

# జాజాపూర్ లో ఆకట్టుకున్న 55 మంది ఝాన్సీ రాణులు





నారాయణపేట టౌన్ నవంబర్19 (వుదయం ప్రతినిధి): వీరనారి లక్ష్మీబాయి జయంతి సందర్భంగా జాజాపూర్ ఉన్నత పాఠశాలలో 55 మంది బాలికలు వీరనారి వేషధారణ ధరించి మణికర్ణిక నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం వీరోచితంగా పోరాడి బ్రిటిష్ వారిని గడగడలాడించి అతి చిన్న వయసులో దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఝాన్సీరాణి లక్ష్మీబాయి జీవితం అందరికీ ఆదర్శమని అన్నారు. పిల్లల్లో ధైర్య సాహసాలు నింపడం కోసమే ఝాన్సీ రాణి వేషధారణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. బాల బాలికలు ఆమెను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో, ధైర్యంతో ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ మధుసూదన్, భాను ప్రకాష్,మంగళ, శ్రీదేవి, పి. శిరీష టీ నిర్మల శశిరేఖ ఏ ప్రతాప్ నర్సింలు రఘురామేశ్వర్ రెడ్డి,మాణిక్యప్ప, వెంకటేష్ తో పాటు విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి




ఖానాపురం, నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): మండల కేంద్రానికి చెందిన వెలివెల్లి రామారావు నాగమణి దంపతుల కుమారుని వివాహానికి నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ హాజరై నూతన వధూవరులు వెలివెల్లి విభాష్ పరిమళపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ పాల్వాయి రవి, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు కత్తి కిరణ్, ప్రధాన కార్యదర్శి గజ్జి రాజు, మండల మైనార్టీ అధ్యక్షుడు ఎస్కే ముస్తఫా, సిపిఎం పార్టీ నాయకుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీపీ



ఖానాపురం, నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): మండల కేంద్రానికి చెందిన వెలివెల్లి రామారావు నాగమణి దంపతుల కుమారుని వివాహానికి మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు హాజరై నూతన వధూవరులు వెలివెల్లి విభాష్ పరిమళపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ వైస్ చైర్మన్ దేవినేని వేణుకృష్ణ, విజయ డైరీ పాలకేంద్రం చైర్మన్లు ఇరుకు దేవేందర్ రావు, పరుచూరి నరేంద్ర, సిద్ది వెంకటరామ నరసయ్య, వల్లభనేని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# లాటరీ ద్వారా వైన్ షాప్ ఎంపిక



మహబూబ్ నగర్ నవంబర్19 (వుదయం ప్రతినిధి): జిల్లా కలెక్టరెట్ లో మహబూబ్ నగర్ 016 వైన్‌షాపునకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆధ్వర్యం లో రీ లాటరీ నిర్వహించారు. ఇట్టి లాటరీలో 28మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ లాటరీలో 22 నెంబర్ గల జెట్టం శ్రీను ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎక్సైజ్ అధికారి సుధాకర్, అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

# అధిక ధరలతో సొంతింటి కల సాకారం ఎలా సాధ్యం.?



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 19(వుదయం జిల్లా ప్రతినిధి): భవన నిర్మాణానికి అవసరమయ్యే సామగ్రి ధరలతో పేదవాని సొంతింటి కల సాకారమయ్యినా అంటూ ప్రజల్లో చర్చలు సాగుతున్నాయి.ఇంటి నిర్మాణంలో సిమెంటు,ఇసుకతో పాటు అవసరానికయ్యే వివిధ రకాల సామాగ్రి అధిక ధరలు ఉండడంతో ఇందిరమ్మ ఇళ్ళు మంజూరైన పేద లబ్ధిదారుల కల కలగానే మిగిలిపోతుందా అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.దేవుడు కరుణించినా పూజారి కరుణించలేదన్నట్లుగా మారిందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ఉమ్మడి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇబ్బందుల నేపథ్యంలో లబ్ధిదారులలో ఆరోపణలు వినిపిస్తున్నాయి నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని అమలు చేస్తోంది. ఎంపికైన లబ్ధిదారులు ఉత్సాహంతో నిర్మాణ పనులు మొదలు పెట్టుకున్నారు.ఇక్కడివరకు బాగానే ఉంది.అసలు కథ ఇక్కడే మొదలౌతుంది.ఇంటి పనులను మొదలు పెట్టుకున్న లబ్ధిదారులకు ఉత్సాహాన్ని అదునుగా భావించిన కొందరు వ్యాపారులు భవన నిర్మాణ సామగ్రి ధరలు పెంచుతుండడడంతో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సొమ్ము సరిపోదని రూ.5 లక్షలతో సాధ్యమేనా? అని లబ్ధిదారులు భయపడుతున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మహాదేవపూర్ మండలంలో ఎలికేశ్వరం గ్రామాన్ని ఎంపిక చేశారు పలు గ్రామలలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మార్కెట్లో ఇళ్ల నిర్మాణ సామగ్రి ధరలు ఎక్కువగా ఉండటంతో రూ.5 లక్షలతో నిర్మించడం సాధ్యమయ్యేలా లేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇల్లు మంజూరు కాకముందుతో పోలిస్తే ధరలు ఇప్పుడు చాలా పెరిగాయని కంకర, సుతారి, మొరం, సలాక, కూలీ రేట్లు భారీ శాతం మేర పెంచారని ఈ ధరలు తగ్గకపోతే ఇంటి నిర్మాణం పూర్తిచేయడం కష్టమే అని లబ్ధిదారులు దిగులు చెందుతూ తెలిపారు. మేస్త్రీలు నిర్మాణ ధరలు, కూలీల ధరలు కూడా పెంచార అని గతంలో భవన నిర్మాణ మేస్త్రీలు ఫీట్ కు 250 రూపాయల వరకు తీసుకునేవారని ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లలో ఫీట్ కు 350 రూపాయలు తీసుకుంటున్నారని జిఎస్టి తగ్గినప్పటికీ సిమెంట్ ఒక్క బ్యాగుకు 350 రూపాయలు వసూలు చేస్తున్నారని ఐరన్ పరిస్థితి అలానే ఉందని మరోవైపు ఒక ఇసుక ట్రాక్టర్ లోడ్ కు దాదాపు 1000 నుండి 1200 రూపాయలు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి ఇలా పెరిగిన ధరలతో పేద ప్రజల సొంతింటి కల నెరవేరడం సాధ్యం ఎలా అవుతుందని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.ఈ విషయంపై ఇందిరమ్మ కమిటీలు సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షించడం లేదని దానితోనే భవన నిర్మాణ సామాగ్రి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తో పాటు హౌసింగ్ శాఖ పిడి దృష్టి సారించి భావన నిర్మాణ సామాగ్రి అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



మరికల్ నవంబర్ 19 ( వుదయం ప్రతినిధి): మరికల్ మండల కేంద్రంలోని బుధవారం ఇందిరాగాంధీ చౌరస్తాలో ఇంద్ర గాంధీ 108వ జయంతి వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి ఈ సమావేశంలో మాట్లాడుతూ భారత తొలి మహిళా ప్రధాని భారతరత్న ఉక్కు మహిళగా పేరు పొందిన శ్రీమతి ఇందిరాగాంధీ దేశం కోసం ఎన్నో సేవలు చేశారని మరి వాళ్ళ కుటుంబం దేశం కోసం పాణాల అర్పించినారని ఆయన కొనియాడారు పేదలకు ఆమె ఎంతో కృషి చేసిందని బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఓ బి సి జిల్లా అధ్యక్షులు గొల్ల కృష్ణయ్య మరికల్ మండల నాయకులు బెలగుంది వీరన్న పట్టణ అధ్యక్షులు హరీష్ కుమార్ రామకృష్ణ జంగిల్ రవి కే అంజనేయులు పూలముని రామకృష్ణ కే గోవర్ధన్ గొల్ల రాజు పి రఘు బొంత మొగులయ్య అంజిరెడ్డి దామోదర్ రెడ్డి ఎం రఘు ఫ్రీ శ్రీనివాసులు వి నాగరాజు గొల్ల ఆంజనేయులు కే రాజు మల్లారెడ్డి చిన్నారెడ్డి కురుమన్న చెన్నప్ప గొల్ల విజయ్ షాకీర్ తో పాటు అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు


# గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి




మహబూబ్ నగర్ నవంబర్19 (వుదయం ప్రతినిధి): జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలనీ ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.మహబూబ్ నగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు మాట్లాడారు.జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలల్లో చాలా పాఠశాలలు గుర్తింపు లేకుండా , ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పలుమార్లు ఎంఈఓ, డిఈఓ లకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని అన్నారు.పట్టణంలో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న అనుమతి లేని ప్లే స్కూళ్ళ పై కూడా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అధికారులు తక్షణమే స్పందించి ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకావాలని యెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు రాజశేఖర్ ,లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు శేఖర్, సుదర్శన్, వెంకటేష్ పాల్గొన్నారు.

# బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయండి

## -జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



నారాయణపేట టౌన్ నవంబర్19 (వుదయం ప్రతినిధి): జిల్లాలోని బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ- జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్ లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా స్థానిక సంస్థ హాజరై స్ఫూర్తిదాయక అభిప్రాయంతో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వర్, డిప్యూటీ కలెక్టర్లు శ్రీరామ్ ప్రణీత్, ఫణి కుమార్, ఎస్. డీ.సీ రాజేందర్ గౌడ్, మిషన్ భగీరథ ఈ ఈ రంగారావు, డీ పీ ఆర్ వో ఎం.ఏ. రషీద్, ఇతర శాఖల జిల్లా అధికారులు, డిసిపివో కరిష్మా , చైల్డ్ హెల్ప్ లైన్ సమన్వకర్త నర్సింహులు, జిల్లా బాలల సంరక్షణ సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, సఖి సిబ్బంది ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించిన ఎంపీడీవో కృష్ణయ్య



ఊర్కొండ ,నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజు ఇందిరమ్మ ఇండ్ల ప్రగతి పరిశీలన నిమిత్తం మాదారం గ్రామాన్ని సందర్శించడం జరిగింది. మంజూరు అయిన ప్రతి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పరిశీలించగా, గ్రామానికి మంజూరు అయిన మొత్తం 42 ఇండ్లకు గాను %ఖు%ఈరోజు వరకు

1. బిలో బేస్మెంట్ పనులు జరుగుచున్నవి 1 ఇల్లు
2. బేస్మెంట్ పని పూర్తి అయినవి 12 ఇండ్లు
3. రూఫ్ లెవెల్ పూర్తి అయినవి 12 ఇండ్లు
4. గోడలపని నడుస్తున్నవి 4 ఇండ్లు
5. స్లాబ్ పని పూర్తి అయినవి 6 ఇండ్లు
4. వివిధ కారణాలతో ఇంకా నిర్మాణం చేపట్టనివి 7 ఇండ్లు.

ఈ గ్రామానికి వివిధ దశల్లో పూర్తి అయిన ఇండ్లకు మొత్తం రూ. 35.80 లక్షలు విడుదల కాబడినవి. వివిధ దశల్లో ప్రగతిలో ఉన్న లబ్ధిదారులు త్వరగా పనులు పూర్తి చేసుకొనుటకు సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భనలో శ్రీ లక్ష్మణ్ నాయక్, ఎంపీఓ, శ్రీ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థాయి సిబ్బంది పాల్గొనడం జరిగింది. ఎంపీడీఓ ఊర్కొండ

## ఇసుక,మట్టి తీవ్రకొరత ఏర్పడిన వలన
## ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన ఇంజనీర్స్, కాంట్రాక్టర్స్, బిల్డర్స్ క్రెడాయి సభ్యులు.





గద్వాల నవంబర్ 19 (వుదయం ప్రతినిధి)గద్వాల జిల్లాలో భవన నిర్మాణాల కోసం ఇసుక మట్టి తీవ్ర కొరత ఏర్పడింది. ఈ సమస్య వలన రన్నింగ్ లో ఉన్న నిర్మాణాలు,భవన నిర్మాణ కార్మికులు కొత్తగా ఇంటి నిర్మించుకునే వారందరూ తీవ్ర ఇబ్బందులు గురైతున్నారు. ఇట్టి తీవ్రమైన సమస్యలను తొందర్లోపలనే పరిష్కరించాలని అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేయడం జరిగింది. అదేవిధంగా జీవో నెంబర్ 168 గద్వాల టౌన్ మాస్టర్ ప్లాన్ సవరణల గురించి ఇంజనీర్స్, బిల్డర్స్ క్రెడాయ్ సభ్యులకు సభ్యుల సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకొని భవిష్యత్ తరాలకు మంచి మాస్టర్ ప్లాన్ ను రూపొందించాలని కోరడమైనది. ఇట్టి కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సభ్యులు పాల్గొనడం జరిగింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి.



ఖానాపురం, నవంబర్ 19 (వుదయం ప్రతినిధి):మండల కేంద్రంలోని హరిత మిత్ర రైతు పొదుపు పరపతి మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి, రైతులు సంఘ సభ్యులు హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

# శక్తిపీఠం ఆధ్వర్యంలో ముగిసిన కార్తీక పురాణ ప్రవచనం



నారాయణపేట నవంబర్19 (వుదయం ప్రతినిధి) : శక్తిపీఠం ఆధ్వర్యంలో కార్తిక పురాణ ప్రవచనం గురువారంతో ముగియనున్నట్లు శక్తిపీఠం వ్యవస్థాపకులు డా. శాంతానంద స్వామి పురోహిత్ తెలిపారు. గత నెల 22నుండి ప్రారంభం అయ్యి నవంబర్ 20 గురువారం వరకు కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు కాగా ప్రతి రోజు ఉదయం 6:00 గం లకు అమ్మవారికి కాకడ హారతి, సాయంత్రం 07:00 గంటల నుండి 8:00 గం ల వరకు ప్రముఖ కృష్ణయాజుర్వేద స్మార్త పండితులైన బ్రహ్మశ్రీ ఉట్కూర్ విభావాసు అగ్నిహోత్రి పురోహిత్ చే కార్తిక పురాణ ప్రవచనం అందించారు.కార్యక్రమం అనంతరం విచ్చేసిన భక్తులకు అమ్మవారి హారతి శక్తి పీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డా స్వామి శాంతానంద పురోహిత్ తీర్థ ప్రసాద ఫలావితరణ ఇచ్చి భక్తులందరికి ఆశీర్వచనం అందించారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్





గద్వాల నవంబర్ 19 (వుదయం ప్రతినిధి) : మంగళవారం గద్వాల పురపాలిక పరిధిలోని జమ్మిచేడు గ్రామం వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఎర్రవల్లి మండలం తిమ్మాపూర్ గ్రామం వద్ద ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటిదాకా రైతుల నుంచి ఎంత ధాన్యం కొనుగోలు చేశారో నిర్వాహకులను అడిగారు. తేమ శాతం, గింజల పరిమాణాన్ని కొలిచే విధానాన్ని పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద ఆరపెట్టిన ధాన్యాన్ని చూశారు. కేంద్రానికి కేటాయించిన టార్పాలిన్లు, గన్ని సంచుల వివరాలను అడిగారు. రైతుల సాగు ధ్రువీకరణకు సంబంధించి ఆయా కేంద్రాల పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులు ఇచ్చే టోకెన్స్ పరిశీలించారు. పొలం యజమానుల చేనుల్లో పంటలు సాగుచేసిన కౌలు రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేశాక వివరాలను యాప్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన రైతుల వివరాలను ట్యాబ్ లో ఓపిఎంఎస్ (ఆన్లైన్ ప్రొక్యూర్ మెంట్ మేనేజ్మెంట్ సిస్టం) ఎప్పటికప్పుడు నమోదు చేయకపోవడం సరికాదని, ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే పరిష్కరించాలని ఆదేశించారు. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లింపు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశిత మిల్లులకు ధాన్యం రవాణా ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు ఈ పర్యటనలో ఐకెపి డిపిఎం అరుణ, ఏపీఎం సలోమి, గద్వాల మండల వ్యవసాయ శాఖాధికారి ప్రతాప్ కుమార్, ఏఈఓలు ప్రవలిక, నరేష్, మెప్మా అధికారులు శ్రీకర్, వెంకటేశ్వర్లు, మహాలక్ష్మి, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# మహిళలకు ఝాన్సీ లక్ష్మీబాయి స్ఫూర్తి కళాశాల ప్రిన్సిపాల్ లలిత

హుస్నాబాద్ (వుదయం )నవంబర్ 19 హుస్నాబాద్ ప్రతి మహిళ వీరనారి రుద్రమదేవిలా ఎదిగితే సమాజంలో అణచివేతకు, వివక్షకు తావు ఉండదని మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత ఉద్ఘాటించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో 'స్త్రీ శక్తి దివస్' సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.భారత వీరనారి, అసమాన ధైర్యసాహసాలకు ప్రతీక అయిన రాణి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం, ఆమె నాయకత్వం, త్యాగం, మాతృభూమి పట్ల ఉన్న అపార భక్తిని ఆమె స్మరించుకున్నారు. అమ్మాయిల్లోని ధైర్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ గుణాలను వెలికితీయడం సమాజం యొక్క బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి అమ్మాయి రుద్రమదేవిలా ముందు అడుగు వేయగలిగితే.. అణచివేత, వివక్ష, అన్యాయం వంటివి పూర్తిగా తుడిచిపెట్టుకుపోతాయని ప్రిన్సిపాల్ లలిత స్పష్టం చేశారు. అమ్మాయిల విద్య, రక్షణ, స్వీయాభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.అనంతరం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంసాని రాకేష్ మాట్లాడుతూ.. భారతదేశం ఎందరో వీరులను, వీరమాతలను ప్రసవించిన పవిత్ర భూమి అని, రాణి ఝాన్సీ లక్ష్మీబాయి అందులో అత్యున్నత స్థానంలో నిలిచిన వీరనారి అని కొనియాడారు. 1857 స్వాతంత్ర్య సమరంలో ఆమె పోషించిన పాత్ర, బ్రిటిష్ అణచివేతకు ఎదురొడ్డి చేసిన త్యాగం నేటి యువతకు స్ఫూర్తినిస్తాయన్నారు.?రాణి లక్ష్మీబాయి ధైర్యం, నాయకత్వం, దేశభక్తి ప్రతి భారత యువతి, యువకుడు ఆకళింపు చేసుకోవాల్సిన విలువలు అని తెలిపారు. స్వీయ బలం, స్వీయ రక్షణ, సమాజ సేవ పట్ల అవగాహన పెంపొందించడం 'స్త్రీ శక్తి దివస్' ముఖ్య లక్ష్యం అని పేర్కొన్నారు. భారత సమాజ నిర్మాణంలో రుద్రమదేవి, చెన్నమ్మ, అహల్యాబాయి హోల్కర్ వంటి వీరనారుల పాత్ర అపురూపమని ఆయన గుర్తుచేశారు.?ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి చరణ్, కళాశాల కార్యదర్శి అభినయ శ్రీ, నగర సంయుక్త కార్యదర్శి అంజి, విద్యార్థినిలు లావణ్య, అర్చన, మనస, సిరి, తదితరులు పాల్గొన్నారు.

# వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

## ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



గద్వాల నవంబర్ 19 (వుదయం ప్రతినిధి) : బుధవారం హైదరాబాద్ నుండి సహచర మంత్రులతో కలిసి చీరల పంపిణీ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు మహిళా సంఘం సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముందుగా గ్రామీణ ప్రాంతాలలో ఈరోజు నుండి డిసెంబర్ 9 వరకు ఇందిరమ్మ చీరల పంపిణీ, మార్చ్ ఒకటి నుండి 8వ తేదీ వరకు పట్టణ ప్రాంతాలలో ఏందిరా అమ్మ చీరలో పంపిణీ నిర్వహించడం జరుగుతుందన్నారు పండగ వాతా వరణంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేస్తూ చీరల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో 80 వేల మంది మహిళా సభ్యులు ఉండగా, జిల్లాకు 86 వేల చీరలు అందినట్లు తెలిపారు. ఇట్టి చీరలను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో అన్ని గ్రామాలకు పంపిణీ చేసి ఏపీఎం, గ్రామ కార్యదర్శులు మహిళా సంఘం సభ్యుల పరస్పర సహకారంతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పంపిణీ కార్యక్రమం నిర్వహించాలన్నారు. పంపిణీ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని వారి సమక్షంలో పండగ వాతావరణంలో పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. ప్రతి లబ్ధిదారుని ఫోటోతో పాటు ఆధార్ నెంబరు సేకరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో విరివిగా వడ్డీలేని బ్యాంకు రుణాలను అందించడం జరుగుతుందని, వారి ఆర్థిక అభివృద్ధి కోసం బస్సులు పెట్రోల్ బంకులు సోలార్ ప్లాంట్ లు కూడా జిల్లాలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, జిల్లా పంచాయతీ అధికారి నాగేంద్రం, అడిషనల్ డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు ప్రభావతి, మహిళా

# లిసన్ టు చిల్డ్రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## జిల్లా కలెక్టర్ విజయేందిరాబోయా



మహబూబ్ నగర్ నవంబర్19 (వుదయం ప్రతినిధి) : జిల్లాలో నేడు(నవంబర్ 20) అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా యూనిసెఫ్ సహకారం తో ప్రయోగాత్మకంగా లిసెన్ టు చిల్డ్రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. జిల్లాలో మండలాలు,నగరపాలక సంస్థ(మహబూబ్ నగర్) మున్సిపాలిటీ లలో 22 లొకేషన్ లలో ఈ కార్యక్రమం నిర్వహణకు మండల విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. లిసెన్ టు చిల్డ్రన్ కార్యక్రమం గురించి కలెక్టర్ వివరిస్తూ బాలలకు హక్కులు ఉంటాయని,బాలలు నుండి వినడం ద్వారా వారి అభిప్రాయాలను, ఎదురయ్యే సమస్యలను గుర్తించి క్రోడీకరించి, విశ్లేషణ చేసి మహిళా,శిశు,సంక్షేమ శాఖ,పోలీస్,వైద్య ఆరోగ్య శాఖ ,విద్యా శాఖ,పంచాయతీ ,ఇతర శాఖల సమన్వయంతో వాటిని పరిష్కరించి బాలల హక్కుల రక్షణ, వేధింపుల నుండి రక్షణ,అన్ని విధాలుగా వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 17 మండలాల్లో,మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ,మూడు మున్సిపాలిటీల్లో 22 చోట్ల ఈ నెల 20 న లిసెన్ టు చిల్డ్రన్ కార్యక్రమం మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ,పంచాయతీ శాఖ సమన్వయంతో నిర్వహించాలని సూచించారు.

ఇందులో భాగంగా ప్రతి మండలం,మున్సిపాలిటీలలో నగర పాలక సంస్థ 3 చోట్ల ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 60 మంది పిల్లలను వయస్సు ఆధారంగా 12 నుండి 15 సంవత్సరం మధ్య వయస్సు కలిగిన బాలురు 15 మంది ఒక గ్రూప్,బాలికలు 15 మంది ఒక గ్రూప్,16 నుండి 18 సంవత్సరం వయస్సు కలిగిన బాలురు 15 మంది ఒక గ్రూప్,బాలికలు 15 మంది ఒక గ్రూప్ మొత్తం 4 గ్రూపులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రూప్ కు టీచర్ లు ముగ్గురు సంధాన కర్తలుగా వ్యవహారిస్తారని, పంచాయతీ కార్యదర్శులు,మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులూ పాల్గొంటారని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని,ముగింపు కు ఎం.పి.డి.ఓ.లు,తహాశీల్దార్ లు మండలం లోని అధికారులు,ఇతర శాఖలు కూడా పాల్గొంటారని తెలిపారు. గ్రూపులో బడి లో లేని పిల్లలు,ప్రత్యేక అవసరాలు గల పిల్లలు,అనాథలు,వలస పిల్లలు అన్ని రకాల పిల్లలతో ఏర్పాటు చేయాలని సూచించారు. సంధాన కర్తలు వారికి స్నేహ పూర్వకంగా కార్యక్రమం ఉద్దేశం వివరించి వారికి ప్రశ్నల రూపంలో ఇచ్చి వారి నుండి అభిప్రాయాలు,సూచనలు,సమస్యలు వినాలని తెలిపారు. ఇందులో మహిళా శిశు,సంక్షేమ,శాఖ,విద్యా శాఖ,పంచాయతీ శాఖలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. హెల్ప్ లైన్,వాట్సప్ నంబర్ 9154784095 కూడా తమ సలహాలు,సూచనలు,సమస్యలు వివరించవచ్చని తెలిపారు.


# అండర్ 14 క్రికెట్ టీంకు సెలెక్ట్ అయిన పేట విద్యార్థులు



నారాయణపేట నవంబర్19 (వుదయం ప్రతినిధి) : ఈ నెల 15 వ తేదీన మక్తల్ పట్టణంలో ని మినీ స్టేడియంలో నిర్వహించిన నారాయణపేట జిల్లా అండర్ 14 క్రికెట్ టీం సెలెక్షన్ లో నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన సాయి హర్షిత్,కార్తిక్ రాజ్,చరణ్, అతిక్ లు సెలెక్ట్ అయినట్లు పిడి రమణ తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపేట క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన క్రీడాకారులకు గత కొన్ని రోజులుగా ప్రత్యేక శిక్షణ ను అందిస్తున్న కోచ్ అజయ్ కుమార్ సాతుపాటి ని అభినందించారు. ఈ సందర్భంగా పిడి రమణ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా నుండి 20 మంది అండర్ 14 టీం కు సెలెక్ట్ అయితే పేట పట్టణానికి చెందిన నలుగురు ఉండటం జరిగింది అని వారికి ప్రత్యేక శిక్షణ అందించిన కోచ్ అజయ్ శిక్షణలో క్రీడాకారులు రాటు తెలరని వారు రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారుల కుటుంబ సభ్యులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# గజ్వేల్ లో ఉత్తేజవంతంగా జరిగిన పీ.డీ.ఎస్.యు సిద్దిపేట జిల్లా 4వ మహాసభ..

## విద్యారంగ సమస్యల పరిష్కారం కై సమరశీల పోరాటాలు నిర్వహిద్దాం
## రాష్ట్ర అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.శ్రీకాంత్, పి.నాగరాజు పిలుపు




గజ్వేల్, నవంబర్ 19 (వుదయం ప్రతినిధి) : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ.డీ.ఎస్.యు) సిద్దిపేట జిల్లా 4వ మహాసభలను బుధవారం టిపిటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. పీ.డీ.ఎస్.యు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రమేష్ సంస్థాగత చిహ్నమైన బిగిపిడికిలి జెండాను ఆవిష్కరించారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా పీ.డీ.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వి.శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు హాజరై మాట్లాడుతూ శాస్త్రీయ విద్య, సమ సమాజం కోసం పీ.డీ.ఎస్.యు 50 సంవత్సరాలుగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జార్జిరెడ్డి, జేసిఎస్ ప్రసాద్ ప్రేరణతో ఆవిర్భవించిన పీ.డీ.ఎస్.యు సమాజంపై చెదిరిపోని ప్రభావం వేసిందని , విద్యార్థులకు అనేక హక్కులను సాధించి పెట్టిందని అన్నారు. దోపిడి, పీడన లేని సమాజం కోసం పేద ధనిక తేడాలేని సమానమైన విద్య కోసం ఉద్యమిస్తుందని ఈ క్రమంలో ఎంతోమంది విద్యార్థులు తాము నమ్మిన సిద్ధాంతం కొరకు అమరత్వం చెందారని గుర్తు చేశారు. వారి ఆశయ సాధన కొరకు విద్యార్థులంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం సంక్షోభంలో కూరుకుపోయిందని పాలకులు విద్యను హక్కుగా ఇచ్చే స్థితి నుండి క్రమంగా తప్పుకుంటున్నారని ఆరోపించారు. స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ , మెస్ బకాయిలు, కాస్మోటిక్ చార్జీలు, గురుకులాల భవనాల అద్దె ఇలాంటి అనేక విషయాలు చెల్లించకుండా తీవ్రమైన అలసత్వం వహిస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ మాట్లాడుతూ పాలకులు విద్యను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని సరైన నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. సమాజం ఉన్నతీకరించబడాలంటే విద్య ద్వారానే సాధ్యపడుతుందని అలాంటి విద్య పట్ల అశ్రద్ధ వహించడం సరికాదన్నారు. విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ పెరిగిందని, భాజాప ప్రభుత్వం సిలబస్ ను మార్చి నూతన విద్య విధానం తీసుకువచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇది ఏ మాత్రం సమాజం పురోగతికి తోడ్పడదని తెలిపారు. విద్యార్థులు విద్యారంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అర్థం చేసుకొని అందుకు అనుగుణమైన కార్యాచరణ ప్రకటించుకోవాలన్నారు. ఈ మహాసభలు అందుకు తోడ్పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ సీనియర్ నాయకులు పంబాల ఎల్లయ్య మరియు పీ.డీ.ఎస్.యు జిల్లా నాయకులు ప్రణయ్ కుమార్, గౌతమ్, రాహుల్ మరియు వివిధ మండలాల నుండి వచ్చిన విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.




# బిజినెస్



## ఏఐని గుడ్డిగా నమ్మకండి.. సుందర్ పిచాయ్ షాకింగ్ కామెంట్స్



ఏఐని గుడ్డిగా నమ్మవద్దని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా సేకరించే సమాచారం గుడ్డిగా నమ్మవద్దన్నారు.కృత్రిమ మేధ మోడల్స్ లో పొరపాట్లు జరుతున్నాయని చెప్పారు. సమాచార స్పష్టత కోసం మాత్రమే ఏఐతో పాటు ఇతర విధానాలను కూడా సరిచూసుకోవాలని సూచించారు. ఖచ్చితమైన సమాచారం ఇచ్చేందుకు ఉన్న ఇతర వ్యవస్థలను కూడా వినియోగించుకోవాలని చెప్పారు. ఏదైనా సృజనాత్మకంగా రాయాలని భావిస్తే అప్పుడే ఏఐ టూల్స్ ను సక్రమంగా వినించే రీతిలో ఉండాలన్నారు. కచ్చితమైన సమాచారం ఇచ్చేందుకు చాలా వర్క్ చేస్తున్నామని దీనిపట్ల గర్వంగా ఉందని అన్నారు. గూగుల్ ఏఐ తాజా మెడల్ జెమిని 3.0 కోసం టెక్ ప్రపంచం ఎదురుచూస్తున్నదని తెలిపారు. అంతే కాకుండా ఏఐ అనే బుడగ పగిలిపోతే అన్ని కంపెనీలపై ప్రభావం పడుతుందని అన్నారు. దానికి గూగుల్ కూడా అతీతం కాదని స్పష్టం చేశారు. చాట్ జీపీటీ, ఓపెన్ ఏఐతో పోటీ ఉన్న నేపథ్యంలో ఆల్ఫాబెట్‌కు పెట్టుబడులు రెట్టింపు అయ్యాయన్నారు. ఏఐకి చెందిన సూపర్ చిప్స్‌ను ఆల్ఫా సంస్థ డెవలప్ చేస్తుందని తెలిపారు.

## మరింత ఆలస్యం కానున్న అన్ని బైకుల్లో ఏబీఎస్



అన్ని ద్విచక్ర వాహనాల్లో జనవరి 1 నుంచి యాంటీ–లాక్ బ్రేకింగ్ సిస్టమ్స్ (ఏబీఎస్) తప్పనిసరి చేయ దానికి ఉద్దేశించిన గడువును కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసే అవకాశం ఉంది. ప్రధాన ద్విచక్ర వాహన తయారీ కంపెనీలతో జరిగిన అనేక రౌండ్ల చర్చల తర్వాత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఏబీఎస్ అమలుకు మరింత సమయం కావాలని కంపెనీలు కోరాయి. ఈ ఏడాది జూన్‌లో ఏబీఎస్ తప్పనిసరి నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. కానీ, ఇంత తక్కువ సమయంలో అవసరమైన మార్పులు చేయడం, విడిభాగాల లభ్యత వంటి సమస్యల గురించి కంపెనీలు ప్రభుత్వానికి వివరించాయి. దీనికోసం కనీసం ఏడాది సమయం కావాలని అభ్యర్థించాయి. ప్రస్తుతం 125సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న ద్విచక్ర వాహనాలకు మాత్రమే ఏబీఎస్ తప్పనిసరి నిబంధన ఉంది. అయితే, 125సీసీ కంటే తక్కువ సామర్థ్యం ఉన్న వాటికి కంబైన్డ్ బ్రేకింగ్ సిస్టమ్ (సీబీఎస్) ఉంది. సాధారణంగా 125సీసీ కంటే తక్కువ సామర్థ్యం ఉన్న టూవీలర్ల ధరలు తక్కువగా ఉంటాయి. ఏబీఎస్ తప్పనిసరి అనే నిబంధన కారణంగా ధరలు గణనీయంగా పెరుగుతాయి. దీనివల్ల ఈ విభాగంలో డిమాండ్ ప్రభావితం అవుతుందని కంపెనీలు అభిప్రాయం వ్యక్తం చేశాయి. ఈ కమ్యూటర్ మోడళ్లపై ఏబీఎస్ అమర్చడం వల్ల ధరల పెరుగుదల వేల రూపాయల్లోనే పెరగవచ్చని అంచనా.

## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు




ఆరు రోజుల పాటు లాభాల్లో దూసుకెళ్లిన దేశీయ స్టాక్ మార్కెట్లకు బ్రేక్‌పడింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 277.93 పాయింట్లు నష్టపోయి 84,673.02 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 103.40 పాయింట్లు కోల్పోయి 25,910.05 వద్ద ముగిసింది.ఉదయం సెషన్ ఫ్లాట్‌గా ప్రారంభమైనప్పటికీ, కొద్దిసేపటికే అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మార్కెట్లు నెగెటివ్ జోన్‌లోకి జారుకున్నాయి. ఇటీవల మార్కెట్లు పుంజుకోవడంతో ఇన్వెస్టర్లు లాభాలను స్వీకరించారని, దీనికి బలహీన అంతర్జాతీయ సంకేతాలు తోడయ్యాయని విశ్లేషకులు తెలిపారు. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను డిసెంబర్‌లో తగ్గిస్తుందన్న అంచనాలు తగ్గడం, డాలర్ బలపడటం వంటి కారణాలతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో ఐటీ, మెటల్, రియల్టీ షేర్లు నష్టపోయాయి. అయితే, ప్రైవేట్ బ్యాంకులు కొంతమేర మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి.ఈ వారం వెలువడనున్న అమెరికా ఉద్యోగ గణాంకాల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు. ఫెడ్ పాలసీ నిర్ణయాలపై ఈ డేటా ప్రభావం చూపనుంది. భవిష్యత్తులో ఇండో–యూఎస్ వాణిజ్య ఒప్పందంలో పురోగతి, దేశీయ కంపెనీల ఆర్థిక ఫలితాలు మార్కెట్లకు మద్దతునిస్తాయని నిపుణులు భావిస్తున్నారు. ఈరోజు ట్రేడింగ్‌లో దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ సూచీ అత్యధికంగా 1.10 శాతం పతనం కాగా, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, ఎఫ్‌ఎంసీజీ రంగాలు కూడా నష్టాలను చవిచూశాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోగా, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక శాతం మేర నష్టపోయాయి.

## ఫెడ్ ప్రకటనతో భారీగా తగ్గిన బంగారం..

భారతీయులకు బంగారం అంటే చాలా ఇష్టం. ఏడాది పొడవునా కొనుగోళ్లు జరుగుతూనే ఉంటాయి. చాలా దేశాల వద్ద ఉన్న బంగారం కన్నా మన దేశంలోని మహిళల వద్ద ఉన్న బంగారమే ఎక్కువట.అంతలా మన దేశంలో బంగారం వినియోగం అవుతోంది. అయితే, ఈ ఏడాది 2025లో పసిడి ధరలు విపరీతంగా పెరిగిన సంగతి తెలిసిందే. స్వచ్ఛమైన తులం బంగారం రేటు రూ.1.25 లక్షలు పైన కొనసాగుతోంది. అయితే, ఈరోజు భారీగానే తగ్గింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఒక్క ప్రకటన బంగారం ధరలను తగ్గించింది. గతంలో కంటే భారీగానే తగ్గింది. తులం రేటు రూ.1700 వరకు దిగివచ్చింది. అమెరికాలో నిరుద్యోగిత రేటు పెరిగే అవకాశం ఉండడంతో ద్రవ్యోల్బణం తారుమారు కాచ్చనే అంచనాలు ఉన్నాయని, అందుకే వడ్డీ రేట్ల తగ్గింపుపై ఆచితూచి వ్యవహరించాల్సి వస్తుంది ఫెడ్ వైస్ ఛైర్మన్ ఫిలిప్ జెఫెర్సన్ వెల్లడించారు. వడ్డీ రేట్లు తగ్గింపు ఉండకపోవచ్చని సంకేతాలు ఇచ్చారు. దీంతో బంగారం ధరలు ఒక్కసారిగా దిగివచ్చాయి. ఈ క్రమంలో గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ రేటు 4000 డాలర్ల దిగువ స్థాయికి చేరింది. ఆ ప్రభావం దేశీయంగా స్పష్టం కనిపించింది. తనిష్క్ జవెలరీలో ఈరోజు 22 క్యారెట్ల ఆభరణాల బంగారం రేటు 1 గ్రాముకు దాదాపు రూ. 160 మేర తగ్గింది. దీంతో గ్రాము ధర రూ. 11,375 వద్దకు దిగివచ్చింది. అదే 10 గ్రాములు (తులం) అయితే రూ. 1,13,750 వద్దకు తగ్గింది. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జువెలరీ సంస్థలో ఈరోజు 22 క్యారెట్ల నగల తయారీ



బంగారం రేటు 1 గ్రాముకు రూ.165 మేర తగ్గింది. దీంతో గ్రాము ధర రూ.11,335 వద్దకు దిగివచ్చింది. అలాగే తులం రేటు రూ. 1,13,350 వద్దకు దిగివచ్చింది. జొయాలుక్కాస్ జువెలరీ సంస్థలో ఈరోజు 22 క్యారెట్ల ఆభరణాల బంగారం రేటు 1 గ్రాముకు రూ. 11,335 ఉండగా తులానికి రూ. 1,13,350 వద్ద ట్రేడవుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ జువెలరీ సంస్థ లలితా జువెలరీలో ఈరోజు 22 క్యారెట్ల బంగారం రేటు 1 గ్రాముకు రూ. 11,335 వద్దకు దిగివచ్చింది. ఇక తులం (10 గ్రాముల) రేటు రూ. 1,13,350 వద్ద అమ్ముడవుతోంది.

## వాణిజ్య ఒప్పందంపై మంచి వార్త

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం న్యాయంగా, సమానంగా, సమతౌల్యంగా ఉంటే 'మీరు ఒక మంచి వార్త వింటార'ని వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ పేర్కొన్నారు. మన రైతులు, మత్స్యకారుల ప్రయోజనాలను ప్రభుత్వం పరిరక్షిస్తుందనీ స్పష్టం చేశారు. వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయని మంగళవారమిక్కడ జరిగిన 'ఇండో–యూఎస్ ఎకనమిక్ సమిట్'లో గోయల్ తెలిపారు. 'భారత్ తన ప్రజలు, వ్యాపారాల ప్రయోజనాలను రక్షించుకోవాలి. రైతులు, మత్స్యకారులు, చిన్న పరిశ్రమలకు ఇబ్బంది రాకుండా చూసుకోవాలి. ఈ విషయంలో సరైన పరిష్కారం లభించినపుడే, అది న్యాయమైన, సమానత్వ, సమతౌల్య ఒప్పందం అవుతుంద'ని మంత్రి వివరించారు. 'ఒక్కోసారి కుటుంబంలో కూడా గొడవలు వస్తుంటాయి. కాబట్టి ఇరు దేశాల మధ్య ఒప్పం దం విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేద'ని అన్నారు. అమెరికాతో ఎల్‌పీజీ దిగుమతి ఒప్పందం ఏళ్లపాటు ఉండొచ్చని సంకేతాలిచ్చారు. భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలోనే జరుగుతుందని ట్రంప్ ప్రభుత్వాధికారి ఒకరు పేర్కొన్నారు. 'అవును. ఒప్పందానికి చాలా దగ్గరలో ఉన్నాం' అని నేషనల్ ఎకనమిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హాసెట్ పేర్కొన్నారు. 'రష్యాతో భారత సంబంధాల వల్ల సంక్లిష్ట పరిస్థితి అయితే వచ్చింది. అయినప్పటికీ మేం ఆశాభావంతోనే ఉన్నాం. ఎందుకంటే భారత్–అమెరికా మంచి స్నేహితులు. త్వరలోనే ఒప్పందం జరగొచ్చ'ని అన్నారు.



## గిల్ స్థానంలో సిఎస్‌కె విధ్వంకర బ్యాటర్..!

గిల్ బాధపడుతున్నాడు. మొదటి టెస్ట్ సందర్భంగా బ్యాటింగ్ మధ్యలోనే రిటైర్డ్ ఔట్ అయి, వెళ్లిపోయిన గిల్, రెండో టెస్ట్ కు పూర్తిగా దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. మరో వారం రోజులపాటు గిల్ రెస్ట్ తీసుకోవాలని వైద్యులు స్పష్టం చేశారట. అంటే ఈ లెక్కన నవంబర్ 22వ తేదీన ప్రారంభం కానున్న రెండో టెస్టుకు గిల్ దూరమవుతాడు. అయితే గిల్ దూరమైతే, అతని స్థానంలో సాయి సుదర్శన్, పడిక్కల్ లలో ఒకరిని తీసుకుంటారని చర్చ జరుగుతోంది. ఇలాంటి నేపథ్యంలో టీమిండియా యాజమాన్యానికి మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా కీలక సూచనలు చేశారు. సాయి సుదర్శన్, పడిక్కల్ కంటే రుతురాజ్ గైక్వాడ్ ను గిల్ స్థానంలో ఎంపిక చేయాలని వెల్లడించారు. దేశవాళి క్రికెట్ లో అద్భుతంగా రుతురాజ్ గైక్వాడ్ రాణిస్తున్నాడు, ప్రస్తుతం పరిస్థితుల్లో అతని సేవలు టీమిండియాకు అవసరం అన్నారు. అందుకే గిల్ స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ కరెక్ట్ అంటూ ఆకాష్ చోప్రా స్పష్టం చేశారు. సాయి సుదర్శన్, పడిక్కల్ లలో ఎవరు ఆడినా, ప్రయోజనం ఉండబోదని సూచనలు చేశారు.




### మూడు మ్యాచ్‌లలో సమరన్ రవిచంద్రన్ రెండు డబుల్ సెంచరీలు

కర్ణాటక యువ బ్యాటర్ సమరన్ రవిచంద్రన్ రంజీ ట్రోఫీలో మరొకసారి తన ప్రతిభను చాటుకున్నాడు. హుబ్లీలో ఛండీగఢ్‌పై జరుగుతున్న మ్యాచ్‌లో 362 బంతుల్లో 227 పరుగులతో నాటౌట్‌గా నిలవడమే కాకుండా, కర్ణాటకకు భారీ స్కోర్ అందించాడు. ఇది సమరన్ కెరీర్‌లో మూడో ఫస్ట్‌క్లాస్ డబుల్ సెంచరీ కాగా, ఈ సీజన్‌లో మూడు మ్యాచ్‌లలో సాధించిన రెండో డబుల్ టన్ కావడం విశేషం. ఛండీగఢ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో బ్యాటింగ్ మొదలుపెట్టిన కర్ణాటక 13/2, తర్వాత 64/3కి కుంగిపోయింది. ఈ సమయంలో కరుణ్ నాయర్–సమరన్ జోడీ కీలకమైన 119 పరుగుల భాగస్వామ్యం అందించింది. కరుణ్ నాయర్ 164 బంతుల్లో 95 పరుగులతో పెవిలియన్ చేరినా, సమరన్ మాత్రం అద్భుతంగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ (62), శిఖర్ శెట్టి (59) కూడా తోడవ్వడంతో.. చివరకు కర్ణాటక 547/8 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఈ రంజీ సీజన్‌లో సమరన్ కేరళపై 220 నాటౌట్, మహారాష్ట్రపై 54 తర్వాత ఈ మ్యాచ్‌లో 227 నాటౌట్‌గా నిలిచి ప్రస్తుత రంజీ సీజన్‌లో నాలుగో స్థానానికి చేరాడు. ఇప్పటివరకు 595 పరుగులు సాధించిన సమరన్ సగటు 119 ఉండటం విశేషం. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన సమరన్ కర్ణాటక తరఫున అండర్–14 స్థాయి నుంచే ఆడుతున్నాడు. రాష్ట్రంలోని మహారాజా టీ20 ట్రోఫీలో గుల్బర్గా మిస్టిక్స్, శివమొగ్గ స్ట్రైకర్స్ తరఫున కూడా మెరిశాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఇప్పటి వరకు కేవలం 13 మ్యాచ్‌లలో 1179 పరుగులు చేశాడు, అందులో నాలుగు సెంచరీలు, మూడు డబుల్ సెంచరీలు ఉన్నాయి. లిస్టు–ఏ క్రికెట్‌లో కూడా సమరన్ అద్భుతం. 2024–25 విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక తరఫున 433 పరుగులు చేశాడు.




### గిల్ స్థానంలో అతనికి కెప్టెన్సీ ఇవ్వండి.. మహ్మద్ కైఫ్ సంచలనం !

టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గిల్ స్థానంలో వన్డే కెప్టెన్సీ తాత్కాలికంగా కే ఎల్ రాహుల్ కు ఇవ్వాలని డిమాండ్ చేశారు మహ్మద్ కైఫ్. గాయం కారణంగా గిల్ తప్పుకున్నాడు కాబట్టి, కే ఎల్ రాహుల్ కు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. రోహిత్ శర్మకు తిరిగి కెప్టెన్సీ ఎలాగో ఇవ్వరు, కాబట్టి దక్షిణాఫ్రికా వర్సెస్ భారత్ మధ్య జరగబోయే వన్డే సిరీస్ కోసం కేఎల్ రాహుల్ కు కెప్టెన్సీ ఇవ్వాలని రిక్వెస్ట్ చేశారు. టీమిండియాను లీడ్ చేయగల సత్తా కేఎల్ రాహుల్ కు ఉందని, గతంలో కూడా అతడు జట్టును నడిపించాడని గుర్తు చేశారు. దీంతో మహ్మద్ కైఫ్ వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. ఇది ఇలా ఉండగా భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మొదటి టెస్ట్ సందర్భంగా మెడనొప్పి బారిన పడ్డాడు ప్రిన్స్ గిల్.



## నా దృష్టిలో అది తప్పే కాదు భువనేశ్వర్ కుమార్



కోల్‌కతా పిచ్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్న వేళ టీమ్ ఇండియా పేసర్ భువనేశ్వర్ కుమార్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. భారత్‌లో స్పిన్ పిచ్‌లు ఇప్పుడే కొత్తగా తయారుచేయడం లేదని, కొన్ని దశాబ్దాలుగా ఇదే కొనసాగుతోందని అన్నాడు. మరి అప్పుడు ఎవరూ ఎందుకు ప్రశ్నించలేదని భువీ పేర్కొన్నాడు. 'భారత్‌లో స్పిన్ పిచ్‌లు సిద్ధం చేయడం ఇదే మొదటిసారి కాదు. టీమ్‌ఇండియా గెలుస్తున్నంత కాలం ఎవరూ ఈ ప్రశ్నను అడగలేదు. నిజానికి గెలుపోటములు ఆటలో భాగం. ఇంతకుముందు భారత జట్టు ఎప్పుడూ ఓడిపోకుండా లేదు.. అలాగే ఇదే మొదటి ఓటమి కూడా కాదు. నా దృష్టిలో ఈ ఓటమితో అంతగా చింతించాల్సిన అవసరమైతే లేదు' అని భువనేశ్వర్ కుమార్ తన వాదనను వినిపించాడు. నలుగురు స్పిన్నర్లను ఆడించడంపై కూడా అతడు స్పందించాడు. 'పిచ్ స్పిన్‌కు అనుకూలంగా తయారైనప్పుడు నలుగురు స్పిన్నర్లను (అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్) ఆడించడంలో తప్పు లేదు. అది టర్నింగ్ ట్రాక్. మ్యాచ్ జరిగిన విధానాన్ని బట్టి చూస్తే టీమ్‌ఇండియా నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగడంలో తప్పేమీ లేదు' అని భువీ పేర్కొన్నాడు. 'శుభ్‌మన్ గిల్ ఈ మధ్యే కెప్టెన్ అయ్యాడు. అతడికి కాస్త విశ్రాంతి కూడా అవసరం. మానసికంగా, శారీరకంగానూ అతడు కొంచెం రెస్ట్ తీసుకోవాలి. త్వరలోనే ఐపీఎల్ సీజన్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీ వల్ల గత 10 సంవత్సరాల్లో టీమ్‌ఇండియా బౌలింగ్ విభాగంలో చాలా మెరుగైంది. ఐపీఎల్‌లో ఆడిన అనుభవం బౌలర్లకు ఎంతో ఉపయోగపడుతోంది. అలాగే ఇండియన్ ప్రీమియర్ లీగ్ వల్ల భారత జట్టుకు కొత్త బౌలర్లు దొరుకుతారు' అని భువనేశ్వర్ కుమార్ విశ్లేషించాడు.

## టీమిండియా టెస్టు ఓటమిపై స్పందించిన హర్భజన్ సింగ్



దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో టీమిండియా ఓటమి పాలవడంపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక 93 పరుగులకే కుప్పకూలడంపై ఆయన ఘాటుగా స్పందించారు. ఇలాంటి ర్యాంక్ టర్నర్లను తయారు చేస్తూ టెస్ట్ క్రికెట్‌ను పూర్తిగా నాశనం చేస్తున్నారని టీమ్ మేనేజ్‌మెంట్‌పై మండిపడ్డారు.ఈ ఓటమి అనంతరం తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన హర్భజన్.. ''టెస్ట్ క్రికెట్‌కు రిప్ (రెస్ట్ ఇన్ పీస్). వారు ఈ ఫార్మాట్‌ను పూర్తిగా నాశనం చేశారు. కొన్నేళ్లుగా ఇలాంటి పిచ్‌లు తయారు చేస్తున్నారు. జట్టు గెలుస్తోంది కాబట్టి ఎవరూ దీని గురించి మాట్లాడటం లేదు. కానీ ఇది సరైన పద్ధతి కాదు'' అని ఆరోపించారు. 0ఇలాంటి పిచ్‌లపై ఆడటం వల్ల ఆటగాళ్లు ఏమాత్రం ఎదగరని భజ్జీ అభిప్రాయపడ్డాడు. ''మీరు గానుగెద్దులా ఒకేచోట తిరుగుతున్నారే తప్ప ముందుకు వెళ్లడం లేదు. బ్యాటర్లకు పరుగులు ఎలా చేయాలో కూడా తెలియని విధంగా పిచ్‌లను తయారు చేస్తున్నారు. నైపుణ్యంతో కాకుండా పిచ్ వల్లే వికెట్లు పడుతుంటే, సమర్థుడైన బౌలర్‌కు, బ్యాటర్‌కు తేడా ఏముంటుంది?'' అని ఆయన ప్రశ్నించారు.

# చక్కని ఆరోగ్యం

## శీతాకాలంలో మడమలకు పగుళ్లు వస్తున్నాయా?

మడమలు పగలడానికి కారణం ఏమిటి?
అనేక కారణాల వల్ల మడమలు పగుళ్లు వస్తాయని నిపుణులు అంటున్నారు. దీనికి ప్రధాన కారణం వాతావరణం పొడిగా ఉండటం, తేమ లేక పోవడం. శీతాకాలం మొదలైన వెంటనే కొంతమంది మడమలు పగలడం మొదలవుతాయి.

ఇది చాలా సాధారణ సమస్య. కానీ దీనికి సకాలంలో చికిత్స చేయకపోతే పగిలిన మడమలలో చీము ఏర్పడుతుంది. దీనివల్ల నొప్పి, రక్తస్రావం, నడకలో సమస్యలు వస్తాయి. కొందరి మడమలు చాలా మృదువుగా, శుభ్రంగా ఉంటాయి. కానీ శీతాకాలం రాకముందే అవి పగుళ్లు ప్రారంభిస్తాయి. మడమలు పగలడానికి కారణం ఏమిటి? అనేక కారణాల వల్ల మడమలు పగుళ్లు వస్తాయని నిపుణులు అంటున్నారు. 1. పొడి వాతావరణం: శీతాకాలంలో చాలా పొడిగా ఉంటుంది. ఈ సమయంలో గాలిలో తేమ లేకపోవడం చర్మం, మడమలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది చర్మం సహజ తేమ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఫలితంగా చర్మం పొడిబారడం, మడమలు పగుళ్లు ఏర్పడతాయి. ఇంకా పాదాల చర్మంలో తక్కువ నూనె గ్రంథులు ఉంటాయి. దీని వలన ఇది సహజంగా పొడిగా మారుతుంది. శీతాకాలంలో ఈ నూనె గ్రంథులు, తక్కువగా మారతాయి. దీని వలన మడమలు పగుళ్లు ఏర్పడతాయి.2. మడమల మీద ఒత్తిడి: అధిక బరువు పాదాలు, చీలమండలపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. దీనివల్ల మడమల కింద ఉన్న కొవ్వు ప్యాడ్లు విస్తరించి చర్మం చిరిగిపోయి పగుళ్లు ఏర్పడతాయి. ఎక్కువసేపు నిలబడి ఉండే వ్యక్తులకు పెరిగిన ఒత్తిడి, ఘర్షణ కారణంగా మడమలు పగుళ్లు ఏర్పడవచ్చు.3. వృద్ధాప్యం: వయసు పెరిగే కొద్దీ చర్మం దాని స్థితిస్థాపకతను కోల్పోతుంది. సహజ నూనెల ఉత్పత్తి తగ్గుతుంది. దీనివల్ల చర్మం పొడిబారి, పగుళ్లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.4. చర్మ సమస్యలు: సోరియాసిస్, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, తామర వంటి చర్మ పరిస్థితుల వల్ల కూడా మడమలు పగుళ్లు ఏర్పడతాయి. ఈ చర్మ పరిస్థితులు పొడిబారి, పగుళ్లు ఏర్పడటానికి కారణమవుతాయి. డయాబెటిస్, థైరాయిడ్ పరిస్థితులు కూడా మడమలు పగుళ్లకు కారణమవుతాయి.5. సరికాని పాదరక్షలు ధరించడం: శీతాకాలంలో మీరు మంచి నాణ్యత గల క్లోజ్డ్ బూట్లు లేదా చెప్పులు ధరించకపోతే, మీ మడమలు నిరంతరం చల్లని, పొడి వాతావరణానికి గురవుతాయి. దీని వలన అరికాళ్ళు ఎండిపోయి పగుళ్లు ఏర్పడతాయి. కొన్నిసార్లు సరిగ్గా సరిపోని బూట్లు ధరించడం వల్ల కూడా మడమలు పగుళ్లు ఏర్పడవచ్చు.6. శీతాకాలంలో తక్కువ నీరు తాగడం: శీతాకాలంలో చాలా మంది చాలా తక్కువ నీరు తాగుతారు. కానీ దీనివల్ల శరీరంలో తేమ లోపిస్తుంది. చర్మం పొడిగా మారుతుంది.7. రసాయన ఉత్పత్తులను అధికంగా వాడటం: కొంతమంది చేతి సబ్బులు, లోషన్లు, క్రీములు వాడతారు. ఇవి చర్మం సహజ నూనెలను తగ్గిస్తాయి. ఇది పొడిబారడానికి దారితీస్తుంది. సోమరితనం కారణంగా ప్రజలు తక్కువ తరచుగా స్నానం చేస్తారు.



# రక్తంలో షుగర్‌తో పాటు కొలెస్ట్రాల్ తగ్గించే మెంతులు

ఈ రోజుల్లో ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా డయాబెటిస్, కొలెస్ట్రాల్, అధిక బరువు సమస్యలు ఎక్కువైపోయాయి. ప్రపంచవ్యాప్తంగా మధుమేహం చాలా ప్రమాదకరమైన వ్యాధిగా మారుతోంది. చక్కెర స్థాయిలు అధిక స్థాయికి చేరుకున్న తర్వాత, దానిని నియంత్రించడం చాలా కష్టం అవుతుంది. అలాగే, కొలెస్ట్రాల్ సమస్య కూడా రోజు రోజుకి పెరిగిపోతుంది. కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. అందుకే కొలెస్ట్రాల్‌తో పాటు డయాబెటిస్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవాలి. మన వంటగదిలో దొరికే మెంతులతో రక్తంలో షుగర్ లెవల్స్‌తో పాటు కొలెస్ట్రాల్ తగ్గించుకోవచ్చని న్యూట్రిషనిస్ట్ రేణు రేఖాజా వివరించారు. ఈ విషయాన్ని తన ఇన్‌స్టా అకౌంట్‌లో షేర్ చేశారు. ఆరోగ్యానికి మేలు చేసే మెంతుల్ని నీరు లేదా టీ రూపంలో తీసుకోవచ్చని ఆమె తెలిపారు. మెంతుల నీరు లేదా టీ తాగడం వల్ల అధిక బరువును తగ్గించుకోవచ్చని న్యూట్రిషనిస్ట్ చెబుతున్నారు. మెంతుల్లో గెలాక్టోమన్నన్ కంటెంట్ ఉంటుంది. ఇది మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. మెంతుల నీరు లేదా టీ తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు తీసుకోవడం తగ్గుతుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. శరీరంలో పేరుకుపోయిన కొవ్వును బర్న్ చేయడానికి సాయపడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో మెంతుల నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు చాలా మేలు జరుగుతుంది. ఇది కడుపును శుభ్రపరుస్తుంది. జీర్ణ ఎంజైమ్‌లను సక్రియం చేస్తుంది. మెంతుల్లోని ఫైబర్ మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. పేగు మంటను



తగ్గించడంలో సాయపడుతుంది. క్రమం తప్పకుండా మెంతుల నీరు తాగడం వల్ల అసిడిటీ, అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మెంతులు రక్తంలో పెరిగిన షుగర్ లెవల్స్ నియంత్రించడంలో ప్రభావవంతంగా ఉంటాయి. మెంతుల్లో ఉండే అమైనో ఆమ్లాలు క్లోమాన్ని సక్రియం చేస్తాయి. దీంతో ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతాయి. మెంతుల్లో ఉండే కరిగే ఫైబర్ కార్బోహైడ్రేట్లు శోషణను నెమ్మదిస్తుంది. రక్తంలో చక్కెర స్థిరత్వాన్ని కాపాడుతుంది. మెంతుల నీరు లేదా టీ క్రమం తప్పకుండా తాగడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. మెంతుల్లోని సాపోనిన్లు, ఫైబర్ కొలెస్ట్రాల్ శోషణను నిరోధిస్తాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా ధమనుల్లో ఫలకం ఏర్పడకుండా నిరోధిస్తుంది. మెంతుల టీ లేదా యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. ఇవి చర్మపు మంట, మొటిమలు, ముడతల్ని తగ్గిస్తాయి. ఇది టాక్సిన్స్‌ను బయటకు పంపడంలో సాయపడుతుంది. చర్మాన్ని స్పష్టంగా, ప్రకాశవంతంగా ఉంచుతుంది. మెంతుల్లోని ప్రోటీన్లు, నికోటినిక్ ఆమ్లం జుట్టు రాలడాన్ని తగ్గించడంలో సాయపడతాయి. అందుకే మెంతి టీ రోజూ తాగాలని చెబుతున్నారు. మెంతులు శరీరంలో మంటను తగ్గించడంలో సాయపడే శక్తివంతమైన శోథ నిరోధక లక్షణాల్ని కలిగి ఉంటాయి . ఇది ముఖ్యంగా ఆర్థరైటిస్, కీళ్ల నొప్పులు, కండరాల దృఢత్వం వంటి పరిస్థితులకు ప్రయోజనకరంగా ఉంటుంది. రోజూ తాగితే.. వీటి నుంచి ఉపశమనం లభిస్తుందని డాక్టర్ చెబుతున్నారు. ఒక టీ స్పూన్ మెంతుల్ని కప్పు నీటిలో రాత్రంతా నానబెట్టండి. ఈ నీటిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో అలానే తాగవచ్చు.

# జనపనార గింజలతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు

కరోనా అనంతరం ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన, శ్రద్ధ ఎక్కువైంది. ఇందులో భాగంగా ప్రజలు తమ ఆహారం లోపలు రకాల ధన్యాలు, విత్తనాలు తీసుకుంటున్నారు. ఇందులో చియా, పొద్దుతిరుగుడు, గుమ్మడి, అవిసెతో పాటు జనపనార గింజలు కూడా వాడుతున్నారు. జనపనార గింజలు చాలా పోషకమైనవి. జనపనార గింజల్లో ఒమేగా-3, ఒమేగా-6, జిఎల్ఎ, ప్రోటీన్, మెగ్నీషియం, జింక్, ఐరన్ వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉన్నాయి. గుండె



ఆరోగ్యం, కొలెస్ట్రాల్ నియంత్రణ, జీర్ణక్రియ, చర్మం-జుట్టు సంరక్షణకు ఇవి సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. రోజుకు 1-2 టీస్పూన్లు ఆహారంలో తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జనపనార విత్తనాలలో రెండు ముఖ్యమైన కొవ్వు ఆమ్లాలు, ఒమేగా 3 యాసిడ్స్, ఆల్ఫా-లినోలెనిక్ యాసిడ్‌లతో సమృద్ధిగా ఉంటాయి. జనపనార గింజల్లో నైట్రిక్ ఆక్సైడ్ వుంటుంది. ఇది రక్త నాళాలు విస్తరిస్తుండటం వల్ల రక్తపోటు తగ్గడానికి, గుండె జబ్బుల ప్రమాదాన్ని నిరోధిస్తుంది. జనపనార గింజలు, జనపనార నూనె చర్మ రుగ్మతల నుండి కాపాడుతాయి. జనపనార విత్తనాలు మొక్కల ఆధారిత ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. జనపనార విత్తనాలు మహిళల్లో మెనోపాజ్ దశను త్వరగా రాకుండా చేస్తాయి. జనపనార విత్తనాలు జీర్ణక్రియకు సహాయపడతాయి. ఇవి బరువు తగ్గటానికి కూడా దోహదపడతాయి.

# వేడి నీరు అమృతం కాదు విషం!

శీతాకాలంలో చలి వాతావరణం కారణంగా దాహం తగ్గి, పని ఒత్తిడి లేదా సోమరితనం వల్ల మనం తక్కువ నీరు తాగుతుంటాము. అయితే, వేసవిలో మాదిరిగానే చలికాలంలో కూడా శరీరానికి సరైన హైడ్రేషన్ అవసరం.అందుకే చాలా మంది గోరువెచ్చని లేదా వేడి నీరు తాగాలని సూచిస్తుంటారు. శీతాకాలంలో శరీర జీవక్రియ (మెటబాలిజం) నెమ్మదిస్తుంది, చల్లటి నీరు తాగితే శరీరం మరింత చల్లబడి, దానిని వెచ్చగా ఉంచడానికి ఎక్కువ శక్తి అవసరం అవుతుంది. అందుకే, గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరం నిర్విషీకరణ మెరుగుపడి, రక్త ప్రసరణ బలపడుతుంది, జీర్ణక్రియ మెరుగై, జలుబు, గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్యవంతుడైన వ్యక్తి రోజుకు 2.5 నుండి 3 లీటర్ల (సుమారు 8 నుండి 10 గ్లాసులు) నీరు గోరువెచ్చగా తాగవచ్చని నిపుణులు చెబుతున్నారు.



అయితే, ఈ నీటిని ఒకేసారి ఎక్కువ మొత్తంలో కాకుండా, రోజంతా తక్కువ మొత్తంలో తాగుతూ ఉండాలి. ముఖ్యంగా ఉదయం నిద్ర లేవగానే, భోజనం మధ్యలో మరియు నిద్రపోయే 30 నిమిషాల ముందు ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగడం మంచిది. అయితే, రోజంతా మరీ వేడిగా ఉండే నీటిని తాగడం సరైన పద్ధతి కాదు. నీరు చాలా వేడిగా ఉంటే, అది అంతర్గత శరీర కణజాలలను దెబ్బతీసి, గొంతు లేదా కడుపు లైనింగ్‌ను కాల్చే ప్రమాదం ఉంది. అందుకే, నీటిని మరిగే కంటే గోరువెచ్చగా తాగడమే శ్రేయస్కరం.

# గుమ్మడికాయ వల్ల కలిగే ఈ లాభాలు..!

అన్ని పండ్లు, కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కానీ, గుమ్మడికాయ విషయానికి వస్తే దీనిని ఆరోగ్యనిధిగా పరిగణిస్తారు. ఆయుర్వేదం కూడా గుమ్మడికాయను ఔషధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తుంది. ఇందులో విటమిన్లు ఎ, ఇ, సి, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, మెగ్నీషియం, జింక్, సెలీనియం, ఐరన్, బీటా-కెరోటిన్ వంటి అనేక పోషకాలు ఉన్నాయి. గుమ్మడికాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది. గుమ్మడికాయ రక్తంలో చక్కెర స్థాయిలను సాధారణ స్థాయిలో నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది. దాని లక్షణాల కారణంగా, ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.విటమిన్ ఎ మన కళ్ళు, చర్మానికి చాలా అవసరం. అలాంటి విటమిన్ ఎ



గుమ్మడి కాయలో సమృద్ధిగా ఉంటుంది. గుమ్మడి కాయలోని విటమిన్ సి మన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. గుమ్మడికాయ రసం బరువు తగ్గడంలో కూడా చాలా సహాయపడుతుంది.గుమ్మడి గింజల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది సెరటోనిన్ అనే రసాయనం ఉత్పత్తి కావటానికి తోడ్పడుతుంది. సెరటోనిన్ మానసిక ప్రశాంత భావనను కలిగించటంలోనే కాదు..మంచి నాణ్యమైన నిద్ర పట్టేలా చేస్తుంది.గుమ్మడి కాయలోని బీటా కెరొటిన్‌తో పాటు విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, ఫోలేట్ కూడా ఎక్కువగా ఉంటుంది. ఇవన్నీ రోగనిరోధకశక్తిని బలోపేతం చేసేవి. అందుకే తరచూ గుమ్మడి కాయను ఆహారంలో భాగంగా తీసుకోవటం వల్ల ఇన్‌ఫెక్షన్ల బారినపడకుండా కాపాడుతుంది. గుమ్మడికాయలోని అనేక పోషకాలు శరీరంలో మంటను తగ్గిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో గుమ్మడికాయలోని విటమిన్-సి, బీటా కెరోటిన్ దోహదం చేస్తాయి. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. గుమ్మడికాయలోని ఫైబర్, పొటాషియం.. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. గుమ్మడికాయలోని యాంటీఆక్సిడెంట్లు చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తికి సహకరిస్తాయి. ఇందులోని విటమిన్లు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో గుమ్మడికాయ బాగా పని చేస్తుంది. మధుమేహాన్ని నివారించడంలో గుమ్మడికాయ దోహదం చేస్తుంది.


## చల్లగా ఉందని వేడి నీళ్లే తాగుతున్నారా?

శీతాకాలంలో రోజుకు ఎన్ని గ్లాసుల వేడి నీళ్లు తాగవచ్చు? రోజంతా వేడి నీళ్లు తాగడం సరైందేనా? ఒక రోజులో ఎంత వేడి నీరు తాగాలి? బరువు తగ్గాలన్నా లేదా కడుపు సంబంధిత సమస్యల నుండి ఉపశమనం పొందాలన్నా చాలా మంది ఎక్కువగా వేడి నీటిని ఆశ్రయిస్తారు. వేడి నీరు తాగడం ప్రయోజనకరమని నమ్ముతారు. శీతాకాలంలో చలి వాతావరణం వల్ల మనం తక్కువ నీరు తాగుతాము. ఎందుకంటే చలి దాహాన్ని తగ్గిస్తుంది. కొన్నిసార్లు మనం పనిలో బిజీగా ఉండ టం లేదా సోమరితనం వల్ల కూడా నీళ్లు తాగడం మర్చిపోతుంటాము.. కానీ మన శరీరాలకు వేసవిలో ఎంత హైడ్రేషన్ అవసరమో శీతాకాలంలో కూడా అంతే హైడ్రేషన్ అవసరమని తప్పక గుర్తించుకోవాలి. అందువల్ల చాలా మంది చలి కాలంలో వేడి నీళ్లు తాగాలని చెబుతుంటారు. శీతాకాలంలో శరీర జీవక్రియ కొద్దిగా నెమ్మదిస్తుంది. చల్లటి నీరు తాగడం వల్ల శరీరం చల్లగా అనిపిస్తుంది. దానిని వెచ్చగా ఉంచడానికి ఎక్కువ శక్తి అవసరం. వెచ్చని లేదా గోరువెచ్చని నీరు శరీరానికి మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. జలుబును నివారించడంలో కూడా సహాయపడుతుంది. చలికాలంలో వేడినీళ్లు తాగటం వల్ల శరీరం నిర్విషీకరణ మెరుగుపడుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. జీర్ణక్రియ బలపడుతుంది. గొంతు నొప్పి, జలుబు నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్యవంతుడైన వ్యక్తి రోజుకు 2.5 నుండి 3 లీటర్ల నీరు తాగాలని చెబుతున్నారు. శీతాకాలంలో మీరు ఈ నీటిని గోరువెచ్చగా లేదా కొద్దిగా వేడిగా తాగవచ్చు. అంటే రోజంతా 8 నుండి 10 గ్లాసుల వెచ్చని నీరు తాగొచ్చునని చెబుతున్నారు. కానీ ఇంత నీరు తాగడం అంటే మీరు ఒకేసారి ఎక్కువ మొత్తంలో తాగాలని కాదు. రోజంతా తక్కువ మొత్తంలో తాగుతూ ఉండాలి.



# సినిమా

## చికిరి చికిరి తెచ్చిపెట్టిన సమస్య



పెద్ది నుంచి చికిరి చికిరి సాంగ్ వచ్చి పది రోజులు దాటిపోయింది. అయినా దాని తాలూకు వైబ్స్ ఇంకా సోషల్ మీడియాలో కనిపిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా రీల్స్ బ్యాచ్ దీని మీద ఎన్ని లక్షల వీడియోలు చేసిందో లెక్క చెప్పడం కష్టం. అంతగా చొచ్చుకుపోయిన వైనం ఇన్స్ టా చూస్తే గమనించవచ్చు. ఏఆర్ రెహమాన్ నుంచి ఇంత పెద్ద చార్ట్ బస్టర్ ఆయన వీరాభిమానులు సైతం ఊహించలేదు. ముఖ్యంగా హిందీ వెర్షన్ తెచ్చుకున్న రీచ్ చూసి నిర్మాణ సంస్థ, దర్శకుడు బుచ్చిబాబు ఆశ్చర్యపోతున్నారు. ఇదే ఊపు మిగిలిన పాటలు, ట్రైలర్ కనక తీసుకురాగలిగితే ఉత్తరాది మార్కెట్ లో భారీ డిమాండ్ ఏర్పడుతుంది.అయితే చికిరి చిక్కిరి తెచ్చి పెట్టిన ప్రధాన సమస్య ఒకటుంది. దీని తర్వాత కొత్త సినిమాల లిరికల్ వీడియోలు ఏవి రిలీజైనా చికిరి స్థాయిలో ఉన్నాయని అనిపించుకోవడానికి తంటాలు పడుతున్నాయి. ఆంధ్రకింగ్ తాలూకాలోని ఫ్యాన్ సాంగ్, అఖండ 2 నుంచి వచ్చిన రెండు పాటలు వేటికవే బాగానే ఉన్నా రీచ్ పరంగా నెమ్మదిగా ఉన్న వైనం స్పష్టం. ఒకవేళ పెద్ది పాట కనక మేజిక్ చేయకపోయి ఉంటే మిగిలిన వాటి రీచ్ ఎక్కువగా ఉండేదన్న మాట వాస్తవం. ఈ మధ్య ఒక సాంగ్ రేంజుని కొలవాలంటే యూట్యూబ్ వ్యూస్ తో పాటు రీల్స్ సంఖ్య కొలమానంగా మారిపోయింది. ఇక్కడ చికిరి చికిరి డామినేషన్ కనిపిస్తోంది. ఇంకా దీని వేడి చల్లారకుండా రెండో పాట విడుదల చేసేందుకు టీమ్ రెడీ అవుతోందని సమాచారం. అయితే మన శంకరవరప్రసాద్ గారు కంటెంట్ తో క్లాష్ కాకుండా జాగ్రత్తలు తీసుకోబోతున్నారు. డిసెంబర్ చివరి వారంలో పెద్ది సెకండ్ సాంగ్ లాంచ్ గురించి ఆలోచిస్తున్నారు కానీ అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం ఉంటుంది.


## ఇంత సైలెంట్ అయితే ఎలా రాజ్?

ఉయ్యాలా జంపాలతో మొదలుపెట్టి కుమారి 21 ఎఫ్‌తో సూపర్ హిట్ అందుకున్న యూత్ హీరో రాజ్ తరుణ్‌కు తర్వాత తిరుగులేదని ఫ్యాన్స్ అనుకున్నారు కానీ వరస ఫ్లాపులతో కుర్రాడు మార్కెట్ ని రిస్క్ లో పెట్టేసుకున్నాడు. గత రెండేళ్లలో అతని సినిమాలు ఎన్ని రిలీజయ్యాయో ఠక్కున చెప్పడం కష్టం. కౌంట్ పెద్దదే కానీ ఏదీ కనీస ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. ఈ మధ్యే ఆహాలో చిరంజీవ అనే టైటిల్ తో ఓటిటి మూవీ చేశాడు. వ్యూస్ వచ్చి నట్టున్నాయి కానీ సోషల్ మీడియాలో టాక్ అవ్వ లేదు. నెటిజెన్ల దృష్టిలో పెద్దగా పడ లేదు. రివ్యూలు కూడా సోసోగా రావడంతో అంత మంచి టైటిలున్నా నిలబడలేదు. వీటి సంగతలా ఉంచితే రాజ్ తరుణ్ కొత్త సినిమా పాంచ్ మినార్ నవంబర్ 21 వస్తోంది. ఆ రోజు చాలా కాంపిటీషన్ ఉంది. అల్లరి నరేష్ 12 ఏ రైల్వేకాలనీ, ప్రియదర్శి ప్రేమంటేతో పాటు రాజు వెడ్స్ రాంబాయి, మఫ్టీ పోలీస్ లాంటి కంటెంట్లను నమ్ముకున్న అరడజను చిత్రాలు రేసులో ఉన్నాయి. వీటిలో మొదటి మూడు పెద్ద ఎత్తున ప్రమోషన్లు చేసుకున్నాయి. ప్రేమంటేకి నాగచైతన్యని గెస్టుగా తీసుకొచ్చి ఆడియన్స్ దృష్టిలో పడేలా చేశారు. రాంబాయి కోసం రేపు కిరణ్ అబ్బవరం వస్తున్నాడు. రైల్వేకాలని ప్రీ రిలీజ్ ఈవెంట్ చేసి హరీష్ శంకర్ లాంటోళ్లను గెస్టుగా తేవడం ద్వారా అటెన్షన్ పెంచుకున్నారు. పాంచ్ మినార్ కు కూడా చేశారు కానీ ఆడియన్స్ దృష్టిలో పూర్తిగా పడలేదు. కంటెంట్ మీద నమ్మకంతో రేపే పలు కేంద్రాల్లో ప్రీమియర్లు వేస్తున్నారు. సక్సెస్ కోసం తపించిపోతున్న రాజ్ తరుణ్ ఈసారి గ్యారెంటీ హిట్టు అంటున్నాడు. రామ్ కడుముల దర్శకత్వం వహించిన పాంచ్ మినార్ కు శేఖర్ చంద్ర సంగీతం సమకూర్చారు. అయినా ఏదో ఒక హడావిడితో వైరలయ్యేలా పబ్లిసిటీ చేస్తే తప్ప చిన్న సినిమాల వైపు జనం చూడటం లేదు. అలాంటిది పాంచ్ మినార్ రెగ్యులర్ ఫార్మాట్ లోకి వెళ్లడం సరిపోదు. ఇంకేదైనా క్రియేటివ్ గా చేయాలి. చూడాలి ఈసారైనా రాజ్ తరుణ్ ని విజయలక్ష్మి వరిస్తుందో లేదో.



## అభిమాని జీవితమే 'ఆంధ్ర కింగ్'

గత కొన్నేళ్లుగా ఎనర్జిటిక్ రామ్ సినిమా మీద ఎక్కువ పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్న సినిమా ఆంధ్రకింగ్ తాలూకానే . మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేమ్ మహేష్ బాబు దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ నవంబర్ 27 విడుదల కానుంది. మైత్రి మూవీ మేకర్స్ దీని కోసం పెద్ద బడ్జెట్ పెట్టింది. ఇవాళ కర్నూలులో ట్రైలర్ లాంచ్ తో పాటు గ్రాండ్ డ్రోన్ షో నిర్వహించారు. వేలాది అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగిన ఈ వేడుకలో రెండున్నర నిమిషాల వీడియో ద్వారా కథేంటో చెప్పేశారు. ప్రీమియర్ల కోసం హీరో హీరోయిన్ ప్రత్యేకంగా యుఎస్ వెళ్ళబోతున్నారంటేనే కంటెంట్ మీద నమ్మకం ఏ స్థాయిదో అర్థం చేసుకోవచ్చు.సగటు మధ్యతరగతి మాములు యువకుడు సాగర్ (రామ్). అతనికి స్టార్ హీరో సూర్య (ఉపేంద్ర) అంటే పిచ్చి. మొదటి రోజు మొదటి ఆట చూడటమే కాదు రిలీజ్ ని ఒక పండగలా జరుపుకోవడం అతనికున్న అలవాటు. ఇష్టపడిన అమ్మాయి మహాలక్ష్మి (భాగ్యశ్రీ బోర్సే)ని ప్రాణంగా ప్రేమిస్తాడు. అయితే ఒక సందర్భంలో [illegible] ఘోరంగా అవమానిస్తాడు. దీంతో సాగర్ బీచ్ ఒడ్డున స్వంతంగా టెంట్ హాలు కట్టుకుంటాడు.ఇతని తాపత్రయం తెలుసుకున్న సూర్య ఎలాగైనా సాగర్ ని కలుసుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఈలోగా అనూహ్య సంఘటనలు చోటు చేసుకుంటాయి. దర్శకుడు మహేష్ బాబు ఇప్పటిదాకా ఎవరూ టచ్ చేయని కాన్సెప్ట్ తీసుకున్నాడు. ఫ్యాన్, అభిమాని మధ్య ఎమోషన్ తీసుకుని ఇలాంటి స్టోరీ అల్లడం ఖచ్చితంగా కొత్త ప్రయత్నమే. దానికి తగ్గట్టు విజువల్స్ ప్రామిసింగ్ గా ఉన్నాయి. లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, వివేక్ మెర్విన్ సంగీతం వగైరాలు మంచి ఫీల్ తీసుకొచ్చాయి.



## కొత్త తరహా కంటెంట్‌తో వస్తున్నాం

జ్యోతి పూర్వజ్, పూర్వజ్, మనీష్ గిలాడ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సినిమా 'కిల్లర్'. చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వజ్, పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. పూర్వజ్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. తాజాగా, మూవీ మేకర్స్ ప్రమోషనల్ కంటెంట్ పెంచుకునేందుకు ఈ చిత్రం నుంచి 'ఫైర్ అండ్ ఐస్ సాంగ్' ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హీరోయిన్ జ్యోతి పూర్వజ్ మాట్లాడుతూ.. నేను డాక్టర్ కావాలనుకున్నాను. కానీ ఆ డ్రీమ్ పక్కనపెట్టి ఐటీ కంపెనీలో వర్క్ చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత సీరియల్స్ చేసి పాపులర్ అయ్యాను. ఇప్పుడు హీరోయిన్‌గా మీ ముందుకు వస్తున్నాను. ఇవన్నీ నేను లైఫ్‌లో ప్లాన్ చేయలేదు. అలా జరుగుతూ వస్తున్నాయి. యాక్టర్ అయ్యాక మంచి స్టంట్స్‌తో, యాక్షన్ మూవీ ఒకటి చేయాలని ఉండేది. ఆ విషయం పూర్వజ్‌కు చెప్పాను. ఒకవైపు మాస్టర్ పీస్ సినిమా జరుగుతుండగానే ఈ 'కిల్లర్' స్క్రిప్ట్ రెడీ చేశాడు. అది చదివాక మనం ఇంత భారీ స్కేల్‌లో సినిమా ఎలా చేయగలం అని అన్నాను. కానీ తనకున్న పరిచయాలతో, స్నేహితులతో చూస్తుండగానే రూపొందించాడు. ఇందులో పూర్వజ్ చెప్పినట్లు చేస్తూ వెళ్లా. ఒక కొత్త తరహా కంటెంట్‌తో మీ ముందుకు వస్తున్నాం. మమ్మల్ని ఎప్పటిలాగే సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా'' అని చెప్పుకొచ్చింది.



## ఇలాంటి క్యారెక్టర్స్ దొరకడం అరుదు

అఖిల్ రాజ్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది.సాయిలు కంపాటి దర్శకత్వంలో రాబోతుండగా.. నవంబర్ 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నారు. తాజాగా, జరిగిన ఇంటర్వ్యూలో హీరో, అఖిల్ రాజ్, హీరోయిన్ తేజస్విని సినిమా హైలైట్స్ తెలిపారు. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంలో నేను చేసిన రాజు పాత్ర ప్రతి అబ్బాయికి కనెక్ట్ అవుతుంది. ప్రతి ప్రేమలో బాధ, కోపం, సంతోషం ఉంటాయి. ప్రేమకు ఎదురయ్యే ప్రతి పరిస్థితిలో ధైర్యంగా నిలబడతాడు రాజు. నిజమైన ప్రేమలో ఉన్న ప్రేమికులు ఒకరి కోసం మరొకరు ఎంత బలంగా నిలబడతారు అనేది ఈ మూవీ కథ'' అని అన్నారు. అనంతరం హీరోయిన్ తేజస్వినీ మాట్లాడుతూ.. డైరెక్టర్ యదు వంశీ ద్వారా 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం గురించి తెలిసింది. ఇందులో రాంబాయి క్యారెక్టర్‌కు నేను సరిపోతానని సెలెక్ట్ చేశారు. రాంబాయి పాత్రలో అనేక లేయర్స్ ఉన్నాయి. తను ప్రేమికుడు రాజు దగ్గర క్యూట్ గా హ్యాపీగా ఉంటుంది. హీరోయిన్స్‌కు ఇలాంటి క్యారెక్టర్స్ దొరకడం అరుదు అనే చెప్పాలి. క్లైమాక్స్ పార్ట్ షూట్ చేస్తున్నప్పుడు పర్సనల్‌గా చాలా ఎమోషనల్ అయ్యాను. ఈ మూవీ చివరి 30 నిమిషాలు హార్డ్ హిట్టింగ్‌గా ఉంటుంది. నటించిన తర్వాత ఆ సీన్ నుంచి బయటకు రావడం కష్టంగా ఉంది. ఈ నెల 21న మా మూవీ చూసి థియేటర్స్ నుంచి బయటకు వచ్చిన ఆడియెన్స్ కూడా మేము ఇలా ఎందుకు చెబుతున్నామో అర్థం చేసుకుంటారు. రియలిస్టిక్ ఇన్సిడెంట్ ఆధారంగా రూపొందించినా కొంత సినిమాటిక్ లిబర్టీ కూడా మూవీలో ఉంటుంది'' అని చెప్పుకొచ్చింది.



## ఈ సినిమాపై ఇంత ప్రేమ చూపిస్తారని ఊహించలేదు..

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన మూవీ 'సంతాన ప్రాప్తిరస్తు'. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని సెంటర్స్ నుంచి సూపర్ హిట్ టాక్‌తో ప్రదర్శితమవుతోంది. మధుర ఎంటర్‌టైన్‌మెంట్స్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి రూపొందించారు. ''సంతాన ప్రాప్తిరస్తు'' సినిమా బాక్సాఫీస్ సక్సెస్ అందుకున్న నేపథ్యంలో ఈ మూవీ టీమ్ హైదరాబాద్ లో సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ చాందినీ చౌదరి మాట్లాడుతూ – మా 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమాను మీరంతా ఇష్టపడతారని అనుకున్నాము గానీ ఇంత ప్రేమ చూపిస్తారని ఊహించలేదు. నేను చేసిన కల్యాణి పాత్రకు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. మూవీ ప్రమోషన్స్‌లో టూర్స్‌కు వెళ్లినప్పుడు ఆడియెన్స్ కల్యాణి క్యారెక్టర్ తమకు బాగా నచ్చిందని చెబుతున్నారు. ఇలాంటి గుడ్ క్యారెక్టర్ డిజైన్ చేసి ఆ పాత్రను అందరికీ నచ్చేలా తీర్చిదిద్దిన ఘనత మా డైరెక్టర్ సంజీవ్ గారిదే. హీరో విక్రాంత్ సినిమా కోసం బాగా కష్టపడ్డాడు. అతనికి మరిన్ని సక్సెస్ ఫుల్ మూవీస్ దక్కాలని కోరుకుంటున్నా'' అన్నారు. ఇక హీరో విక్రాంత్ మాట్లాడుతూ – మూవీ కోసం పడిన కష్టాన్ని మర్చిపోయే విజయాన్ని ప్రేక్షకులు అందించారు. ఈ సినిమాతో నాకు ఒక ఫ్యామిలీని మీట్ అయినట్లు ఉంది. చాందినీ లేకుంటే ఇంత బాగా వచ్చేది కాదు. తను నాకు ఒక స్నేహితురాలిగా మారిపోయింది. ప్రేక్షకులు పైరసీని ఎంకరేజ్ చేయకుండా థియేటర్స్ కు వెళ్లి సినిమా చూడాలని కోరుతున్నా. మీరు థియేటర్స్ కు వెళ్తేనే మా లాంటి కొత్త హీరోస్ కు లైఫ్ ఉంటుంది. మా మూవీకి మీరు ఇస్తున్న కలెక్షన్స్‌తో హ్యాపీగా ఉన్నాం'' అని చెప్పారు.



## నితిన్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్



[illegible] లవ్ స్టోరీస్ లో ఇష్క్ కూడా ఒకటి. నితిన్ హీరోగా వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల మనసు దోచేసింది. ఈ చిత్రానికి బ్యూటిఫుల్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలోని పాటలు కూడా చార్ట్ బస్టర్ అయ్యాయి. ఒకటి రెండు పాటలు కాకుండా అన్ని పాటలకు శ్రోతలు ఫిదా అయ్యారు.

ఈ సినిమాతోనే నితిన్‌కు చాలా కాలం తరవాత హిట్ పడగా, ఇదే సినిమాతో దర్శకుడు విక్రమ్ కే కుమార్ డైరెక్టర్ గా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. సింపుల్ అండ్ క్యూట్ గా వచ్చిన ఈ లవ్ స్టోరీలో నిత్యా మీనన్ మరో హైలెట్ గా నిలిచింది. ఈ చిత్రం తరవాత వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చిన మరో సినిమా గుండెజారి గల్లంతయ్యిందే సైతం సూపర్ హిట్ గా నిలిచింది. ఇక ఇప్పుడు ఈ సినిమాకు పార్ట్ 2 రాబోతుంది. అఫీషియల్ గా ఈ సినిమాను చిత్ర యూనిట్ లాక్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాకుండా త్వరలోనే సినిమా షూటింగ్ కూడా ప్రారంభం కాబోతుంది. ఈ సినిమాలో హీరోగా నితిన్ నటిస్తుండగా దర్శకుడిగా విక్రమ్ కే కుమార్, సంగీత దర్శకుడిగా అనూఫ్ రూబెన్స్ చేయబోతున్నారు. అయితే హీరోయిన్ గా నిత్యానే ఉంటుందా మరెవరినైనా తీసుకుంటారా అనేదానిపై క్లారిటీ రావాల్సి ఉంది.

# పేదల పాలిట పెద్ద దిక్కుగా నిలిచిన సీఎం సహాయ నిధి

## – 62 మంది లబ్ధిదారులకు రూ.42 లక్షల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హనుమకొండ, నవంబర్ 19 (వుదయం జిల్లా ప్రతినిధి) : గత పాలకుల హయాంలో జరిగిన ఆర్థిక సంక్షోభం వల్ల ప్రజలు ఇబ్బంది కలగకూడదని సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో జాప్యం చేయడం లేదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం రోజున నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి గారితో కలిసి 11 వ మరియు 29 డివిజన్ వరంగల్ మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు రూ.42,59,096/–ల కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను మరియు మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. సహాయం అని కోరి క్యాంపు కార్యాలయం వచ్చిన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా సీఎం సహాయనిధి,ఇతరత్రా సహాయం అందిస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. గతంలో పర్సంటేజ్ లేకుంటే పనులు కాకపోయేవి కానీ పారదర్శకంగా ప్రజా ప్రభుత్వంలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు,డివిజన్ అధ్యక్షులు,మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాల నిర్మూలన సమిష్టి బాధ్యత

## –జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్ నవంబర్19 (వుదయం ప్రతినిధి): జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన అందరూ సమిష్టిగా కృషి చేసి బాల్య వివాహ రహిత జిల్లాగా నారాయణపేటను మార్చాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మహిళాభివృద్ధి– శిశు సంక్షేమ శాఖ–జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా బాలల రక్షణ పట్ల, వారి విద్య , సంరక్షణ,ఎదుగుదల, జిల్లా ఆకృతిని ప్రతిబింబించేలా రూపొందించిన లోగోను కలెక్టర్ తన ఛాంబర్ లో బుధవారం ఆవిష్కరించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ సహకరించాలని, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను క్షేత్రస్థాయిలో అందరికీ అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.



ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గాంగ్వర్, శ్రీను, ఆర్డిఓ రామ్ చందర్, డిప్యూటీ కలెక్టర్లు శ్రీరామ్ ప్రణీత్, ఫణి కుమార్, డీ పీ ఆర్ వో రషీద్, భగీరథ ఈ ఈ రంగా రావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీధర్, కోస్గి తహసిల్దార్ బక్క శ్రీనివాస్, జిల్లా బాలల సంరక్షణ అధికారిని కరిష్మా పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ అడుగుజాడల్లో నడవాలి



జన్నారం, నవంబర్ 19(వుదయం విలేకరి) ఇందిరా గాంధీ అడుగుజాడల్లో నడవాలని జన్నారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం రోజున జన్నారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి తొలి మహిళ ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ పని చేశారని భారతరత్న బిరుదు కూడా తీసుకున్న ధీర వనిత ఆమె అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు సయ్యద్ ఇసాక్, మచ్చ శంకరయ్య,, అజ్మీర నందు నాయక్, మామిడిపల్లి ఇందయ్య, దుమల్ల రమేష్, టేకుమట్ల పంకజ, లక్ష్మి, షాహిన్ ఫాతిమా, దాముక కరుణాకర్, ముత్యం సతీష్, దుర్గం గంగాధర్,హన్మంత రావు, సోషల్ మీడియా మండల కన్వీనర్ షాకీర్ అలీ, రాహుల్ యాదవ్, బాదావత్ శేషురావు, బోడ రవి నాయక్, అబ్దుల్ ముజ్జు, కస్తూరి భూమన్న, కటుకూరి రమేష్, కంప సుధీర్ కుమార్, జిలకర గంగన్న, యాతం నాగేష్, గట్టయ్య, జెల్ల బాపు, గాజుల సత్తయ్య, ఆరె శిరీష్ కుమార్, చంద్రయ్య, ఎండీ అజహర్ తదితరులు ఉన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో చోరీ



పెద్దవంగర, నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): దుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగిన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఆలయ పూజారి జిన్న సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గంట్లకుంట గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో తెల్లవారుజామున పూజ కోసం ఆలయానికి వెళ్లగా, గుడి తాళం పగులగొట్టి, తలుపులు తెరిచి ఉన్నాయి. ఆలయం లోపలికి వెళ్లి పరిశీలించగా, అమ్మవారి విగ్రహానికి అలంకరించిన బంగారు, వెండి (ముక్కు పుడక, కన్నులు, పట్టీలు) ఆభరణాలు అపహరించారు. వాటితో పాటు ఆలయ హుండీ ఎత్తుకెళ్లి, క్వారీలో పడేశారు. ఇటీవలే పెద్దవంగర దుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఆగంతకులు వరుసగా దుర్గమ్మ ఆలయాలను టార్గెట్ చేయడంతో మండల వాసులు ఉలిక్కిపడుతున్నారు.

# బీసీలను మోసం చేస్తున్న రెడ్డి వెలమ రాజకీయ పార్టీలు

## –టీఆర్పి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్



భూపాలపల్లి ,నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి పార్టీలకు వ్యతిరేకంగా నిరసన చేసి మీడియా సమావేశం అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేయడం జరిగింది రవి పటేల్ మాట్లాడుతూ గతంలో తీన్మార్ మల్లన్న చెప్పినట్టుగానే నిన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి క్యాబినెట్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశంలో బీసీలకు కాంగ్రెస్ పార్టీ తరఫున 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పడం జరిగింది మా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న మొదటి నుండి బీసీలను కాంగ్రెస్ బిజెపి టిఆర్ఎస్ పార్టీలు మోసం చేస్తున్నాయని చెబుతున్నాడు ఇప్పుడు అదే జరుగుతుంది రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు జరగబోయే శీతాకాల పార్లమెంటు సమావేశాలకు అన్ని పార్టీలను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంతో మాట్లాడి షెడ్యూల్ 9 లో చేర్చడం కోసం కృషి చేయాలి దానికి మద్దతుగా అన్ని పార్టీలు కూడా ద్వంద వైఖరి వీడి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం చిత్తశుద్ధితో పనిచేయాలి బీసీలకు జరుగుతున్న అన్యాయం విద్య ఉద్యోగ వ్యాపార అన్ని రంగాలలో దామాషా ప్రకారం దక్కవలసిన వాటి కోసం పుట్టిన పార్టీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ మేము మా కార్యాచరణ మా చిత్తశుద్ధి తో పనిచేస్తున్నాను ప్రజలు అందరు కూడా గమనించి ఈ రెడ్డి వెలముల పార్టీలను బొంద పెట్టవలసినటువంటి అవసరం ఉంది ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇనుగాల ప్రణయ్ రాజ్ గండు కరుణాకర్ తీన్మార్ జై అశోక్ శ్రీకాంత్ కిరణ్ పాల్గొన్నారు.

# దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ ఆందోళన



దమ్మపేట నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు పిలుపుమేరకు, అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే,బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆదేశాలతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మండల వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లమరమ్మత్తులు తక్షణమేచేపట్టాలని డిమాండ్ చేస్తూ మండల అధ్యక్షులు దొడ్డా రమేష్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ముందు కాంగ్రెస్ ప్రభుత్వనికి వ్యతిరేకంగా నినాదలతో నిరసన తెలియజేసి ఎంపీడీఓ కి వినతిపత్రం అందజేసినారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దొడ్డా రమేష్ మాట్లాడుతూ మండలంలో గుంతలు పడ్డ రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని,గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరై మొదలుపెట్టిన పనులు 70% పూర్తయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2సం.లు దాటినా వాటిని పట్టించుకోవడం లేదని వెంటనే ఆ పనులను పూర్తి చెయ్యాలని మరియు అన్ని గ్రామ పంచాయతీలలో అనేక సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని వాటన్నిటినీ పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, మండల ఉపాధ్యక్షుడు గాజుబోయిన యేసు బాబు, మాజీ సర్పంచ్ ఉయ్యాల చిన వెంకటేశ్వరావు, యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు,నాయకపోడు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రావుల శ్రీనివాసరావు,మహేష్,మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను, బీసీ సంఘం నాయకులు తాళ్ల వెంకటేశ్వరావు,మండల నాయకులు సోడెం గంగరాజు,కుకలకుంట రవి, అబ్దుల్ జిన్న,కోర్స వెంకటేశ్వరావు,ఎస్ సి సెల్ నాయకులు మద్దెల పుల్లారావు,తోలేం మల్లేశ్వరావు,వల్లెపు నాగేశ్వరావు,కేసిన మధు, వాడపల్లి ఆనంద్రావు,మిడత లక్ష్మీనారాయణ,గణేష్,నూతి అజయ్,మడిపల్లి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- ♦ డబ్ల్యూజేఐ నూతన కార్యవర్గాన్ని
- ♦ సన్మానించిన కేంద్రమంత్రి బండి సంజయ్



కరీంనగర్, నవంబర్,19(వుదయం ప్రతినిధి): సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లడంలో జర్నలిస్టుల నిరంతర శ్రమ ప్రశంస నీయమైనదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇటీవలే ఎన్నికైన బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా కరీంనగర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. కార్యవర్గ సభ్యులందరినీ శాలువాలతో సత్కరించారు. డబ్ల్యూజేఐ జిల్లా అధ్యక్షుడు దారం జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం కేంద్ర మంత్రిని ఆయన నివాస గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభమైన మీడియా నిజాలను నిర్భయంగా వెలికి తీయాలని, పూర్తి స్వతంత్రతతో పనిచేయాలని అన్నారు. జర్నలిస్టులు సమాజంలో నెలకొన్న సమస్యలను వెలికి తీసి సమాజాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని కేంద్రమంత్రికి డబ్ల్యూజెఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి సత్యనారాయణ పరిచయం చేశారు. అధ్యక్షుడు దారం జగన్నాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా మొగురం రమేష్,నర్సరీ కేదారి,ప్రధాన కార్యదర్శి గుడాల శ్రీనివాస్ , మహిళ కార్యదర్శి లావణ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులు రవీందర్, జి రమేష్, సంయుక్త కార్యదర్శి బూర్ల వెంకటేష్, కోశాధికారి చిటుమల్ల మహేందర్ కార్యవర్గ సభ్యులు జి రామకృష్ణ, కంది శ్రీనివాసరెడ్డి, పి సంతోష్ గౌడ్,జాలి నరేష్, కస్తూరి ప్రభాకర్, గంగం రాజు, కే రవీంద్ర చారి,సిహెచ్ వెంకటేష్, కే కుమార్, గుడికందుల దాసు తదితరులను కేంద్రమంత్రి ఘనంగా సన్మానించారు.

# సొమ్మొకడిది సోకు మరొకరిది

## –రేషన్ షాపుల్లో ఇచ్చే బస్తాలపై ప్రధాని ఫొటో పెట్టాలి
## –బీజేపీ జిల్లా కార్యదర్శి రామోగోని మహీధర్ గౌడ్



బెల్లంపల్లి, నవంబర్19 (వుదయం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం గరీబ్ అన్న, అంత్యోదయ యోజన ద్వారా ప్రతి రేషన్ కార్డులో ప్రతి ఒక్కరికి ఐదు కిలోల బియ్యం పంపిణి చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తామే ఇస్తున్నట్లు బస్తాలపై సీఎం, మంత్రి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఫొటోలు ముద్రించి దృష్టి ప్రచారం సాగిస్తుంతందని మంచిర్యాల జిల్లా బీజేపీ పార్టీ కార్యదర్శి రామోగోని మహీధర్ గౌడ్ ఒక ప్రకటనలో ఆక్షేపించారు. సొమ్ముఒకరిది సోకు ఒకరిదిగా వ్యవరిస్తుందని అన్నారు. కరోన కాలం నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తూ పేదల ఆకలి తిరుస్తున్నారని అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తామే బస్తాలు పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా బియ్యం ఉచితంగా ఇస్తున్న ప్రధాని నరేంద్రమోడీ ఫొటో పెట్టకపోవడం దారుణం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ బస్తాలు పంపిణీ చేస్తూ ఇప్పుడీ నుంచే ప్రచారం నివాహిస్తున్నారని అన్నారు. ఈ దుష్ట ప్రచారం పై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధి, గ్యారెంటీలు మరచి బస్తాలపై సిగ్గులేకుండా ఆరు గ్యారెంటీలని ముద్రించిన ఈ ప్రభుత్వానికి ప్రజలే రానున్న స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు.

# గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న బ్యాక్ లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలి

## –అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి కి వినతి పత్రం అందజేత.
## –తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్.



భూపాలపల్లి ,నవంబర్ 19 వుదయం (ప్రతినిధి):తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి కి వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న బ్యాక్ లాగ్ ఉద్యోగాలను గత కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు. వాటి కాల పరిమితి ఒక సంవత్సరం మాత్రమే కాని రిన్యూవల్ పేరుతో వాటిని యధావిధిగా ప్రభుత్వం కొనసాగిస్తున్నారని. దీనితో ఏజెన్సీ ప్రాంతం లోని ఆదివాసీ యువత ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో దాదాపు 3431 వివిధ ఉద్యోగాలు కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కొనసాగిస్తున్నారు అని, ఇందులో 1600 రెగ్యులర్ ఉద్యోగాలు, వీటిలో అత్యధికంగా 1317 ఉపాధ్యాయ పోస్టులు ఉన్న రెగ్యులర్ గా నింపకుండా ప్రభుత్వం మోసం చేస్తుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉండి సాంక్షన్ కానీ వాటిని వెంటనే సాంక్షన్ చేసి అన్నిటినీ రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి అని. అలాగే నాలుగేళ్లుగా టి ఆర్ ఐ సి ఓ ఆర్ రుణాలు అందక ఆదివాసీ యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని,వెంటనే ట్రైకర్ రుణాలు మంజూరు చేయాలని, ఆదివాసీ యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే సి ఎం ఎస్ టి ఐ పథకం అమలు కావడం లేదాంటే , యువత పట్ల ప్రభుత్వాలకు ఏమి బాధ్యత వున్నట్టు అని ప్రశ్నిచారు. యువత పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడలన్నారు, వెంటనే ఈ డిమాండ్స్ ని నెరవేర్చక పోతే పెద్ద ఎత్తున పోరాటాలకు పూనుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు అసోదుల కుమార్,ఆదివాసీ విద్యార్థి నాయకులు మడకం నిర్మా, వారితోపాటు వ్యవసాయ కార్మిక సంఘం ఎస్ఎఫ్ఐ కెవిపిఎస్ నాయకులు ఆత్కూరి శ్రీకాంత్ కుమార్ రాజ్ కుమార్ బొడ్డు స్మరణ ఆత్కూరి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# రాజ్యాంగ హక్కుల సాధన సభను విజయవంతం చేయాలి



జన్నారం,నవంబర్ 19(వుదయం విలేకరి) నవంబర్ 26న ఢిల్లీలో జాతీయ మాల మానాడు ఆధ్వర్యంలో జరిగే రాజ్యాంగ హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బెంజిమెన్ పిలుపునిచ్చారు. బుధవారం జన్నారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ హక్కుల సాధన సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి నిర్వహించే ఈ సభకు దళిత నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బండ దేవేందర్, జిల్లా నాయకులు దేవయ్య, రాజారావు,మండల నాయకులు ఉన్నారు.

# కడెం ప్రాజెక్టులో దూకి వ్యక్తి ఆత్మహత్య



ఖానాపూర్, నవంబర్ 19(వుదయం విలేకరి) ఖానాపూర్ నియోజకవర్గం,కడెం మండలం, కడెం ప్రాజెక్టులోకి దూకి కడెం మండల కాంగ్రెస్ నాయకుడు పాలకుర్తి కృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం ఉదయం కృష్ణ కడెం ప్రాజెక్టు వద్దకు వెళ్లి ప్రాజెక్టులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. దీంతో స్థానికులు, పోలీసులు ప్రాజెక్టులో కృష్ణ కోసం గాలించి ఆయన మృతదేహాన్ని బయటకు తీశారు. అందరితో కలిసిమెలిసి ఉండే కృష్ణ ఆత్మహత్యకు పాల్పడడంతో స్థానికులు దిగ్భ్రాంతి చెందారు. కడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు




జన్నారం, నవంబర్ 19(వుదయం విలేకరి) పట్టుదల ఉంటే దేనినైనా సాధించడం వీలవుతుందని జన్నారం మండలంలోని బాదంపల్లి జడ్పీ పాఠశాల హెచ్ఎం జాడి ప్రభాకర్ అన్నారు. సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలలో ఆ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎస్.కావ్య శ్రీ, ఎస్. శ్రావ్య మంచి ప్రతిభను కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. దీంతో విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ నరసయ్యను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

# తేమ శాతం తక్కువ ఉండేలా చూసుకోవాలి



జన్నారం, నవంబర్ 19(వుదయం విలేకరి) వరి ధాన్యంలో నిర్దేశిత ప్రమాణంలో తేమ శాతం ఉంటేనే వడ్లను కొనుగోలు చేయడం జరుగుతుందని జన్నారం మండలంలోని పోన్కల్ క్లస్టర్ ఏఈఓ త్రిసంధ్య తెలిపారు. బుధవారం ఆమె మార్కెట్ యార్డ్ లో రైతులు ఎండకు ఆరబోసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దాన్యంలో తాలా, తప్ప లేకుండా చూసుకోవాలని సూచించారు 17శాతం తేమ ఉండేలా సరిచూసుకొని కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని రైతులు తీసుకురావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

# ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



భూపాలపల్లి ,నవంబర్ 19 (వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరుకొత్తపల్లి మండల కేంద్రంలో భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జన్మదిన శుభాకాంక్షలు జరుపు కున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు. గోరుకొత్తపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ఉపాధ్యక్షులు ఈర్ల శ్యామ్ ఆధ్వర్యంలో శ్రీమతి ఇందిరాగాంధీ జన్మదిన వేడుకలు జరుపుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేయడం జరిగింది మరియు ఇందిరా గాంధీ గారు భారతదేశానికి చేసిన ఎన్నో అభివృద్ధి పనులను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈర్ల రాంబాబు, టౌన్ ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు ఈర్ల రాజేశ్, మండల్ నాయకులు యాకు బాబు, గ్రామ యూత్ నాయకులు బొమ్మకంటీ అజయ్, ఈర్ల రజనీకాంత్ బొమ్మ కంటి బాబు యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు ఈర్ల పవన్ కళ్యాణ్ గ్రామ కమిటీ నాయకులు భాస్కర్ కొమ్ముల తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# అలా చేస్తే రాజకీయాలనుంచి తప్పుకుంటా



బిహార్ ఎన్నికల ఫలితాలపై జన సూరజ్ పార్టీ అధినేత విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మహిళలకు రూ. 10 వేల చొప్పున అకౌంట్లలో వేయకపోతే జేడీయూ పార్టీకి ఖచ్చితంగా 25లోపు సీట్లు వచ్చేయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన రూ.2 లక్షల హామీని కూటమి ప్రభుత్వం నెరవేరిస్తే తాను రాజకీయాలనుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ?ప్రశాంత్ కిషోర్ సవాల్ విసిరారు. జేడీయూ పార్టీ మహిళలలకు రూ. 2లక్షలు ఇస్తానని ఆశజూపి ప్రతి మహిళ బ్యాంకు ఖాతాలలో తొలివిడతగా రూ.10 వేలు జమచేసిందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. ఇలా ఒక్కో నియోజకవర్గానికి 10 వేల నుండి 60 వేల మంది వరకూ డబ్బులు జమచేసిందన్నారు. ఒక వేళ ఆ విధంగా చేయకుంటే తాను అంచనా వేసిన విధంగా జేడీయూకి 25 సీట్లు దాటేవి కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.5 కోట్ల మంది మహిళలకు స్వయం ఉపాది కార్యక్రమాలకు గానూ రూ. 2 లక్షలు ఖాతాల్లో జమ చేస్తానని హామీ ఇచ్చిందని తెలిపారు ఒకవేళ ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చిన విధంగా 1.5 కోట్ల మంది మహిళలకు స్వయం ఉపాధి కార్యక్రమాలకు ఆ డబ్బులు చెల్లిస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రశాంత్ కిషోర్ సవాల్ విసిరారు. ఇటీవల జరిగిన బిహార్ ఎన్నికల్లో పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిషోర్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఆ ఎన్నికల్లో 200కు పైగా స్థానాల్లో పోటీ చేసినప్పటికీ కనీసం ఒక్కచోట కూడా ?జన సూరజ్ పార్టీ విజయం సాధించలేదు దీంతో ప్రశాంత్ కిషోర్ పై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలపై ప్రశాంత్ కిషోర్ స్పందించారు. బిహార్ ఎన్నికల్లో ఓటమికి తానే పూర్తిస్థాయి బాధ్యత వహిస్తున్నానని ఎన్నికల్లో గెలవడానికి సిరీయస్‌గా కష్టపడ్డప్పటికీ ఓట్లు సాధించడంలో విఫలమయ్యామన్నారు. అందుకు గానూ తనను క్షమించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఓట్లచోరీ జరుగుతుందని ఈ విషయమై జాతీయ పార్టీలంతా చర్చలు జరపాలని అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని పీకే కోరారు. ఎన్డీఏ కూటమి ఎన్నికల హామీల్లో ఇ?చ్చిన విధంగా 6 నెలల్లో మహిళల రూ. 2లక్షలు జమచేయకపోతే జన సూరజ్ పార్టీ వారి పక్షాన పోరాడుతుందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు.

# శబరిమలలో జనమేజనం..! భక్తులపై ఆంక్షలు



**పథనంతిట్ట:** ముందెన్నడూ లేనివిధంగా మండల పూజ ప్రారంభం నుంచే శబరిమలకు అయ్యప్ప భక్తులు పోటెత్తారు. ఆదివారం సాయంత్రం సన్నిధానంలో అయ్యప్ప స్వామి ఆల యం తలుపులు తెరుచుకోగా.. సోమవారం రికార్డు స్థాయిలో 1.25 లక్షల మంది భక్తులు ఆ హరిహరపుత్రుడిని దర్శించు కున్నారు. నిజానికి ఆన్‌లైన్‌లో రోజుకు 70 వేల మందికి స్లాట్ బుకింగ్ అవకాశం కల్పించారు. అదనంగా 20వేల మందికి స్పాట్ బుకింగ్‌కు ఏర్పాట్లు చేశారు. అ యితే.. సోమవారం ఏకంగా 37 వేల మంది భక్తులు స్పాట్ బుకింగ్ చేసుకున్నా రని, అందుకే రద్దీ విపరీతంగా పెరిగిందని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) అధికారులు చెబుతున్నారు.

**భారీ క్యూలైన్లు**

సోమవారం నుంచి నీలక్కల్, పంపాబేస్, శబరిమల సన్నిధానం కిక్కిరిసిపోయింది. ఎక్కడ చూసినా.. ఇసుకేస్తే రాలనంతగా భక్తులు కనిపిస్తున్నారు. పంపా కంట్రోల్ రూమ్ వద్ద బస్సు దిగిన భక్తులు త్రివేణీ బ్రిడ్జిని దాటడానికి అరగంట పట్టిందని, అక్కడి నుంచి పంపా గణపతి ఆలయానికి చేరుకోవడానికి గంట సమయం పట్టిందని కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్‌కు చెందిన సుందరేశ అనే భక్తుడు 'సాక్షి డిజిటల్'కి వివరించారు. ఇక శరణ్‌గుత్తి ప్రాంతంలోనూ నిమిషానికి నాలుగు అడుగులు వేసేలా రద్దీ ఉందని హైదరాబాద్‌కు చెందిన పవన్ కుమార్ గురుస్వామి వివరించారు. మారక్కూటం నుంచి 18 మెట్ల వరకు గంట సమయం.. పదునెట్టాంబడిని అధిరోహించాక.. అయ్యప్ప స్వామి దర్శనానికి మరో గంట పడుతోందని పేర్కొన్నారు. వృద్ధులు, చిన్నారులను నేరుగా ధ్వజస్తంభం నుంచి అయ్యప్ప దర్శనానికి వదులుతున్నా.. 18 మెట్లను చేరేవరకు వారికి ఇబ్బందులు తప్పడం లేదని సైదాబాద్‌కు చెందిన రవికుమార్ గురుస్వామి తెలిపారు. నీలిమలను అధిరోహించినప్పటి నుంచి భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకోవడానికి 6 గంటల సమయం పడుతున్నట్లు వివరించారు.

**నీలక్కల్‌లోనే నిలిపివేత**

భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో పంపాలో స్పాట్ బుకింగ్ కౌంటర్ల సంఖ్యను 7కు పెంచినట్లు అధికారులు తెలిపారు. అయితే.. పంపా బేస్‌లో రద్దీని బట్టి ఆన్‌లైన్ బుకింగ్ లేని భక్తులను నీలక్కల్‌లో నిలిపివేస్తున్నామన్నారు. నీలక్కల్‌లో భక్తులకు వసతి సదుపాయాలున్నాయని వెల్లడించారు. అటు పంపాబేస్ నుంచి నీలిమలను అధిరోహించాక శరణ్‌గుత్తి, మారక్కూటం క్యూకాంప్లెక్సుల్లో తాగునీరు, స్నాక్స్, టీ, కాఫీ అందజేసే వెసులుబాట్లు కల్పిస్తామన్నారు. ప్రతిచోట సిబ్బందిని నియమించామన్నారు. రద్దీని అదుపుచేయడానికి ఎక్కడికక్కడ పోలీసులను మోహరించినట్లు అదనపు డీజీపీ ఎస్.శ్రీజిత్ వివరించారు. భక్తులు పరిస్థితిని అర్థం చేసుకుని, పోలీసులకు సహకరించాలని కోరారు. "సోమవారం 20 వేల మందికి స్పాట్ బుకింగ్‌కు ఏర్పాట్లు చేశాం. అయితే.. 37 వేల మంది భక్తులు వచ్చారు. అందుకే.. బుధవారం నుంచి 20 వేల స్పాట్ బుకింగ్ నిబంధనను కచ్చితంగా పాటిస్తాం. అదనంగా వచ్చే భక్తులకు తర్వాతి రోజు స్లాట్లను కేటాయిస్తాం" అని ఆయన వెల్లడించారు. ఈ సీజన్‌లో మంగళవారం మధ్యాహ్నం వరకు 1.97 లక్షల మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నట్లు తెలిపారు.

**నీలక్కల్ వద్ద భారీగా ట్రాఫిక్**

శబరిమలకు వ్యక్తిగత వాహనాల్లో వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో.. ఎరుమేలి-పంపా, రాణి-పంపా మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్‌లు నెలకొంటున్నాయి. ముఖ్యంగా ప్లాపల్లి, నీలక్కల్ వద్ద వాహనాలు నత్తనడకను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరిన్ని ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కాగా.. అప్పాచిమేడు ప్రాంతంలో ఓ భక్తురాలు కుప్పకూలి మృతిచెందారు. ఆమెను కోళికోడ్ జిల్లా కోయిలాండికి చెందిన సతీ(58)గా పోలీసులు గుర్తించారు. భారీ క్యూలైన్ల కారణంగా ఆమె ఊపిరి ఆడక.. ఉక్కిరిబిక్కిరి అయ్యి.. మరణించినట్లు తెలుస్తోంది.

# 'ఇల్లా.. ఇంద్ర భవనాలా?' కొత్త ఎమ్మెల్యేలకు పండుగే!



**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలు నూతన సర్కారు నుంచి బంపర్ బహుమతి అందుకోనున్నారు. కొత్తగా ఎన్నికైన 243 మంది ఎమ్మెల్యేల కోసం పట్నాలోని దరోగా రాయ్ పాత్‌లో నిర్మించిన 181 అధునాతన డ్యూప్లెక్స్‌ల నిర్మాణం పూర్తయ్యింది. అంతకు ముందు ఉన్న 62 బంగ్లాలకు అదనంగా నిర్మించిన ఈ నివాసాలు మొత్తం 44 ఎకరాల క్యాంపస్‌లో విస్తరించి ఉన్నాయి. ఈ నూతన భవనాలను చూసినవారంతా ఇవి 'ఇల్లా.. ఇంద్ర భవనాలా?'అని అంటున్నారు. ప్రతి యూనిట్ సుమారు 3,693-3,700 చదరపు అడుగుల విస్తీర్ణంతో 4%దీఎఖ% ఫార్మాట్‌లో ఈ ఇళ్లను నిర్మించారు. వాటిలో విలాసవంతమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రతి డ్యూప్లెక్స్ లేఅవుట్ ఎంతో ప్లానింగ్‌తో కనిపిస్తుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎమ్మెల్యేలకు అవసరమైన గెస్ట్ రూమ్, పీఏ రూమ్, ఆఫీస్ రూమ్,కిచెన్ ఉన్నాయి. మొదటి అంతస్తులో మాస్టర్ బెడ్‌రూమ్‌తో సహా మూడు గదులు, మొత్తం ఆరు టాయిలెట్‌లు ఉన్నాయి. అన్ని గదులలో ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే హాస్టల్, క్యాంటీన్, కమ్యూనిటీ సెంటర్ తదితర అదనపు సౌకర్యాలను క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. ఈ కొత్త కాంప్లెక్స్ పర్యావరణ అనుకూలతలతో నిర్మితమయ్యింది. భవన నిర్మాణంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశారు. వర్షపునీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేయడంతో పాటు, మురుగునీటిని శుద్ధి చేసి, తోటల పెంపకానికి తిరిగి ఉపయోగించే ప్రక్రియను అమలు చేస్తున్నారు. విద్యుత్తును ఆదా చేయడానికి ఎల్‌ఈడీ వీధి దీపాలను వినియోగిస్తున్నారు. క్యాంపస్‌లో పచ్చదనాన్ని పెంపొందించడానికి పచ్చని చెట్లను పెద్ద ఎత్తున నాటారు. ఈ అత్యాధునిక సౌకర్యాలు, పర్యావరణ అనుకూల చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రతి డ్యూప్లెక్స్‌పై దానిని కేటాయించిన ఎమ్మెల్యే పేరు, నియోజకవర్గ సంఖ్యను రాశారు. తద్వారా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ప్రజలతో మరింత సమర్థవంతంగా కనెక్ట్ అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది.

## ఉగ్రదాడులు.. బిర్యానీ, దావత్ వంటి కోడ్ నేమ్స్‌తో సంభాషించుకున్న వైద్యులు



ఢిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. హర్యానాలోని ఫరీదాబాద్‌లో బయటపడ్డ వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ సభ్యులను అధికారులు విచారిస్తున్నారు. వారి ఫోన్లను కూడా స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. ఈ దర్యాప్తులో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. వారి చాట్స్‌లో కొన్ని కోడ్ పదాలు బయటపడ్డాయి. టెర్రర్ వైద్యులు ఎవరికీ అనుమానం రాకుండా ఉండటానికి బాంబు, దాడి కుట్రల గురించి చర్చించడానికి బిర్యానీ దావత్ వంటి పదాలను ఉపయోగించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఉగ్రనెట్‌వర్క్‌లో కీలకంగా వ్యవహరించిన డాక్టర్ షాహిన్ సాహిద్‌ను 'మేడమ్ సర్జన్'గా పిలిచేవారని తేలింది. అంతేకాదు, అలాంటి మరికొన్ని కోడ్ నేమ్‌లు బయటకు వచ్చాయి. ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లో కమ్యూనికేషన్ కోసం ఇలాంటి పదాలను వాడినట్లు అధికారులు గుర్తించారు. బిర్యానీని పేలుడు పదార్థాలకు కోడ్ పదంగా, దావత్‌ను దాడికి కోడ్ పదంగా ఉపయోగించినట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. ఢిల్లీ పేలుళ్ల వెనుక ఉన్న వైద్యులు ముజమ్మిల్ షకీల్, ఉమర్ ఉన్ నబీ, షాహీన్ సయీద్, అదీల్ రాదర్.. ఇవే కోడ్ పదాలతో దాడి గురించి చర్చించుకున్నట్లు తేలింది. 'బిర్యానీ ఈజ్ రెడీ.. తినేందుకు సిద్ధం కండి' అంటే దాడి కోసం బాంబు సిద్ధంగా ఉందని అర్థంగా అధికారులు గుర్తించారు

## ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది



భారత ప్రజలను ఉగ్రవాదం నుంచి రక్షించుకునే హక్కు దేశానికి ఉందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. రష్యాలో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో ఆయన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గట్టిగా మాట్లాడారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని సహించకూడదని ఆయన అన్నారు. ఉగ్రవాదం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించే ధోరణి ఉండకూడదని ఆయన తేల్చి చెప్పారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించరాదని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం అనేది ఉమ్మడి ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా జైశంకర్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్నారు. అంతకుముందు రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లవ్రోవ్‌తో ఆయన సమావేశమయ్యారు. ఇరువురు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరిపినట్లు సమాచారం.

## ఏఐతో అన్ని కంపెనీలపై ప్రభావం పడుతుంది



**లాస్ ఏంజిల్స్:** కృత్రిమ మేధ గురించి గూగుల్ సంస్థకు చెందిన ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఏఐ విస్ఫోటనం చెందితే, దాని ప్రభావం అన్ని కంపెనీలపై ఉంటుందన్నారు. ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెట్టుబడులు పెరుగుతున్నాయని, ఇదో అసాధారణ సందర్భమని, ప్రస్తుతం కొనసాగుతున్న ఏఐ బూమ్‌లో హేతుబద్ధత లేదన్నారు. అన్ని కంపెనీలు ఏఐపై అతిగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వస్తున్న వార్తలతో సిలికాన్ వ్యాలీలో కొంత ఆందోళనకరమైన అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఏఐ విస్ఫోటనాన్ని ఎదుర్కొనే రీతిలో గూగుల్ సంస్థ సిద్ధంగా ఉందా అని అడిగిన ప్రశ్నకు సుందర్ పిచాయ్ బదులిస్తూ.. ఆ తుఫాన్‌ను తమ కంపెనీ తట్టుకుటుందని, కానీ ఏదైనా సాధ్యమే అని ఆయన వార్నింగ్ ఇచ్చారు. నిజం చెప్పాలంటే ఏ కంపెనీ కూడా ప్రభావానికి లోనుకాకుండా ఉండలేదన్నారు. ఆ జాబితాలో తాము కూడా ఉంటామన్నారు. చాట్‌జీపీటీ, ఓపెన్‌ఏఐతో పోటీ ఉన్న నేపథ్యంలో ఆల్ఫాబెట్‌కు పెట్టుబడులు రెట్టింపు అయ్యాయి. ఏఐకి చెందిన సూపర్ చిప్స్‌ను ఆల్ఫా సంస్థ డెవలప్ చేస్తున్నది. ఏఐ చెప్పే విషయాన్ని గుడ్డిగా నమ్మకూడదని పిచాయ్ అన్నారు.

## ఈవీఎంను ట్యాంపరింగ్ చేయడం అసాధ్యం




బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందే ఈవీఎంలలో 25 వేల ఓట్ల చొప్పున ఓట్లు పడ్డాయన్న ఆర్జేడీ సీనియర్ నేత జగదానంద సింగ్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. ఆయన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపింది. బీహార్ తీర్పు ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించలేదని, ఈవీఎంలలో అవకతవకలు జరిగినందున న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేకపోలేదని ఆర్జేడీ సోమవారం పేర్కొంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ప్రతి ఈవీఎంలలో 25 వేల ఓట్లు పడ్డాయని, అయినప్పటికీ తాము 25 సీట్లు సాధించామని జగదానంద సింగ్ అన్నారు. ఈ ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం, ఇది సాంకేతికంగా అసాధ్యమని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో అనుసరించిన నిబంధనల ప్రకారం ఇవి తప్పుడు ఆరోపణలని పేర్కొంది. పోలింగ్‌కు ముందు 25 వేల ఓట్లు ఉండటం అనేది అసాధ్యమని తెలిపింది. ఈవీఎంలకు బ్లూటూత్, ఇంటర్నెట్, ఇతర కనెక్షన్లు ఏవీ ఉండవని గుర్తు చేసింది. బయటి నుంచి ఈవీఎంను యాక్సెస్ చేయడం లేదా డిజిటల్ ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని తెలిపింది. పోలింగ్‌కు ముందు ఈవీఎంలలో ప్రతి అభ్యర్థికి సున్నా ఓట్లు కనిపిస్తాయని తెలిపింది. పార్టీల ఏజెంట్ల సమక్షంలోనే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని తెలిపింది. ఆ తర్వాత మాక్ పోల్ ఓట్లను కూడా తొలగిస్తారని వెల్లడించింది. ఈవీఎంల పంపిణీ కూడా ర్యాండమ్‌గా ఉంటుందని, కాబట్టి ఏ ఓటింగ్ యంత్రం ఏ పోలింగ్ కేంద్రానికి వెళుతుందో ఎవరూ చెప్పలేరని స్పష్టం చేసింది. పోలింగ్ ప్రక్రియ ప్రతి దశలో పార్టీల ఏజెంట్లు ఉంటారని తెలిపింది. రెండు విడతల్లోనూ ఆర్జేడీ ఒక్కసారి కూడా అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల సంఘం తెలిపింది. జగదానంద్ సింగ్ కూడా ఆధారాలను సమర్పించలేదని వెల్లడించింది. మాక్ పోల్ సర్టిఫికెట్లు, ఫామ్ 17సీ, ఇతర పత్రాలపై ఆర్జేడీ సొంత ఏజెంట్లు సంతకం చేశారని తెలిపింది. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా ఆరోపణలు చేస్తున్నట్లు పేర్కొంది.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.